# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 23 మార్చి 2026 | సంపుటి: 22 | సంచిక: 175 | వెల: రూ.7 | పేజీలు: 12+12

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


## డ్రైవింగ్ లైసెన్స్ ఇక కఠినం

### కొత్తగా ఆన్‌లైన్ టెస్ట్ తప్పనిసరి



తెలంగాణలో డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియలో రాష్ట్ర రవాణా శాఖ కీలక మార్పులు తీసుకువస్తోంది. రోడ్డు ప్రమాదాలను అరికట్టే లక్ష్యంతో ఇకపై లైసెన్స్ పొందాలంటే కొత్తగా ఓ ఆన్‌లైన్ పరీక్షను తప్పనిసరి చేయనుంది. ఇప్పటికే ఉన్న లెర్నర్ లైసెన్స్, డ్రైవింగ్ టెస్ట్‌లకు అదనంగా ఈ 'రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్' పరీక్షను తీసుకువస్తున్నారు. ఈ కొత్త విధానం ఏప్రిల్ మొదటి వారం నుంచి అమలులోకి రానుంది. కొత్త నిబంధన ప్రకారం ఎల్ఎల్ఆర్ కోసం దరఖాస్తు చేసే ముందే అభ్యర్థులు మూడు గంటల పాటు ఆన్‌లైన్‌లో రోడ్డు భద్రతా పాఠాలు వినాలి.

**- హైదరాబాద్ (నినాదం)**

2

# మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

## మహిళా సంఘాలను కోటీశ్వరులుగా మారుస్తాం: సీఎం హామీ

## రైతులకు రూ. 3,600 కోట్ల రైతు భరోసా నిధుల విడుదల



### కేసీఆర్ హయాంలో కంటే రెట్టింపు ఖర్చు: సీఎం రేవంత్ రెడ్డి

### పామాయిల్ సాగుకు ప్రోత్సాహం.. వ్యవసాయంలో కొత్త దిశ

**సిద్దిపేట, మార్చి 22 (నినాదం):** "ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు" అనే నానుడిని నిజం చేస్తూ తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సిద్దిపేటలో నిర్వహించిన రైతు ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన, అన్నదాతలకు సాగు పెట్టుబడి సాయం కింద రూ. 3,600 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ నిధులు సుమారు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రేపటికల్లా జమ అవుతాయని, మిగిలిన వారికి కూడా మరో 45 రోజుల్లో రైతు భరోసా అందుతుందని ఆయన హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ పాలనతో పోలిస్తే తమ ప్రభుత్వం రైతులకు రెట్టింపు సాయం అందిస్తోందని సీఎం గణాంకాలతో వివరించారు. కేసీఆర్ హయాంలో నెలకు సగటున రూ. 2,533 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నెలా రూ. 5,500 కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. గత 28 నెలల కాలంలో రైతుల కోసం ఏకంగా లక్షా 40 వేల కోట్లు ఖర్చు చేశామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే

...మిగతా 2లో

### సిద్దిపేట నుంచి గెలిచిన వారికి మంత్రి పదవి

కాంగ్రెస్ నేతలకు సీఎం బంపరాఫర్

***2029లోనూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి రాబోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ గెలవాలని సిద్దిపేటలో గెలిచి ఎమ్మెల్యేను మంత్రిని చేస్తామని హామీ ఇచ్చారు.***

నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

2



## భారత్ చేరిన అమెరికా ఎల్‌పీజీ నౌక

**మంగళూరు (నినాదం)**

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా చమురు, ఎల్‌పీజీ సరఫరా గొలుసుకు అంతరాయం ఏర్పడింది. దీంతో దేశంలో ముఖ్యంగా ఎల్‌పీజీకి కొరత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో భారత్‌కు ఊరటనిచ్చేలా అమెరికాకు చెందిన ఎల్‌పీజీ నౌక భారత్‌కు చేరింది. అమెరికాలోని టెక్సాస్ నుంచి బయల్దేరిన పయనీర్ నౌక ఎల్‌పీజీ లోడ్‌తో కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు ఆదివారం చేరుకుంది.

2



## హైదరాబాద్ నిర్మాణంలో మా పాత్ర కీలకం

### ఏపీ సీఎం చంద్రబాబు మరోసారి కీలక వ్యాఖ్యలు

2

**హైదరాబాద్ (నినాదం)**

అభివృద్ధి ఒక్కటే ఎన్నికల్లో గెలిపించదని, కానీ సమాజ మార్పునకు సాంకేతికతే మూలమని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వేదికగా సౌత్‌ఏషియా లెర్నింగ్ సమ్మిట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా AI వినియోగం, డేటా భద్రత, భవిష్యత్తు సాంకేతికతలపై చంద్రబాబు ప్రసంగం చేశారు.



2

## హైడ్రా చర్యల్లో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

### కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్

**హైదరాబాద్ (నినాదం)**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంధ్వ వైఖరితో వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తూ ఎంఐఎం పార్టీకి చెందిన నేతల ఆక్రమణలను మాత్రం వదిలేస్తోందని ధ్వజమెత్తారు.



## ఆర్టీఐ దరఖాస్తుకి జవాబు ఇవ్వాల్సిందే

### తప్పుదారి పట్టిస్తే చర్యలు తప్పవు

- ఆర్టీఐ కమిషన్ కఠిన హెచ్చరిక
- గురుకులాల సమాచారం రెండు వారాల్లో ఇవ్వాలి
- ఉమ్మడి జిల్లా ఎస్టీ గురుకులాల పీఐవోలకు ఆదేశాలు

5



## 25న రాజీనామాకు ముహూర్తం

### ఇక కాంగ్రెస్‌లో కొనసాగలేను

### జీవన్ రెడ్డి ప్రకటన

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పార్టీలో తనకు సరైన గౌరవం లభించడం లేదన్న తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన, కాంగ్రెస్‌ను వీడాలని దాదాపుగా నిర్ణయించుకున్నారు. ఈ పరిణామం తెలంగాణ కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది. ఈ సంక్షోభాన్ని నివారించేందుకు మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో సుదీర్ఘంగా చర్చించారు. సీఎం రేవంత్ రెడ్డి, ఇతర హైకమాండ్ ప్రతినిధులు కూడా ఫోన్‌లో మాట్లాడి నచ్చజెప్పే ప్రయత్నం చేసినట్లు సమాచారం. అయితే, వారి ప్రతిపాదనలను జీవన్ రెడ్డి సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది.

**-జగిత్యాల ప్రతినిధి (నినాదం)**

2



## పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ఇంధన కొరతపై ప్రధాని సమీక్ష

### మంత్రులతో ప్రధాని మోదీ భేటీ

### నిరంతరంగా ఇంధన సరఫరా చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష

**న్యూఢిల్లీ, మార్చి 22 (నినాదం):** పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో పెట్రోలియం, విద్యుత్, ఎరువుల రంగాల స్థితిగతులను సమీక్షించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కీలక సమావేశం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం సీనియర్ మంత్రులతో సమావేశమయ్యారు. దేశవ్యాప్తంగా నిరంతర సరఫరా, సమర్థ పంపిణీపై ప్రధాని మోదీ చర్చించారు. వినియోగదారులు, పరిశ్రమల ప్రయోజనాలను కాపాడటానికి కేంద్రం అంతర్జాతీయ పరిణామాలను నిరంతరం పరిశీలిస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ తన ఆధీనంలో ఉంచుకుంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ చాలా తక్కువ నౌకలను మాత్రమే దీని గుండా అనుమతిస్తోంది. ఈ దిగ్బంధం వల్ల భారత్ సహా అనేక

...మిగతా 2లో



## బిల్డింగ్ రూల్స్‌లో మార్పులు

### టీడీఆర్‌పై కొత్త గైడ్‌లైన్స్ జారీ

**హైదరాబాద్, మార్చి 22 (నినాదం):** తెలంగాణలో భవన నిర్మాణ నిబంధనలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) వినియోగంపై కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు

...మిగతా 2లో

## ఇక ₹10 లక్షలు దాటితే..... ఏప్రిల్ 1 నుంచి కొత్త పరిమితులు



**న్యూఢిల్లీ, మార్చి 22 (నినాదం):** ఆర్థిక లావాదేవీల్లో నిత్యం ఉపయోగించే శాశ్వత గుర్తింపు సంఖ్య (పీఏఎన్)కు సంబంధించి కేంద్రం కొన్ని మార్పులు చేపట్టింది. లావాదేవీ పరిమితులను గణనీయంగా పెంచింది. కొత్త ఆదాయపు పన్ను చట్టం–2025 అమలులో భాగంగా కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఆదాయపు పన్ను నిబంధనలు–2026ను నోటిఫై చేసింది. ఇందులో భాగంగా పాన్‌కు సంబంధించిన లావాదేవీ పరిమితులను సవరించింది. ఏప్రిల్ 1 నుంచి ఈ మార్పులు అమల్లోకి రానున్నాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో ఖాతాలో రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదు ఒకేసారి లేదా విడతల

...మిగతా 2లో

## మారనున్న పాలిటెక్నిక్, ఐటీఐల భవిష్యత్

### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి విద్యలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో, రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కాలేజీలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను (గతంలో ఐటీఐలు) తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏకీకరణతో నైపుణ్య శిక్షణకు సంబంధించిన అన్ని సంస్థలు ఒకే గొడుగు కిందకు రానున్నాయి. **–హైదరాబాద్ (నినాదం)**



2



2

## జైళ్లలో రద్దీపై సుప్రీంకోర్టు ఆందోళన

### రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కీలక ఆదేశాలు

**జైళ్లలో రద్దీ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై నివేదిక ఇవ్వాలన్న సుప్రీంకోర్టు**

*దేశవ్యాప్తంగా జైళ్లలో రద్దీ ఎక్కువగా ఉండటంపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. జైళ్లలో ఖైదీల రద్దీని నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలతో పాటు అక్కడ అందుబాటులో ఉన్న వసతులపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. – న్యూఢిల్లీ, (నినాదం)*

## ప్రధాని మోదీ మరో అరుదైన రికార్డు



### అత్యధిక కాలం ప్రభుత్వాధినేతగా ఉన్న వ్యక్తిగా ఘనత

- ప్రభుత్వాధినేత హోదాలో ప్రధాని మోదీ 8,931 పనిదినాలు
- 2001-2014 మధ్యకాలంలో నాలుగుసార్లు గుజరాత్ సీఎంగా సేవలు
- సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డు బద్దలు

ప్రధాని నరేంద్ర మోదీ అరుదైన మైలురాయిని చేరుకున్నారు. మనదేశంలో సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వాధినేతగా వ్యవహరించిన రికార్డును ప్రధాని మోదీ ఆదివారం రోజు సొంతం చేసుకున్నారు. సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డును మోదీ అధిగమించారు. సీఎంగా 8,930 రోజుల పాటు సేవలను అందించిన రికార్డు పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉండేది. మార్చి 22 (ఆదివారం) నాటికి గుజరాత్ సీఎంగా, దేశ ప్రధానిగా ప్రభుత్వాధినేత హోదాలలో నరేంద్ర మోదీ 8,931 పనిదినాలను పూర్తి చేసుకున్నారు. దీంతో పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డు బద్దలైంది.

**- న్యూఢిల్లీ, (నినాదం)**

2



# సిద్దిపేట నుంచి గెలిచిన వారికి మంత్రి పదవి

సిద్దిపేట జిల్లా నర్మెటలో నిర్వహించిన రైతుఉత్సవాల సభలో మాట్లాడిన రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్, హరీశ్ రావు టార్గెట్‌గా సంచలన వ్యాఖ్యలు చేశారు. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ కాంగ్రెస్ పోటీ పడింది. కానీ ప్రజలు బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చారు. 2023లో మాకు అధికారం ఇచ్చారు. 2029 మళ్లీ మాకే అధికారం ఇవ్వబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. సిద్దిపేటను1984 నుంచి 2029 ఒకే కుటుంబం పాలిస్తోందని ఒక్కసారి ఇతరులకు కూడా అవకాశం ఇవ్వాలని సీఎం అన్నారు. మార్పు చేసి చూస్తే మంచి జరుగుతుందో మీరే చూడాలన్నారు. మల్లన్నసాగర్, ఏటిగడ్డకిష్టాపూర్ వంటి సమస్యలు వచ్చిన నాడు మేము నిలబడ్డామని ఈ ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ వ్యవహరించినట్లు మేము వ్యవహరించడం లేదన్నారు. నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టు నిర్వాసితులను ఒప్పించాకే పనులు ప్రారంభించామన్నారు. మూసీలో మీ మొసలి కన్నీరు ప్రజలు అర్థం చేసుకోవడం లేదనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. రాజకీయాల కోసం, ప్రజల మేలు కోసం మాట్లాడాలి. కానీ ఏమి జరగవద్దు వీళ్లను ఏమీ చేయనివ్వొద్దు అంటే అది ప్రజల పట్ల పగతో వ్యవహరించినట్లేనన్నారు. ప్రతిపక్షం బాధ్యత ఇది కాదన్నారు. అభివృద్ధి జరగకుండా అడ్డం పడుకుంటామంటే ఊరుకుంటామా? ముఖ్యమంత్రినై సిద్దిపేటకు రాలేదా? 2029లో మళ్లీ గెలిచి సిద్దిపేటకు వస్తామన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల తర్వాత అభివృద్ధిపైనే నా దృష్టి అని సీఎం చెప్పారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుతో రాజకీయంగా తనకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కానీ వారి నియోజకవర్గాల్లో కూడా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ మా నిజాయితీ నిరూపించుకున్నామన్నారు. నర్మెట్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు నేను ముఖ్యమంత్రి అయ్యాకే ప్రారంభమయ్యాయి. కావాలనుకుంటే నేను ఈ ఫ్యాక్టరీని కొడంగల్ కు తీసుకువెళ్లకపోయేవాడినా? కానీ ఇక్కడి రైతుల కోసం ఇక్కడే నిర్మించాం. ఆ తర్వాతే తన నియోజకవర్గానికి ఒకటి ఇవ్వమని మంత్రులను కోరుతున్నానని చెప్పారు. నేను వివక్ష చూపడంలేదన్నారు. వివక్ష గురించి మాట్లాడితే 2014 నుంచి 2023 వరకు కొడంగల్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు ఇచ్చారు? మేమొచ్చాక ఈ ప్రాంతానికి నేను ఎన్ని నిధులు ఇచ్చామో లెక్కలు తీద్దామన్నారు. వివక్ష మా ఇంట వంట లేదన్నారు. బీఆర్ఎస్ నేతలను చూసి చూసి ప్రజలను వేయమన్నారు. పేదల కోసం పని చేస్తాం తప్ప రాజకీయ నాయకుల కోసం మేము పని చేయామన్నారు. నాకు వ్యవసాయం తెలుసని చీడపురుగులకు ఏ మందు వేయాలో తనకు బాగా తెలుసన్నారు.



## హైదరాబాద్ నిర్మాణంలో
# మా పాత్ర కీలకం

ముప్పై ఏళ్ల క్రితమే ఐటీ రంగంపై దృష్టి సారించామని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, స్పేస్ టెక్నాలజీ దిశగా అడుగులు వేస్తోందని చంద్రబాబు తెలిపారు. డ్రోన్లు, ఎయిర్ అంబులెన్స్‌ల విస్తరణ వేగంగా జరుగుతోందని, ప్రస్తుత యుద్ధాల్లో డ్రోన్ టెక్నాలజీ పాత్రను ప్రపంచం గమనిస్తోందని చెప్పారు. డేటా సెంటర్లు, పాలసీల రూపకల్పన ద్వారా ఏపీని అగ్రస్థానంలో నిలుపుతామని చంద్రబాబు పేర్కొన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చడంలో తాము చాలా కష్టపడ్డామని గుర్తిచేసిన సీఎం చంద్రబాబు ఐఎస్‌బీని హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు ఎంతో కృషి చేశామన్నారు. శంషాబాద్ విమానాశ్రయం కోసమూ 5 వేల ఎకరాల భూసేకరణ చేశామని గుర్తు చేశారు. నల్సార్, ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలను సైతం తామే ఏర్పాటు చేశామన్నారు. కేవలం 9 నెలల్లోనే కృష్ణా నది నీటిని హైదరాబాద్‌కు తీసుకువచ్చి తాగునీటి సమస్యను పరిష్కరించిన తీరును చంద్రబాబు వివరించారు.

**బిల్ గేట్స్ నుంచి బిల్ క్లింటన్ వరకు..**

హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన అరుదైన సందర్భాలున్నాయని చంద్రబాబు గుర్తు చేశారు. ఢిల్లీ వెళ్లి బిల్ గేట్స్‌ను కలిసి భారతీయులకు గణితం, ఇంగ్లీష్‌పై ఉన్న పట్టును వివరించానని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో కార్యాలయం పెట్టేలా ఒప్పించానని చంద్రబాబు తెలిపారు. అప్పట్లో అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఆహ్వానం లేకుండానే హైదరాబాద్ వచ్చారని, ఆయన సూచనతోనే టోనీ బ్లెయిర్ సైతం నగరాన్ని సందర్శించారని చంద్రబాబు గుర్తు చేశారు. మాజీ ప్రధాని వాజ్‌పేయీ చేతుల మీదుగా హైటెక్ సిటీ ప్రారంభోత్సవం జరిగిందని ఆయన పేర్కొన్నారు.
గ్రీన్ ఎనర్జీలో అగ్రగామిగా ఏపీ విద్యుత్ సంక్షోభం నుంచి మిగులు విద్యుత్ సాధించే వరకు ఏపీ పయనించిందని, ప్రస్తుతం సోలార్, విండ్, గ్రీన్ ఎనర్జీ రంగాలను ప్రోత్సహిస్తున్నట్లు చంద్రబాబు స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీ వినియోగంలో దక్షిణాదిలోనే ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా ఉందని ఆయన పేర్కొన్నారు. 2014–19 మధ్య ఎన్నో సంస్కరణలు తెచ్చామని, ఇప్పుడు మళ్లీ అభివృద్ధి, సంక్షేమాలను సమతూకంలో ముందుకు తీసుకెళ్తున్నామని చంద్రబాబు తెలిపారు.

# మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మొదటి పేజీ తరువాయి

నంబర్ వన్‌గా నిలబెట్టిన రైతులకు అభినందనలు తెలుపుతూ, పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధరతో పాటు రూ. 500 బోనస్ ఇస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్రంలో పసుపు వంటి పంటలకు ధరలు మారుతున్న నేపథ్యంలో రైతులు సాంప్రదాయ పంటల నుండి వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేయడమే లక్ష్యమని, ఇందుకోసం తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో కూడా పామాయిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. వ్యవసాయ రంగంలో సాంకేతికతను పెంచేందుకు ఇక్రిశాట్ వంటి సంస్థల సేవలను వినియోగించుకుంటామని, పంట మార్పిడిపై చర్చించేందుకు త్వరలోనే కేంద్ర మంత్రులతో కలిసి ప్రధానిని కలుస్తామని చెప్పారు.




"నిజామాబాద్‌లోని అంకాపూర్ గ్రామంలాగా తెలంగాణలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం" అని ఆయన ఆకాంక్షించారు.
రైతులతో పాటు మహిళా సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సీఎం పేర్కొన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం నెలకు రూ. 350 కోట్లు ఖర్చు చేస్తున్నామని, వారిని ఆర్టీసీ బస్సులకు యజమానులను చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. మహిళా సంఘాల సభ్యుల సంఖ్యను 65 లక్షల నుండి కోటి మందికి పెంచి, వారిని కోటీశ్వరులుగా మార్చే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదానీ, అంబానీలతో పోటీపడి మహిళలు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రోత్సహిస్తామని, మహిళలకు పెట్రోల్ బంకుల కేటాయింపు వంటి చర్యలు తీసుకుంటామని తెలిపారు.
వచ్చే ఉగాది నాటికి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తామని, తనను ఆశీర్వదించడానికి వచ్చిన అక్కాచెల్లెళ్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఈ ఏడాది నుండి 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' నిర్వహిస్తామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. "నాకు అన్నీ తెలుసు అని అహంకారంతో పోను.. తెలియనిది అడిగి తెలుసుకుంటాను. ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందడమే నిజమైన బంగారు తెలంగాణ" అంటూ సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగాన్ని ముగించారు.

# ప్రధాని మోదీ మరో అరుదైన రికార్డు

దీర్ఘకాలం పాటు గుజరాత్ సీఎంగా వ్యవహరించిన రికార్డు నరేంద్రమోదీ పేరిట ఉంది. సీఎంగా సేవలు అందించే అవకాశం ఆయనకు నాలుగుసార్లు లభించింది. 2001 అక్టోబరు 7 నుంచి 2002 డిసెంబరు 22 వరకు, 2002 డిసెంబరు 22 నుంచి 2007 డిసెంబరు 22 వరకు, 2007 డిసెంబరు 23 నుంచి 2012 డిసెంబరు 20 వరకు, 2012 డిసెంబరు 20 నుంచి 2014 మే 22 వరకు నాలుగు దఫాలు ఆయన సీఎంగా వ్యవహరించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జన్మించిన తొలి ప్రధానమంత్రిగానూ మోదీ నిలిచారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఘన విజయాల్లో మోదీ పాత్రే కీలకం.

**దేశ వికాసం కోసమే పనిచేశాను : మోదీ**

ప్రభుత్వాధినేత హోదాలో 25వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా 2025 అక్టోబరులో దేశ ప్రజలకు ప్రధాని మోదీ ధన్యవాదాలు చెప్పారు. 2001లో గుజరాత్ సీఎంగా ప్రమాణం చేసినప్పటి నుంచి ఇప్పటిదాకా ప్రజల జీవితాలను మెరుగుపర్చేందుకు, దేశ వికాసం కోసమే తాను పనిచేశానని ఆయన తెలిపారు. భీకర భూకంపం నుంచి



గుజరాత్ రాష్ట్రం కొద్దికొద్దిగా కోలుకుంటున్న తరుణంలో తాను తొలిసారి గుజరాత్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశానని, అది చాలాపెద్ద పరీక్షా కాలమని మోదీ గుర్తుచేసుకున్నారు. ఆ సమయానికి గుజరాత్‌ను రాజకీయ అస్థిరత, సూపర్ సైక్లోన్ విపత్తు, దారుణమైన కరువులు కుదిపేశాయని చెప్పారు. ఈ సవాళ్లను చూసి, ఎలాగైనా గుజరాత్ రాష్ట్రాన్ని పునర్ నిర్మించాలని తాను లక్ష్యంగా పెట్టుకున్నానని ఆయన తెలిపారు. కొత్త ఆశ, కొత్త శక్తితో సీఎంగా తొలి టర్మ్‌లో పనిచేశానని మోదీ పేర్కొన్నారు.

**అమ్మ సలహాలే మార్గదర్శకాలు**

పేదల కోసమే పనిచేయమని, ఎన్నడూ లంచం తీసుకోవద్దని తల్లి ఇచ్చిన సలహాలే తన ప్రజా జీవితానికి మార్గదర్శనాన్ని అందించాయని ప్రధాని మోదీ గతేడాది అక్టోబరులో తెలిపారు. తన పాలన వల్ల కరువు ప్రభావిత, ఆర్థిక బలహీన గుజరాత్ రాష్ట్రం సుపరిపాలనకు పవర్ హౌజ్‌గా మారిపోయిందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల రంగాల్లో రాష్ట్రం ఎంతో పురోగతిని సాధించిందని ఆయన పేర్కొన్నారు. భారతదేశం పాలనాపరమైన, విశ్వాసపరమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న వేళ 2013లో తనను ప్రధానమంత్రి అభ్యర్థిగా బీజేపీ ప్రకటించిందని మోదీ తెలిపారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో భారత ప్రజలంతా కలిసి తమ పార్టీకి పట్టం కట్టారన్నారు. గత 11 ఏళ్ల పాలనలో 25 కోట్ల మందికిపైగా దేశ ప్రజలను పేదరికం నుంచి బయటికి తీసుకొచ్చానని ఆయన చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో అత్యంత ప్రధానమైన ఆర్థిక శక్తిగా భారత్ అవతరించిందన్నారు. నారీ శక్తి, యువ శక్తి, రైతుల సాధికారత కోసం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మోదీ పేర్కొన్నారు. దేశ రాజ్యాంగ విలువలకు బలమిచ్చే వికసిత భారత్ సాధన కోసం అహర్నిశలు శ్రమిస్తానని ఆయన స్పష్టం చేశారు.



# 25న రాజీనామాకు ముహూర్తం

"సారీ శ్రీధర్, లక్ష్మణ్" అంటూ, తన ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టి పార్టీలో కొనసాగలేనని స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ నెల 25వ తేదీన తన అనుచరులతో కలిసి మూకుమ్మడిగా పార్టీకి రాజీనామా చేసేందుకు జీవన్ రెడ్డి ముహూర్తం ఖరారు చేసుకున్నారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం జగిత్యాలలో ఓ ఫంక్షన్ హాల్‌ను కూడా బుక్ చేశారని చెబుతున్నారు. "దేవుడు శాసించాడు.. మానవుడు అనుసరిస్తాడు" అని తన కార్యకర్తల వద్ద వ్యాఖ్యానించడం ఆయన నిర్ణయం ఎంత నిశ్చయంగా ఉందో సూచిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేస్తానని జీవన్ రెడ్డి హెచ్చరించడంతో అధిష్ఠానం ఈ విషయాన్ని మరింత తీవ్రంగా పరిగణిస్తోంది. ఆయన్ను బుజ్జగించేందుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా జగిత్యాలకు వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జీవన్ రెడ్డి తన తుది నిర్ణయాన్ని ఆదివారం అధికారికంగా ప్రకటించవచ్చని భావిస్తున్నారు.

# జైళ్లలో రద్దీపై సుప్రీంకోర్టు ఆందోళన

దేశవ్యాప్తంగా జైళ్లలో స్థితిగతులపై దాఖలైన పిటిషన్‌ను సుమోటోగా విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం, ఈ ఏడాది మార్చి 1 నాటికి జైళ్లలో ఉన్న ఖైదీల సంఖ్య, మంజూరైన సామర్థ్యం వంటి వివరాలను మే 18 లోగా అఫిడవిట్ రూపంలో దాఖలు చేయాలని హోంశాఖ కార్యదర్శులను ఆదేశించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

**జైళ్లలోని చిన్నారులకు అందుతున్న విద్య, ఆరోగ్య సదుపాయాలపై నివేదిక**

మహిళా ఖైదీలతో పాటు వారితోపాటు ఉంటున్న చిన్నారుల భవిష్యత్తుపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. జైళ్లలో ఆయా చిన్నారులకు అందుతున్న విద్య, ఆరోగ్య సదుపాయాలపై స్పష్టత ఇవ్వాలని కోరింది. జైళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులు, వాటి భర్తీకి తీసుకుంటున్న చర్యలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అమికస్ క్యూరీ అందించిన వివరాలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం కోర్టు జైళ్లలో పాలనా సంస్కరణలు అనివార్యమని అభిప్రాయపడింది. ఈ విచారణను సమర్థంగా పరిగణనలోకి తీసుకోవడానికి తాజా సమాచారం అందుబాటులో ఉండటం అత్యవసరమని ధర్మాసనం అభిప్రాయపడింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు నమోదు చేసిన గణాంకాలు 2023 సంవత్సరానికి సంబంధించినవని తమ దృష్టికి తీసుకువచ్చినట్లు ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలోనే ఈ కేసు తదుపరి విచారణను మే 26కు వాయిదా వేసింది.
"అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ అధికార పరిధిలోని అన్ని జైళ్లకు సంబంధించిన తాజా, సమగ్ర గణాంకాలతో కూడిన జైలు రికార్డులు పొందుపరిచాలి. ఈ అఫిడవిట్‌లో ప్రతి జైలు వారీ సామర్థ్యం, మొత్తం ఖైదీల సంఖ్య, ప్రతి జైలులో అధిక రద్దీ శాతం, రద్దీని పరిష్కరించడానికి ప్రతిపాదించిన చర్యలు, మహిళా జైళ్ల వివరాలు, మహిళా ఖైదీలు, వారితో పాటు వచ్చే పిల్లలకు అందించే విద్యా, వైద్య సౌకర్యాలు, మంజూరైన జైలు సిబ్బంది సంఖ్య, ప్రస్తుతం ఉన్న ఖాళీలు, వాటిని భర్తీ చేయడానికి తీసుకున్న చర్యలు, అలాగే జైలు పరిపాలనకు సంబంధించిన అన్ని అనుబంధ అంశాలు ఉండాలి. 2026 మార్చి 1 నాటికి కటాఫ్ తేదీగా వివరాలను అందించాలి. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మే 18 లోగా హోం సెక్రటరీతో అవసరమైన వివరాలతో కూడిన సమగ్ర అఫిడవిట్లను దాఖలు చేయాలి. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి అందిన అఫిడవిట్ల కాపీలను సుప్రీం కోర్టు రిజిస్ట్రీ, ఏర్పాటు చేసిన అమికస్‌కు పంపుతుంది. వారు అందించిన గణాంకాలు, సమాచారాన్ని పరిశీలించి అమికస్ క్యూరీ ఒక సమగ్ర నివేదికను తయారు చేస్తారు."

**సోషల్ మీడియాల్లో పంచుకునే ధోరణి పట్ల సుప్రీం కోర్టు ఆందోళన**

మరోవైపు మొబైల్ ఫోన్లలో రికార్డ్ చేసిన వీడియోలను ప్రజలు వెంటనే సోషల్ మీడియాల్లో పంచుకునే ధోరణి పట్ల సుప్రీం కోర్టు శనివారం ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి చర్యలు పారదర్శక విచారణకు ముప్పుగా మారతాయని చెప్పింది. నిందితుల వీడియోలు, ఫొటోలను పోలీసులు సోషల్ మీడియాల్లో అప్‌లోడ్ చేసి, ప్రజల్లో పక్షపాత ధోరణిని సృష్టిస్తున్నారంటూ ఓ పిల్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది.



## భారత్ చేరిన అమెరికా
# ఎల్‌పీజీ నౌక

దీంతోపాటు రష్యాకు చెందిన చమురు నౌక కూడా దేశ సముద్రజలాల్లోకి ప్రవేశించింది. అక్వాటైటాన్ పేరుతో రష్యా నుంచి వచ్చిన ఈ నౌక శనివారమే మంగళూరు పోర్టును చేరినట్లు పలు ఆంగ్ల మీడియా సంస్థలు పేర్కొన్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా చమురు సంక్షోభాన్ని తగ్గించడమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మార్చి 12 నాటికి రష్యా నౌకల్లో లోడ్ చేసిన చమురును కొనుగోలు చేయొచ్చని అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో రష్యా నౌక భారత్‌కు చేరుకోవడం గమనార్హం.

# మారనున్న పాలిటెక్నిక్, ఐటీఐల భవిష్యత్

ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 113 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీలు స్కిల్స్ వర్సిటీ కిందకు రానున్నాయి. దీని ఫలితంగా, ఇప్పటివరకు ఈ కాలేజీల సిలబస్, పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) రద్దు కానుంది. అదేవిధంగా, కార్మిక శాఖ పరిధిలోని 63 ప్రభుత్వ ఏటీసీలు, 219 ప్రైవేట్ ఐటీఐలు కూడా ఈ వర్సిటీ పరిధిలోకి చేరనున్నాయి. ఈ సమగ్ర మార్పుల్లో భాగంగా, ఇప్పటివరకు పరిశ్రమల శాఖ కింద ఉన్న స్కిల్స్ యూనివర్సిటీని ఇకపై ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ విద్యా కమిషన్ అందించిన 'విద్యా విధానం–2026' సిఫార్సులకు అనుగుణంగా ఈ ఏకీకృత వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు, ఇంటర్మీడియట్ స్థాయిలోని ఒకేషనల్ కోర్సులు, విదేశాల్లో ఉపాధి కల్పించే తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టీఓఎమ్‌సీఓఎమ్) కూడా ఈ నూతన వ్యవస్థలో భాగం కానున్నాయి. ఈ సంస్కరణల ద్వారా సిలబస్ రూపకల్పనలో పరిశ్రమల అవసరాలకు ప్రాధాన్యత లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాది ఆగస్టులో పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి దీనికి ఛాన్సలర్‌గా వ్యవహరిస్తుండగా, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో తాత్కాలికంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ వర్సిటీ కోసం, ఫ్యూచర్ సిటీలో 58 ఎకరాల్లో శాశ్వత ప్రాంగణాన్ని నిర్మిస్తున్నారు. ఈ అధికార బదిలీ, విలీన ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు ఏడాది సమయం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మార్పులతో తెలంగాణ యువత అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను సాధించేందుకు మార్గం సుగమం అవుతుంది.

# హైడ్రా చర్యల్లో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఓ న్యూస్ చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూ క్లిప్పింగ్ ను తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసిన బండి సంజయ్ ఈ ఇంటర్వ్యూలో రంగనాథ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ గరీబోంకో హటావో–ఒవైసీకి బచావో అన్న చందంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. పేదల కోసం బఫర్ జోన్లు, ఒవైసీ కోసం కంఫర్ట్ జోన్లు, పేదలకు ఫుల్ ట్యాంక్ లెవల్, ఒవైసీకి మాత్రం ఫుల్ థ్యాంక్ లేవల్ అనేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ లాజిక్ ఎలా ఉందంటే విద్యార్థులు అక్రమ కాలేజీలో చదివితే అది సామాజిక కోణం, అదే పేదల ఇళ్లు మాత్రం ఆక్రమణలు అంటూ కూల్చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 200లకు పైగా పేద కుటుంబాల ఇళ్లపైకి మెరుపు వేగంతో కదిలిన హైడ్రా బుల్డోజర్లు సల్కం చెరువు ఎఫ్‌టీఎల్ లో ఉన్న ఓవైపీ కాలేజీ విషంలో మాత్రం జాప్యం చేస్తోందన్నారు. ప్రధాని మోడీ పీఎంఏవై ద్వారా పేదలకు గౌరవప్రదమైన నివాసాలు నిర్మిస్తుంటే కాంగ్రెస్ మాత్రం బుల్డోజర్లను పంపిస్తోందని విమర్శించారు. చట్టం రజాకార్ వారసుల కోసం వంగి, పేదలపై మాత్రం విరుచుకుపడితే అ దిపాలన కాదని బలహీనమైన సమర్థన మాత్రమేనని విమర్శించారు.



## పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ
# ఇంధన కొరతపై ప్రధాని సమీక్ష

మొదటి పేజీ తరువాయి

దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఇప్పటికే సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేషియా, ఇజ్రాయెల్, ఇరాన్ నాయకులతో ఫోన్ ద్వారా చర్చలు జరిపారు. గ్యాస్ పంపిణీని క్రమబద్ధీకరించడానికి, సరఫరా ఒత్తిళ్లను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు
మరోవైపు గ్యాస్ పంపిణీని క్రమబద్ధీకరించడానికి, సరఫరా ఒత్తిళ్లను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా సిటీ గ్యాస్ ప్రాజెక్టుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశిస్తూనే, కీలక రంగాలకు వాణిజ్య ఎల్‌పిజి కేటాయింపులను పెంచింది. పైప్డ్ నేచురల్ గ్యాస్ సరఫరాను పెంచేందుకు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ దరఖాస్తులను 10 రోజులలోపు పరిష్కరించాలని పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ ఆదేశించింది. ఎల్పీజీపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని, పీఎన్‌జీకి మారాలని పట్టణ, నగరాల్లోని వాణిజ్య ఎల్పీజీ వినియోగదారులకు సూచించింది. గృహ ఎల్పీజీ సరఫరా స్థిరంగా ఉందని, పంపిణీ కేంద్రాల వద్ద ఎక్కడా సరఫరా నిలిచిపోలేదని, పేర్కొంది. భయాందోళనలతో చేసే బుకింగ్‌లు కూడా తగ్గుముఖం పట్టాయని పేర్కొంది.

## బిల్డింగ్ రూల్స్‌లో
# మార్పులు

మొదటి పేజీ తరువాయి

21 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను ఇకపై హైరైజ్‌గా పరిగణించనున్నట్లు స్పష్టం చేసింది. నిర్మాణ రంగంలో పారదర్శకత, క్రమబద్ధీకరణ లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. కొత్త నిబంధనల ప్రకారం 2000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో అదనపు అంతస్తుల నిర్మాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. 40 అడుగుల రోడ్డు వద్ద 3 అంతస్తులు, 60 అడుగుల రోడ్డు వద్ద 4, 80 అడుగుల రోడ్డు వద్ద 5 అదనపు అంతస్తుల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. అయితే, 10 అంతస్తులు దాటిన భవనాలకు టీడీఆర్ వినియోగాన్ని తప్పనిసరి చేసింది. 20 అంతస్తులు దాటిన భవనాలకు 5 శాతం టీడీఆర్ లోడింగ్ కల్పించారు. 750 నుంచి 2000 చదరపు మీటర్ల ప్లాట్లలో నిర్మించే 18 నుంచి 21 మీటర్ల ఎత్తున్న భవనాలకు టీడీఆర్ వాడకాన్ని తప్పనిసరి చేశారు. నాన్ హైరైజ్ భవనాలకు టీడీఆర్ ద్వారా సెట్‌బ్యాక్‌లో సడలింపులు ఇవ్వగా, హైరైజ్ భవనాల్లో 10 శాతం వరకు సెట్‌బ్యాక్ రిలాక్సేషన్‌కు అనుమతించారు. భవన నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసే సమయంలోనే 50 శాతం టీడీఆర్ సమర్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. మిగిలిన 50 శాతాన్ని ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీకి ముందు చెల్లించాల్సి ఉంటుందని తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మార్పులు నిర్మాణ రంగంపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది.

## ఇక ₹10 లక్షలు దాటితే
# ఏప్రిల్ 1 నుంచి కొత్త పరిమితులు

మొదటి పేజీ తరువాయి

వారీగా జమ చేసినా, ఉపసంహరించుకున్నా పాన్ వివరాలు ఇకపై ఇవ్వాల్సి ఉంటుంది. ఒకటే బ్యాంకు లేదా వేర్వేరు బ్యాంకుల్లో జరిగినా ఈ నిబంధన వర్తిస్తుంది. ప్రస్తుతం ఒక రోజులో రూ.50 వేలు దాటితేనే పాన్ అడుగుతున్నారు. ఇళ్లు, స్థలాల కొనుగోలు, అమ్మకం, బహుమతి లేదా ఉమ్మడి డెవలప్‌మెంట్ ఒప్పందాల విషయంలో లావాదేవీ విలువ రూ.20లక్షలు దాటితే ఇకపై పాన్ తప్పనిసరి. ప్రస్తుతం ఈ పరిమితి రూ.10 లక్షలుగా ఉంది. స్థిరాస్తి ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఈ పరిమితిని రెట్టింపు చేయడం గమనార్హం. ద్విచక్ర వాహనం సహా ఏ మోటారు వాహనమైనా, దాని ధర రూ.5 లక్షలు మించితే కొనుగోలుదారుడు పాన్ సమర్పించాల్సి ఉంటుంది. పాత చట్టంలో ద్విచక్ర వాహనాలకు ఈ నిబంధన లేదు. కార్లకు, ఇతర మోటారు వాహనాలకు ధరతో సంబంధం లేకుండా పాన్ సమర్పించాల్సి వచ్చేది. కొత్తగా రూ.5 లక్షల పరిమితిని తీసుకొచ్చారు. హోటళ్లు లేదా రెస్టారెంట్ల బిల్లులు, కన్వెన్షన్ సెంటర్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు చేసే చెల్లింపులు రూ.లక్ష దాటితే ఇకపై పాన్ సమర్పించాలి. ప్రస్తుతం హోటల్, రెస్టారంట్ బిల్లు రూ.50 వేలు దాటితే పాన్ ఇవ్వాల్సి వస్తోంది. ఈ మొత్తాన్ని రెట్టింపు చేశారు. ప్రస్తుతం బీమా పాలసీ కొనుగోలు సమయంలో వార్షిక ప్రీమియం రూ.50వేలు దాటితేనే పాన్ అడుగుతున్నారు. ఇకపై ప్రతి పాలసీకి పాన్ సమర్పించడం తప్పనిసరి.

# డ్రైవింగ్ లైసెన్స్ ఇక కఠినం

డ్రైవింగ్‌లో చేసే చిన్న పొరపాట్లు ఎలా ప్రాణాంతకంగా మారతాయో వీడియోల రూపంలో వివరిస్తారు. కెమెరా ఉన్న కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్ ద్వారా ఇంట్లో నుంచే ఈ పరీక్ష రాయవచ్చు. ఇందులో ఉత్తీర్ణులై సర్టిఫికెట్ నంబర్ పొందాకే LLR స్లాట్ బుక్ చేసుకోవడానికి వీలవుతుంది. దేశవ్యాప్తంగా ఏటా 1.7 లక్షల మంది, తెలంగాణలో సుమారు 7,500 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఈ మరణాల సంఖ్యను తగ్గించేందుకు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే రవాణా శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. తొలుత ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రారంభించి, ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని అధికారులు యోచిస్తున్నారు. దీనికోసం నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (NIC) ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేస్తోంది. లైసెన్స్ పొందడం కొంత కఠినంగా మారినా, ఈ విధానం రోడ్డు ప్రమాదాల నియంత్రణకు దోహదపడుతుందని అధికారులు విశ్వసిస్తున్నారు.

# జానపద కళకు జాతీయ స్థాయి గుర్తింపు

## రమేష్‌కు స్వర్ణ నంది అవార్డు

### చిన్న వయసులోనే కష్టాలను జయించి కళారంగంలో ప్రత్యేక గుర్తింపు

**అశ్వాపురం, మార్చి 22 (నినాదం):** మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన ప్రముఖ కోలాటం మాస్టర్, కవి, గాయకుడు మరియు ఐటీసీ ఉద్యోగి తోకల రమేష్ ఉగాది సందర్భంగా ఖమ్మంలో ని రాములవారి ఆలయ ప్రాంగణంలోని రామగిరి ఫంక్షన్ హాల్‌లో వైభవంగా నిర్వహించిన స్వర్ణ నంది ఉగాది పురస్కారాల కార్యక్రమంలో ప్రతిష్టాత్మక స్వర్ణ నంది ఉగాది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రముఖ దర్శకులు ఎన్. కాంతేశ్వరరావు, సినీ రచయిత కోమాకుల సీతారాములు, కవిరత్న తోటమళ్ళ సురేష్ బాబు, ఈటీవీ 'పాడుతా తీయగా' కార్యక్రమ న్యాయనిర్ణేత రాజబాబు తదితరులు రమేష్ ను



శాలువాతో సత్కరించి, జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. వక్తలు మాట్లాడుతూ చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన రమేష్ స్వయంకృషితో జీవితంలో ఎన్నో కష్టాలను అధిగమించి ఈ స్థాయికి ఎదిగారని కొనియాడారు. జానపద కోలాటం ద్వారా గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ కొత్త తరాలకు పరిచయం చేయడంలో ఆయన చేస్తున్న కృషి విశేషమని అభినందించారు. ఐటీసీ ఉద్యోగిగా సేవలందిస్తూ, కళా, సాహిత్య, సామాజిక రంగాల్లో సమానంగా కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అవార్డు స్వీకరించిన రమేష్ మాట్లాడుతూ, ఈ పురస్కారాన్ని నా గురువులకు, ఐటీసీ సంస్థకు అంకితం చేస్తున్నాను. నా గ్రామం, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఇకముందు కూడా కళా, సాహిత్య, సామాజిక సేవల ద్వారా సమాజానికి మరింత సేవ చేయాలని సంకల్పిస్తున్నాను" అని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, సహోద్యోగులు రమేష్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కురవిళ్ల ప్రవీణ్, బలగం ఫేమ్ కుర్తానందం, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పాలకుర్తి కృష్ణ, కన్వీనర్ ప్రముఖ హాస్యనటుడు మొగిలి గుణకర్, కో-కన్వీనర్ సినీ నటుడు నాగ సాయి, దర్శకుడు రవి తోప్, గాయకుడు కోదాడ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శాలివాహన జయంతి వేడుకలు



**కమలాపూర్, మార్చి 22 (నినాదం):** శాలివాహన చక్రవర్తి జయంతి ఆదివారం కుమ్మరి సంఘం నాయకులు కమలాపూర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాలివాహన చక్రవర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ శాలివాహన చక్రవర్తి ఒక యుగపురుషుడని అన్నారు. తెలుగు వారి తొలి పండుగ అయిన అటువంటి ఉగాది ఆరంభానికి నాంది పలికిన కుమ్మరి మహనీయుడు శాలివాహన చక్రవర్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఉపాధ్యక్షులు నాంపల్లి ప్రభాకర్ ప్రజాపతి, సముద్రాల సదయ్య ప్రజాపతి, జగన్ ప్రజాపతి, నాంపల్లి మొగిలి ప్రజాపతి, వీరస్వామి ప్రజాపతి ,మల్లయ్య ప్రజాపతి ,బాబు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి పనుల కార్యక్రమాన్ని వీక్షిస్తున్న రైతులు



**మల్యాల, మార్చి 22( నినాదం):** సిద్దిపేట జిల్లా నర్మెట్ట గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ అలాగే యాసంగి రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా మండలంలోని మానాల, తాటి పెల్లి రైతు వేదికలో ఆదివారం రైతులు ముఖ్యమంత్రి చేపడుతున్న అభివృద్ధి పనులపై ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బల్మూరి పాపారావు, ముత్యంపేట సర్పంచ్ దారం ఆదిరెడ్డి, మ్యాడం పల్లి సర్పంచ్ గాతం అంజయ్య ,ఏఈఓ మంజుల, శ్రీనివాస్, శ్రీలేఖ, అనిల్, రైతులు తిరుపతి, గోపి, మహేష్, దేవయ్య, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

# కమర్షియల్ సిలిండర్ల బదులు డొమెస్టిక్ వాడకం..?

## దుబ్బాకలో నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ వినియోగం

### మొద్దు నిద్రలో పౌరసరఫరాల శాఖ అధికారులు

**దుబ్బాక, మార్చి 22: (నినాదం):** దుబ్బాక పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్ల వినియోగం జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని హోటళ్లతో పాటు మిర్చి, గప్‌చుప్, సమోసా బండ్ల వద్ద కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు వినియోగించాల్సి ఉండగా, వాటి స్థానంలో డొమెస్టిక్ సిలిండర్లను వాడుతున్నట్లు తెలుస్తోంది. "మమ్మల్ని ఎవరు ఏమి చేయలేరు" అనే ధైర్యంతో కొందరు వ్యాపారులు ఇంటి వినియోగానికి మాత్రమే



అనుమతించిన డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, వారి నిర్లక్ష్యం అనుమానాలకు తావిస్తోంది. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా గ్యాస్ కొరత ఉందని వార్తలు వస్తున్నప్పటికీ, ఇక్కడ మాత్రం కమర్షియల్ సిలిండర్ల స్థానంలో డొమెస్టిక్ సిలిండర్లు సులభంగా లభించడం ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గ్యాస్ డీలర్లు అక్రమంగా సరఫరా చేస్తున్నారా..? వారికి కమిషన్లు అందుతున్నాయా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో పేద ప్రజలు గ్యాస్ అందుబాటులో లేక కట్టెల పొయ్యిలపై ఆధారపడుతున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ అధికారులు మేల్కొని, విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మహనీయుల ఆశయాలను కొనసాగిద్దాం

## అంబేద్కర్ చూపిన క్రాంతి బాటలో పయనిద్దాం

### క్రాంతి కళాబృందం అధ్యక్షుడు వెంకటాచారి పిలుపు

**జవహర్‌నగర్, మార్చి 22 (నినాదం):** మహనీయుల ఆశయాలను కొనసాగిద్దామని తద్వారా అంబేద్కర్ కలలుగన్న సర్వ మానవ సమ సమాజాన్ని నిర్మిద్దామని క్రాంతి కళాబృందం అధ్యక్షులు వెంకటాచారి పిలుపునిచ్చారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ బాలాజీ నగర్ చౌరస్తాలో భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం 85వ వారం జ్ఞానమాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్రాంతి కళాబృందం అధ్యక్షుడు వెంకటాచారి హాజరై మహనీయులకు పూలమాలలు వేసి వందనం



సమర్పించిన అనంతరం మాట్లాడుతూ, మహనీయులు అంబేద్కర్ రాసిన రాజ్యాంగం సర్వోన్నతమైనదని రిజర్వేషన్ ఫలాలు భారత్లోని ప్రజలందరికీ దక్కాలి అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ అంబేద్కర్ చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ సర్వసత్తాక ప్రజాస్వామ్య లౌకిక తమ సమాజ స్థాపనకై నడుం బిగించాలని తద్వారా అంబేద్కర్ కలలుగన్న రాజ్యం సిద్ధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షులు మహంకాళి బిక్షపతి, కళాకారులు గజ్జల్లి రామచందర్ సురేష్ రవి కొయ్యడ వెంకటేష్ వీర స్వామి శంకర్ మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


**Chola** Enter a better life

**చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**

కార్పొరేట్ ఆఫీస్: చోళ క్రెస్ట్, సూపర్ బి, సి54 & సి55, 4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600 032, తమిళనాడు.

**డిమాండ్ నోటీసు**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("ది యాక్ట్") మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ('ది రూల్స్') నిబంధనల క్రింద

సదరు చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద జారీ చేసిన డిమాండ్ నోటీసు(లు)లలోని రూల్ 3తో చదువబడు విధంగా చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ **చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** (ది సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారి అయిన దిగువ సంతకముదారు సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా సంబంధిత నోటీసు(లు)లలో తెలిపిన మొత్తాన్ని తిరిగి చెల్లించవల్సిందిగా రుణగ్రహీత(లు)లను కోరియున్నారు. డిమాండ్ నోటీసు(లు)లను స్వీకరించకుండా రుణగ్రహీత(లు) తప్పించుకుంటున్నారని క్రింది సంతకముదారు సహేతుకంగా విశ్వసిస్తున్నారు. అందువలన నిబంధనల ప్రకారం అతికించడం మరియు ప్రచురణ ద్వారా ఈ నోటీసు అందజేస్తున్నారు. డిమాండ్ నోటీసు(లు)ల సారాంశం దిగువ పేర్కొనబడినవి.

| క్ర. సం. | రుణగ్రహీత/లు & సహ-రుణగ్రహీత/లు ల పేరు మరియు చిరునామా | రుణ మొత్తం | డిమాండ్ నోటీసు తేది & చెల్లించవల్సిన బకాయి మొత్తం | ఆస్తి/సెక్యూర్డ్ ఆస్తి వివరణ |
|---|---|---|---|---|
| 1 | రుణ ఖాతా సం.(లు).: LAP1MOO000159027<br>1. శ్రీ/శ్రీమతి మొహమ్మద్ సోహైల్ ఇద్రీస్<br>2. శ్రీ/శ్రీమతి ముబీనా బేగం<br>3. శ్రీ/శ్రీమతి అన్వరున్నీసా బేగం<br>క్ర.సం. 1, 2 & 3ల కొరకు చిరునామా: ఇంటి నెం. 1-1-81/10, మోతీ నగర్, మహబూబ్‌నగర్, మెయిన్ రోడ్ దగ్గర, మహబూబ్‌నగర్, తెలంగాణ-509001, క్ర.సం. 1, 2 & 3ల కొరకు చిరునామా: ఇంటి నెం. 1-1-81/10, మోతీ నగర్, మహబూబ్‌నగర్ టౌన్, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ-509001. | రూ. 20,00,000/- | 16.03.2026 & తేది: 16.03.2026 నాటికి రూ. 20,92,770/- (రూపాయలు ఇరవై లక్షల తొంభై రెండు వేల ఏడు వందల డెబ్బై మాత్రమే) | మహబూబ్‌నగర్ జిల్లా, మహబూబ్‌నగర్ ఎఆస్‌ఆర్‌ఓ, మోతీ నగర్ వద్ద 202 చ॥గ॥ల విస్తీర్ణములో నిర్మించబడిన ఆర్‌సిసి భవనముతో కూడిన డోర్ నెం. 1-1-81/10 గా గల ఆస్తి మరియు అన్ని అనుబంధ హక్కులతో సహా యావదాస్తి. **సరిహద్దులు: ఉత్తరం:** సయ్యద్ యూసుఫుద్దీన్ యొక్క ఖాళీ స్థలం, **దక్షిణం:** 40 అడుగుల రోడ్డు, **తూర్పు:** సయ్యద్ యూసుఫుద్దీన్‌కు చెందిన ఇంటి నెం. 1-1-81, పడమర: ఇంటి నెం. 1-1-81/9/ఎ/1. |

డిమాండ్ నోటీసులను పాటించవలసిందిగా మరియు చెల్లింపు వసూలయ్యే తేది వరకు వర్తించు వడ్డీ అదనపు వడ్డీ, బౌన్స్ ఛార్జీలు, వ్యయం మరియు ఖర్చులతో పాటు అందులో మరియు ఇకమీదట పేర్కొన్న డిమాండ్ మొత్తాన్ని ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి **60 రోజులలోగా** చెల్లించవల్సిందిగా రుణగ్రహీత(ల)కు ఇందుమూలంగా తెలియజేయడమైనది. **చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** సెక్యూర్డ్ క్రెడిటార్ అని మరియు రుణగ్రహీత(లు) వినియోగించుకున్న రుణ సదుపాయం రుణగ్రహీత(ల)చే తనఖా పెట్టబడిన సెక్యూర్డ్ ఆస్తి(లు) అయినటువంటి వారి స్థిరాస్తి/ఆస్తులపై పొందిన సెక్యూర్డ్ రుణమని రుణగ్రహీత(లు) గమనించవలెను. రుణగ్రహీత(లు) నిర్దిష్ట కాలవ్యవధిలోగా పూర్తిగా రుణ బాధ్యతలు చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టం క్రింద మరియు అందులోని నిబంధనల క్రింద అమ్మకం లేదా లభించే ఏదేని ఇతర పరిష్కారం కోరడం ద్వారా దానిని పరిమిత బదిలీ కాకుండా దానితో పాటు సెక్యూర్డ్ ఆస్తి(ల)ను స్వాధీనం చేసుకొనుటకు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని హక్కులను వినియోగించుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ హక్కు కలిగియుంటారు. అమ్మకం లేదా బదిలీకి గల హక్కులు వినియోగించుకునే ముందు సెక్యూర్డ్ ఆస్తి(ల) **అటాచ్ చేయుటకు మరియు లేదా సీలు చేయుటకు** కూడా సెక్యూర్డ్ క్రెడిటార్ సాధికారత కలిగియున్నారు. సెక్యూర్డ్ ఆస్తి(ల) అమ్మకం తరువాత సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించవలసిన బకాయిలను కవర్ చేయుటకు తనఖా పెట్టిన ఆస్తుల విలువ తగినంతగా లేనట్లయితే మిగిలిన బకాయిలను రాబట్టుకొనేందుకు విడి చట్టపరమైన ప్రొసీడింగ్స్ చేపట్టే హక్కు కూడా సెక్యూర్డ్ క్రెడిటార్ కలిగి ఉన్నారు. ఏదేని చట్టం క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్‌కు లభించే అన్ని ఇతర పరిష్కారాలకు ఈ పరిష్కారం అదనంగా మరియు స్వతంత్రంగా ఉంటుంది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనేందుకు తమకు లభించే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8)ని గమనించవలసిందిగా రుణగ్రహీత(లు)లను కోరడమైనది మరియు చట్టంలోని తదుపరి సెక్షన్ 13(13) క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన ఆస్తులను వారి యొక్క ముందస్తు వ్రాత పూర్వక సమ్మతి లేకుండా ఏవేని ఆస్తుల అమ్మకం, లీజు లేదా ఇతరత్ర (సాధారణ కార్యకలాపాలు మినహా) బదిలీ చేయుట లేదా సెక్యూర్డ్ ఆస్తి(ల)ను అమ్మకం లేదా వ్యవహరించుట నుండి రుణగ్రహీత(లు) నిరోధించబడినారు/నిషేధించబడినారు మరియు పైన తెలిపిన వాటిని పాటించకపోతే అది సదరు చట్టంలోని సెక్షన్ 29 క్రింద శిక్షార్హమైన నేరమవుతుంది. డిమాండ్ నోటీసు కాపీ దిగువ సంతకముదారు వద్ద లభిస్తుంది మరియు రుణగ్రహీత(లు) వారు కోరుకుంటే దానిని దిగువ సంతకముదారు నుండి ఏ పని రోజునైన సాధారణ కార్యాలయ పనివేళలో పొందవచ్చును.

సం/-
అధీకృత అధికారి
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరఫున

ప్రదేశం: మహబూబ్‌నగర్, తెలంగాణ
తేది: 16.03.2026


# హరిదాసు మండపంలో భారత నాట్యం ప్రదర్శన



**అల్వాల్, మార్చి 22( నినాదం):** అల్వాల్ పట్టణ పరిధిలోనిహరిదాస మండపంలో కల క్షేత్ర నాట్య శాల శ్రీమతి సుబ్బు లక్ష్మిశిష్య బృందంతో భరతనాట్యం నిర్వహించారు. భారత నాట్యం చూపరులను ఆకట్టుకున్నాయి. వర్షం వలన కొంత అంతరాయం కలిగినప్పటికీ కొనసాగించారు. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ కందగట్ల సుదర్శన్ రెడ్డి, పరంకుశం మాధవ్ ,రామచంద్ర రావు, రవి, రామ్ సింగ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు మహోత్సవ సభకు తరలిన రైతులు



**కమలాపూర్ మార్చి 22 (నినాదం):** సిద్దిపేట జిల్లాలోని నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో ఆదివారం జరిగిన రైతు మహోత్సవ సభ,ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం, రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు బస్సులలో తరలి వెళ్లారు. బస్సులను మండల వ్యవసాయ అధికారి బి వేణు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జయ ప్రకాష్ రెడ్డి,రైతులు జేరిపోతుల హరిశంకర్ ,ఇంజపల్లి రామస్వామి, నకీర్త సాయిలు, కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రవిందర్ ,బాలసాని రమేష్ ,పోడేటి భిక్షపతి, బొల్లం రాజిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన సర్పంచ్

**మునుగోడు, మార్చి 22 (నినాదం):** మునుగోడు నియోజకవర్గం, యాదాద్రి భువనగిరి జిల్లా. చౌటుప్పల్ మండలం, తుప్రాన్ పేట గ్రామం గ్రామపంచాయతీ ఎన్నికల మేనిఫెస్టో లో గ్రామంలో పేద, మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆడబిడ్డకు మహాలక్ష్మి కానుకగా ఇస్తానని హామీ ఇచ్చారు సర్పంచ్ బక్కతట్ల రాధిక శ్రీశైలం ఇచ్చిన హామీ ప్రకారం గ్రామంలో వర్కురి మౌనిక-బాలకృష్ణ దంపతులు ఇటీవల ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయం తెలుసుకొని ఆదివారం గ్రామ సర్పంచ్ బక్కతట్ల రాధిక-శ్రీశైలం యాదవ్ వారి ఇంటికి వెళ్లి ఇచ్చిన హామీ ప్రకారంగా పుట్టిన ఆడబిడ్డకు మహిళలక్ష్మి కానుకగా రూ. 10,116 లు అందజేశారు. కార్యక్రమంలో, గ్రామ ఉపసర్పంచ్ ముద్దం రమేష్ యాదవ్, వార్డు సభ్యులు బొజ్జ స్వామి, బక్కతట్ల శ్రీకాంత్ యాదవ్, మంటిపల్లి మల్లయ్య యాదవ్, వర్కురి బాలకృష్ణ, పోచమోని అండాలు, గంధం భాగ్యమ్మ అశోక్, భారాస గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి చంచల భరత్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు బక్కతట్ల యాదగిరి



యాదవ్, వర్కురి రాము, వంటల ప్రవీణ్, చిలుకల మల్లేష్, గుండెమోని నాగరాజు యాదవ్ ,పోచమోని పవన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

**అశ్వాపురం, మార్చి 22 (నినాదం):** మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన యువ ఎలక్ట్రిషియన్ సంగు కిరణ్ కుమార్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందగా, ఆయన కుటుంబానికి తోటి ఎలక్ట్రిషియన్లు ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. వృత్తిపరంగా ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తూ నిరుపేద కుటుంబాన్ని పోషిస్తున్న కిరణ్ కుమార్ మార్చి14వ తేదీన అనారోగ్యానికి గురై కన్నుమూశారు. ఈ విషాద వార్తతో దిగ్భ్రాంతికి గురైన తోటి ఎలక్ట్రిషియన్లు కలిసి తమ వంతు సహాయంగా రూ. 25,500ను సేకరించి ఆదివారం కిరణ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిరణ్ కుటుంబానికి ఎప్పటికప్పుడు అండగా నిలుస్తామని తెలిపారు. కష్టకాలంలో తోటి వృత్తిదారులు ముందుకు వచ్చి సహాయం చేయడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని గ్రామస్తులు



ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎలక్ట్రిషియన్లు పాల్గొని కిరణ్ కుటుంబానికి ధైర్యం చెప్పారు.

# పీరంచెరువులో 'స్వచ్ఛా సండే'

## కమ్యూనిటీ భాగస్వామ్యంతో క్లీనింగ్ డ్రైవ్

**రాజేంద్రనగర్, మార్చి 22 (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 డేస్ యాక్షన్ ప్లాన్'లో భాగంగా ఆదివారం రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలోని బండ్లగూడ జాగిర్, పీరంచెరువు వద్ద 'స్వచ్ఛా సండే' కార్యక్రమం నిర్వహించబడింది. స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ అధికారుల సమన్వయంతో చెరువు పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మకరంద్, డెప్యూటీ కమిషనర్ సురేంద్ర రెడ్డి, డీపీవో స్వాతిలు పాల్గొని పనులను పర్యవేక్షించారు. వీరితో పాటు ట్రైనీ గ్రూప్-1 అధికారులు, యూసీడీ టీమ్, శానిటేషన్ ఎంటమాలజీ విభాగాల సిబ్బంది, ఈఎంఎహెచ్ పాలుపంచుకున్నారు. స్థానిక రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, చెరువు అభివృద్ధిపై అధికారులకు



పలు సూచనలు చేశారు. చెరువును సుందరీకరణ చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాకరంద్ మాట్లాడుతూ ఈ అంశాలపై చర్చించేందుకు త్వరలోనే అన్ని శాఖలతో కలిసి 'కన్వర్జెన్స్ మీటింగ్' ఏర్పాటు చేసి, సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందిస్తామని ఆయన అన్నారు. పరిశుభ్రతతో పాటు ప్రజారోగ్యంపై దృష్టి సారించిన ఎంటమాలజీ విభాగం, అత్యాధునిక డ్రోన్ల సాయంతో చెరువు పరిసరాల్లో స్ప్రేయింగ్ నిర్వహించి మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు చర్యల్లో భాగంగా ఈ డ్రోన్ ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ వేముల వీరేశంను కలిసిన ఉద్యమకారులు

**వలిగొండ, మార్చి 22 (నినాదం):** ఇటీవల నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంను ప్రభుత్వం ఆయనను ప్రభుత్వ విప్ గా ప్రకటించిన సందర్భముగా ఆదివారం ఆయనను తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు కాంబ్లి శ్రీధర్, మంటి రమేష్, మంటి శంకర్, షేక్ అజ్జు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయండి

### నూతన కార్యదర్శులకు శివసేన రెడ్డి దిశా నిర్దేశం



**అమరచింత, మార్చి 22, (నినాదం):** ఇటీవల నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులు పార్టీ పటిష్టత కోసం రాబోయే స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలని కొనపర్తి జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తో కలిసి ఇటీవల నూతనంగా వనపర్తి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా ఎన్నికైన ఆత్మకూరు మండలం తులసి రాజ్ యాదవ్, అమరచింత మండలం ముదిరాజ్ రమేష్ ను శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానించారు. జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు అప్పజెప్పిన శివసేన రెడ్డికి ఎమ్మెల్యే మేఘారెడ్డికి తులసిరాజ్ యాదవ్ ముదిరాజ్ రమేష్ లు కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఇచ్చిన పదవులకు న్యాయం చేస్తామని జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం అలాగే రాంగ్ల స్థానిక ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డితో అన్నారు.

# పెద్దమ్మతల్లి పట్నాలలో పాల్గొన్న మంత్రి అడ్లూరి



**ధర్మారం, మార్చి 22:(నినాదం):** మండలంలోని కొత్తూరు గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మతల్లి పట్నాల కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డప్పు చప్పులతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించరు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లి మండప నిర్మాణానికి రూ. 15 లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించగా, ఆయనకు గ్రామస్తులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భూక్య సరిత ఆంజనేయులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్త నరసింహులు మాజీ ఎంపీపీ కొడారీ హనుమాన్, సీనియర్ నాయకులు ఏదుల్లఅంజయ్య , ఆయా గ్రామాల సర్పంచులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజనీతి శాస్త్రంలో నాతాళ్లగూడెం వాసికి డాక్టరేట్



**వలిగొండ, మార్చి 22 (నినాదం):** మండలంలోని నాతాళ్లగూడెం గ్రామానికి చెందిన జూకంటి వెంకటయ్యకు ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగంలో ఏరోల్ ఆఫ్ రైట్ టూ ఇన్ఫర్మేషన్ ఇన్ గవర్నెన్స్ రూరల్ డెవలప్మెంట్ అను అంశంపై పరిశోధన చేసిన సందర్భముగా ఆయనకు విశ్వవిద్యాలయం సహా ఆచార్యులు డాక్టర్ రమణ పర్యవేక్షణలో పిహెచ్డి డాక్టరేట్ పట్టాను ప్రధానం చేసారు. ప్రస్తుతం వెంకటయ్య సికింద్రాబాద్ లోని సీతాఫల్ మండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. వెంకటయ్య పీహెచ్డీ డాక్టరేట్ పట్టాను పొందడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, సహచర అధ్యాపకులు, స్నేహితులు బంధువులు సంతోషం వ్యక్తం చేశారు.

# మతాలకు అతీతంగా ఈద్ మిలాప్..




**మెట్‌పల్లిలో సౌహార్ద వాతావరణం**
**షీర్ ఖుర్మాతో అతిథి సత్కారం...**
**ఆనందోత్సాహాల మధ్య ఈద్ మిలాప్ ముగింపు**

**మెట్‌పల్లి, మార్చి 22 (నినాదం) :** ఈద్ పండుగను పురస్కరించుకుని మెట్‌పల్లి పట్టణంలో ఐక్యత, సోదరభావం వెల్లివిరిసింది. మహ్మద్ అలీ చౌక్, బర్కత్‌పురాలో ఆజాద్ యూత్ అండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఏఐఎంఐఎం, జనసేన పార్టీలకు చెందిన నాయకులు హాజరై పరస్పరం ఈద్ శుభాకాంక్షలు తెలియజేశారు. మతాలకు అతీతంగా వివిధ పార్టీల నేతలు ఒకే వేదికపై కలవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పరస్పర ఆత్మీయతతో ఒకరిని ఒకరు పలకరించుకుంటూ సోదరభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు ఈద్ పండుగ ప్రేమ, శాంతి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మత భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా జీవించాలనే సందేశాన్ని ఈ పండుగ ఇస్తుందని తెలిపారు. సమాజంలో సౌహార్ద వాతావరణాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈద్ స్ఫూర్తిని అందరితో పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న వారికి రుచికరమైన షీర్ ఖుర్మా వడ్డించి ఆతిథ్యాన్ని అందించారు. మొత్తం కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య సౌహార్ద వాతావరణంలో ముగిసింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు, ఓబీసీ రాష్ట్ర నాయకుడు కొమిరెడ్డి విజయ్ ఆజాద్, చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి, ఏఎంసీ చైర్మన్ కున గోవర్ధన్, వైస్ చైర్‌పర్సన్ ఓంకార్ నవీన్, కౌన్సిలర్లు లింగేశ్వర్, బొడ్ల నగేష్, బొడ్ల ఆనంద్, బొడ్ల రమేష్, చెట్లపెల్లి మీనా సుఖేందర్ గౌడ్, బత్తుల నరేష్, ముస్లిం మత పెద్దలు ముఫ్తీ అబ్దుల్ మోయిజ్ శ్యాంజీ, అబూబక్కర్ సిద్ధిఖీ, న్యాయవాదులు సురభి అశోక్, రాంబాబు, నినాదం రిపోర్టర్ మహమ్మద్ వసీం ,యూత్ సభ్యులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు, రోగులకు అన్నదానం






**కల్వకుర్తి, మార్చి 22 (నినాదం) :** సామాజిక సేవా కార్యక్రమంలో విభిన్నమైన రీతిలో ముందుకు సాగుతున్న లయన్స్ క్లబ్ కల్వకుర్తి మరో సేవా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించింది. మండు వేసవిలో వృద్ధులు ఆకలికి ఇబ్బంది పడకుండా ఉండాలని సంకల్పంతో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. సాయి మందిర్ ఆవరణలో వృద్ధులకు, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు అండగా ఉండేందుకు వచ్చే బంధువులకు అన్నప్రసాదాన్ని అందించారు. 200 మందికి అన్నదానం చేశారు. క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ కల్మిచర్ల రమేష్ చిన్న కుమారుడు సాయి తేజ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు చిగుల్లపల్లి శ్రీధర్, మెంబర్షిప్ కమిటీ చైర్మన్ గుబ్బకిషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మాసాయిపేటలో తల్లి, బిడ్డ అదృశ్యం





**చేగుంట, మాసాయిపేట మార్చి 22 (నినాదం) :** చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో గల నూతనంగా ఏర్పడిన మాసాయిపేట మండల కేంద్రంలో నీ మాసాయిపేట పట్టణానికి చెందిన ముక్క ప్రవంతి భర్త నరసింహులు, సంవత్స రములు, వృత్తి గృహిణి తేదీ 18. 03.2026 నాడు తన చిన్న కూతురు (1) సంవత్సరం పాప ని, తీసుకుని ఇంట్లో నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు బంధువుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

# చేనేత కార్మికుల దీక్షను విజయవంతం చేయాలి



**వలిగొండ, మార్చి 22 (నినాదం):** చేనేత కార్మికులు సమస్యల పరిష్కారానికి ఈనెల 25 న హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న రిలే నిరాహార దీక్షను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతి కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో చేనేత కార్మికులు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల పోరాట ఫలితశీ సాధించుకున్న పథకాలు జాతీయ చేనేత బోర్డు, హ్యాండి క్రాఫ్ట్ బోర్డు, మహాత్మా గాంధీ బుణాకర్ భీమా యోజన వివిధ పథకాలు కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. ముడి సరుకులపై, రసాయణాలపై, చేనేత చీరలపై జీఎస్టి విధించి చేనేత రంగాన్ని దెబ్బతీసిందని అన్నారు. ఈ దీక్షకు ఈ ప్రాంతం నుండి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గర్దాసు నర్సింహా, దొంత శంకరయ్య, జెల్ల నరేందర్, సాయిని యాదగిరి, గంజి వెంకటేశ్వర్లు, గుంటి రవీందర్, జెల్ల నరహరి, రాపోలు శ్రీనివాస్, మిర్యాల వెంకటయ్య, అయిటీపాముల మీనయ్య, మిర్యాల శేఖర్, రచ్చ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో వాహనాల తనిఖీ చేపట్టిన ఎస్సై జయన్న





**అమరచింత, మార్చి 22, (నినాదం):** నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వాహనదారులను ఆత్మకూరు ఎస్సై జయన్న హెచ్చరించారు. ఆదివారం ఆయన జూరాల జంక్షన్ ప్రధాన రహదారిపై విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వాహనదారులతో మాట్లాడుతూ సరైన పత్రాలు లేకుండా, ఓవర్ లోడ్ తో తరలిస్తున్న ఆటోలను ఆపి ఎస్సై జయన్న పరిశీలించారు. మట్టి, ఇసుక రవాణా చేసే వాహనాలు తప్పనిసరిగా సంబంధిత అధికారుల అనుమ తులు చూపించాల్సిందిగా సూచించారు. ట్రాఫిక్ నియమాలు శిక్షల కోసం కాదు మీ ప్రాణాలు మీ కుటుంబ భవిష్యత్తు కోసం వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించడం వల్ల తమ ప్రాణాలను మాత్రమే కాక ఇతరుల ప్రాణాలు కూడా కాపాడిన వారవుతారని ఆయన అన్నారు. జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని, హెల్మెట్ ధరించడం సీట్ బెల్ట్ పెట్టుకోవడం వంటి చిన్న చిన్న జాగ్రత్తలు ప్రమాద సమయంలో ప్రాణాలను రక్షిస్తాయని మద్యం సేవించి వాహనం నడప రాదు అతివేగం ఓవర్లోడ్ ప్రయాణం చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం తల్లిదండ్రుల నిర్లక్ష్యంగా మారి ప్రమాదాలకు కారణం అవుతాయని సూచించారు. పోలీసులు కేవలం చలాన్లు వేయడం కోసమే కాకుండా ప్రజల ప్రాణాలను రక్షించేందుకు పనిచేస్తున్నారని అందుకే ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా నియమాలను పాటించాలని కోరారు. మీ భద్రత మీ చేతుల్లోనే ఉంది బాధ్యతగా డ్రైవింగ్ తో సురక్షిత సమాజాన్ని నిర్మిద్దాం అని ప్రజల భద్రత కోసం ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరు పాటించడం అవసరమని ఆయన కోరారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐసీసీ అబ్జర్వర్స్ సమావేశంలో
# పాల్గొన్న పద్మావతి రెడ్డి



**కోదాడ,మార్చి 22(నినాదం):** కేరళలో జరిగిన ఏఐసీసీ (ఏఐసీసీ) అబ్జర్వర్ల సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం, రాబోయే ఎన్నికల వ్యూహరచన, ప్రజలతో అనుసంధానంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. వివిధ రాష్ట్రాల్లో పార్టీ ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్ కార్యాచరణపై నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

# కారు ద్విచక్ర వాహనం ఢీ : ఒకరి పరిస్థితి విషమం





**కల్వకుర్తి, మార్చి 22 (నినాదం) :** కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనం పై వెళ్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా ఉన్న ఘటన కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఊరుకొండ మండలంలోని ఊరుకొండపేటలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఊరుకొండ పేట గ్రామ శివారులో ఈ ప్రమాదం జరిగింది. ఊరుకొండపేట గ్రామానికి చెందిన ప్రైవేట్ డ్రైవర్ ఎండి ఖుర్షీద్ ద్విచక్ర వాహనం పై ఊరుకొండ వైపు వెళ్తుండగా, వంగూరు మండలం మాచినోని పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి కారులో వస్తున్నారు. రోడ్డు మూలమలుపు వద్ద ఇరు వాహనాలు ఢీకొనడంతో ఎండి ఖుర్షీద్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ఈఘటనపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



**వనపర్తి ప్రతినిధి, మార్చి 22 (నినాదం) :** వనపర్తి పట్టణంలోని 12వ వార్డు రాజానగరం కు చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త రొట్టెల రాములు యాదవ్ మృతి చెందాడు. స్థానిక కౌన్సిలర్ నక్క రాణి రాజు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి సమాచారం ఇవ్వగా ఆదివారం ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రొట్టెల రాములు యాదవ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రొట్టెల రాములు యాదవ్ ఇటీవలే అనారోగ్యానికి గురయ్యారని, చికిత్స పొందుతూ ఆకస్మిక మరణానికి లోనైనట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అదే వార్డుకు చెందిన వడ్డేవాడకు చెందిన కురుమయ్య ఇటీవల మృతి చెందాడు. వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి కురుమయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నక్క రాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, న్యాయవాది బుచన్న, మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నక్కరాజు, వార్డు అధ్యక్షులు గౌడుగు రామకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగిరెడ్డి, కొత్త గొల్ల శ్రీనివాసులు, నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కందూరు గోపాల్, సింగిల్ విండో డైరెక్టర్ సంజీవ్ సాగర్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, వడ్డే శ్రీనివాసులు, ముద్దంగుల రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఆత్మకూర్ ఎస్సై జయన్న**



**అమరచింత, మార్చి 202, (నినాదం):** సైబర్ నేరాలపై పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ ప్రజలకు ఎస్సై జయన్న సూచించారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్ప్రభావాలు, ఫోక్సో చట్టం, సీసీ కెమెరాల ప్రాధాన్యం వంటి పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాలలోని పోలీస్ సేవలు, భద్రత చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, ఫోక్సో చట్టం, సీసీ కెమెరాల ప్రాముఖ్యత వంటి అంశాలను వివరించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మోసానికి గురైతే వెంటనే 1930 నెంబర్ కి ఫిర్యాదు చేయాలని సూచించారు. బ్యాంకులు ఎప్పుడు ఓటీపీ అడగవని ప్రజలకు గుర్తు చేశారు. ఫోక్సో చట్టం ప్రకారం మైనర్లపై నేరాలకు కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మద్యం వ్యసనం.. యువకుడి మృతి



**కోదాడ,మార్చి 22(నినాదం):** అనంతగిరి మండలం మొగలాయి కోట గ్రామానికి చెందిన మార్కపుడి కేశవ (30) అధిక మద్యం సేవించడంతో ఆరోగ్యం క్షీణించి లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. ఇటీవల తీవ్రమైన కడుపునొప్పితో ఇబ్బంది పడుతూ ఈ నెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అతడిని వెంటనే సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా, చికిత్స పొందుతూ మార్చి 22 ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య మార్కపుడి రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఏఎస్ఐ సి. హెచ్. లింగారెడ్డి తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

## ఆంజనేయ స్వామి గుడి లేని ఊరు లేదు
## కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అభివృద్ధి చేయని ఊరు లేదు

**మునుగోడు బి ఆర్ ఎస్ మండల పార్టీ**
**అధ్యక్షుడు మందుల సత్యం**



**మునుగోడు, మార్చి 22 (నినాదం):** మునుగోడు మండల కేంద్రంలోని బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మందుల సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఆంజనేయ స్వామి గుడి లేని ఊరు లేదు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అభివృద్ధి చేయని ఊరు లేదని ఆయన అన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ఆయన చేసిన అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. చండూర్, చౌటుప్పల్ మున్సిపాలిటీలు గా, చండూర్ ని రెవెన్యూ డివిజన్ గా డిండి ప్రాజెక్ట్, శివన్నగూడెం ప్రాజెక్ట్ పనులు ప్రారంభించడం---ఇవన్నీ ప్రభాకర్ రెడ్డి కృషి ఫలితమేనని అన్నారు. సోలిపురం గ్రామానికి కి వంతెన మంజూరు చేయడం కూడా ఆయన అభివృద్ధి దృక్పథానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని మునుగోడు నియోజకవర్గానికి 100 పడకల ఆసుపత్రి తీసుకురావడం ఆయన గొప్పతనం. అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక కొందరు వ్యక్తులు శిలాఫలకాలను ధ్వంసం చేసారు. శిలా ఫలకాలు కూల్చివేసిన ఘనత మీ కాంగ్రెస్ పార్టీ దేనని ఆ ఘనత మీ కాంగ్రెస్ పార్టీ దరిద్రులకే దక్కుతుందని హెచ్చరించారు. ప్రభాకర్ రెడ్డి 24 గంటలు మునుగోడు ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ఆయన మాట తప్పరు, మడమ తిప్పరు. అలాంటి అభివృద్ధి నాయకుడిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదు. రాజగోపాల్ రెడ్డి చెంచాగాళ్లు చేస్తున్న విమర్శలు సబబు కాదు అసలు మిమ్మల్ని రాజగోపాల్ రెడ్డి నాయకులు లా చూడట్లేదు. మిమ్మల్ని బానిస లాగా చూస్తుండని గుర్తించండి. మీ అనుచరులకు చెప్పండి. మునుగోడు అభివృద్ధి ప్రధాత ప్రభాకర్ రెడ్డి గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు మీకు తగిన విధంగా సమాధానం ఇస్తామని ముక్తకంఠంతో తెలిపారు. ఇటీవల జరిగిన స్థానిక, మున్సిపల్ ఎన్నికల్లో ' ఉకోండి గ్రామానికి వచ్చి 8 లక్షలు ఇస్తాను' అని చెప్పి, తర్వాత ఆ గ్రామాన్ని చూసే ప్రయత్నం కూడా చేయలేదు. చండూర్ లో అయ్యప్పగుడికి కోటి రూపాయలు, వృద్ధులకు పెన్షన్లు ఇస్తానని చెప్పి మాట తప్పింది కూడా మీరు కాదా రాజగోపాల్ రెడ్డి. అంతంపేట గ్రామంలో లో నిరుపేదలకు ఇళ్లులు కట్టిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఆ గ్రామం వైపు కూడా కన్నెత్తి చూడలేదు. రాజగోపాల్ రెడ్డి కి కాంట్రాక్టులు, కమిషన్లు ముఖ్యం. కానీ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కి ప్రజలతో కాంటాక్ట్ ముఖ్యం. రాజగోపాల్ రెడ్డి కి పదవి, కాంట్రాక్టుల పై మాత్రమే సోయి ఉంది , మునుగోడు ప్రజల పై మునుగోడు అభివృద్ధిపై ఆసక్తి కనిపించడం లేదు"మీ లాగా పుట్టకో మాట, రోజుకో పార్టీ మార్చే వ్యక్తి కాదు వ్యక్తిత్వం కాదు ప్రభాకర్ రెడ్డి ది. మిమ్మలిని చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుంది, నాకంటే ఎక్కువగా రంగులు మార్చుతున్నాడని.. మీ చెంచాగాలకు చెప్పు ప్రభాకర్ రెడ్డి చేసిన అభివృద్ధి కనిపించకపోతే, మీ ఐ క్యాంప్‌లో పంచిన అద్దాలు ఇచ్చి ఊరురు తిరిగి చూడమని చెప్పండి. లేకపోతే చర్చకు సిద్ధమా ?ఎమ్మెల్యేగా ప్రభాకర్ రెడ్డి చేసిన అభివృద్ధిని వివరించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. రాజగోపాల్ రెడ్డి మీరు ఏ అభివృద్ధి చేశారో ? మీరు చెప్తారా , లేక మీ చెంచాలను పంపిస్తారా చర్చకు? అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో, ప్రధాన కార్యదర్శి పగ్గిళ్ల సతీష్, మండల నాయకులు మధనబోయిన పరమేష్ యాదవ్, పోలగొని సైదులు, నల్గొండ అంజి, జంగిలి సాంబయ్య, భూపతి రెడ్డి, ఈద శరత్ బాబు, ఐతగోని శేఖర్, దోటి కరుణాకర్, బండారు శ్రీనివాస్, యాదవెల్లి సురేష్, గోలి ప్రవీణ్, ఓరంగటి శంకర్, గాలి సైదులు బీ ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఐ దరఖాస్తుకి జవాబు ఇవ్వాల్సిందే..


**తప్పుదారి పట్టిస్తే చర్యలు తప్పవు**
**ఆర్టీఐ కమిషన్ కఠిన హెచ్చరిక**
**గురుకులాల సమాచారం రెండు వారాల్లో ఇవ్వాలి**
**ఉమ్మడి జిల్లా ఎస్టీ గురుకులాల పీఐవోలకు ఆదేశాల**







**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మార్చి 22(నినాదం) :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై రాష్ట్ర సమాచార కమిషన్ కఠినంగా స్పందించింది. దరఖాస్తుదారుడు కోరిన పూర్తి సమాచారాన్ని రెండు వారాల్లోగా తప్పనిసరిగా అందజేయాలని ఆదేశిస్తూ, లేనిపక్షంలో ఆర్టీఐ చట్టం సెక్షన్ 20 ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి దరఖాస్తుదారుడు తెలిపిన దాని ప్రకారం పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ దరఖాస్తుదారుడు 18-11-2023న సమాచార హక్కు చట్టం-2005 కింద ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎస్టీ గురుకులాలకు సంబంధిం చిన వివరాలను కోరుతూ దరఖాస్తు సమర్పించారు. అయితే, సంబంధిత పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులు నిర్ణీత గడువులోగా సమాచారం అందజేయలేదు. దీంతో సదరు దరఖాస్తుదారుడు 08-01-2024న మొదటి అప్పీల్ దాఖలు చేశారు. మొదటి అప్పీల్ అధికారుల నుంచి కూడా స్పందన రాకపోవడంతో, 22-01-2024న రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్ 27-01-2024న కమిషన్ స్వీకరించి, 05-03-2026న విచారణ చేపట్టి, తీర్పును వెల్లడించింది. కాగా, కమిషన్ ఇచ్చిన తీర్పులో మచ్చుకు కొన్ని పరిశీలించగా, సింగరేణి ఈఎంఆరఎస్ గురుకులానికి సంబంధించిన కేసులో సమాచారం ఇచ్చామని అధికారులు వాదించినప్పటికీ, దానికి సరైన ఆధారాలు చూపలేకపోవడంతో కమిషన్ ఆ వాదనలను కొట్టివేసింది. అలాగే మణుగూరులోని టిటిడబ్ల్యూయు ఆర్‌జేసి(గర్ల్స్) గురుకులానికి సంబంధించిన కేసులో, పీఐఓ ప్రతినిధి దరఖాస్తు గురించి తెలియదని చెప్పి సమయం కోరినప్పటికీ, సమాచారం అందజేయడంలో ఎటువంటి ప్రయత్నం చేయలేదని కమిషన్ తేల్చింది. ఈ నేపథ్యంలో, సంబంధిత పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులకు కమిషన్ కఠిన ఆదేశాలు జారీ చేసింది. దరఖాస్తుదారుడికి పూర్తి సమాచారాన్ని రిజిస్టర్డ్ పోస్టు (ఆర్‌పీఏడి) ద్వారా రెండు వారాల్లోగా అందజేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించింది. దరఖాస్తు దారులను పక్కదారి పట్టించేలా తప్పుడు లేదా అసంపూర్ణ సమాచారం ఇవ్వడానికి ప్రయత్నించినా చట్టం ఉపేక్షించదని కమిషన్ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, కమిషన్ ఆదేశాలు ఉన్నప్పటికీ అనేక కార్యాలయాలు దరఖాస్తుదారులను తమ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నాయని, సరైన విధానంలో పూర్తి సమాచారం అందించడం లేదని పలువురు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కమిషన్ కఠినంగా స్పందించడం పట్ల దరఖాస్తుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సమాచారం అందించడం ప్రభుత్వ బాధ్యత అని, అందుకు పిఐవోలదే కీలక బాధ్యత అని, ఆ బాధ్యతను విస్మరించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఈ తీర్పుతో మరోసారి స్పష్టమైంది. కాగా ఆర్టీఐ కమిషన్ ఇచ్చిన ఈ తీర్పుతో ప్రజల్లో మరింత బలాన్ని చేకూర్చిందని, చట్టం పట్ల మరింత విశ్వాసాన్ని పెంచిందని పలువురు సామాజిక వేత్తలు, ఆర్టీఐ కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# 2026 పంచ రాష్ట్ర సమరం

## జాతీయ కాంక్ష - ప్రాంతీయ అస్తిత్వాల పోరాటం
## మినీ కురుక్షేత్రం: బెంగాల్ నుంచి కేరళ దాకా హోరాహోరీ పోరు

ఎడిటోరియల్

భారత రాజకీయ యవనికపై 2026 అసెంబ్లీ ఎన్నికలు జాతీయ రాజకీయ సమీకరణాలను మలిచే కీలక ఘట్టంగా అవతరిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతంలో జరగనున్న ఈ ఎన్నికలు కేవలం అధికార మార్పిడికే పరిమితం కాకుండా, జాతీయవాదం మరియు ప్రాంతీయ అస్తిత్వ రాజకీయాల మధ్య జరుగుతున్న విస్తృతమైన భావజాల పోరాటంగా మారాయి. భారత ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు సుమారు 17.4 కోట్ల మంది ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోనున్నారు. 2021 ఎన్నికలతో పోలిస్తే ఓటర్ల సంఖ్యలో గణనీయమైన పెరుగుదల కనిపించడం, యువ ఓటర్ల ప్రవేశం పెరగడం ఈ ఎన్నికలకు మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చాయి. ఏప్రిల్ 9న ప్రారంభమయ్యే పోలింగ్ ప్రక్రియ వివిధ దశల్లో కొనసాగి, మే 4న వెలువడే ఫలితాలు 2029 లోక్‌సభ ఎన్నికలకు దిశానిర్దేశం చేసే అవకాశముంది.

పశ్చిమ బెంగాల్ రాజకీయ సమరరంగం ఎప్పటిలాగే ఉత్కంఠ భరితంగా మారింది. 294 స్థానాలున్న ఈ రాష్ట్రంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ తన సంక్షేమ పథకాల ఆధారంగా మూడోసారి అధికారాన్ని నిలబెట్టు కోవాలని చూస్తోంది. 2016లో కేవలం 3 స్థానాలకు పరిమితమైన బీజేపీ, 2021లో 77 స్థానాలకు ఎదగడం రాష్ట్ర రాజకీయాల్లో భారీ మార్పుకు సంకేతం. ప్రస్తుతం బీజేపీ 'హిందుత్వ' భావజాలంతో పాటు తృణమూల్ ప్రభుత్వంపై వచ్చిన ఉపాధ్యాయ నియామకాల అవినీతి ఆరోపణలు వంటి అంశాలను ప్రచార ఆయుధాలుగా ఉపయోగిస్తోంది. మరోవైపు తృణమూల్ ప్రభుత్వం మహిళా సంక్షేమ పథకాలు, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలతో తన పట్టు నిలుపు కోవడానికి ప్రయత్నిస్తోంది. ముస్లిం ఓటు బ్యాంకు, మహిళా ఓటర్ల ధోరణి, గ్రామీణ ఓటింగ్ శాతం—ఇవి ఫలితాలను నిర్ణయించే కీలక అంశాలుగా కనిపిస్తున్నాయి.

తమిళనాడులో 234 స్థానాలకు జరుగుతున్న పోరు ద్రావిడ రాజకీయాల కొనసాగింపు మరియు మార్పు మధ్య సాగే సమరం. 2021లో ఎం.కె. స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కూటమి 159 స్థానాలతో అధికారంలోకి వచ్చి, 'ద్రావిడ మోడల్' పాలనను అమలు చేస్తోంది. ఉచిత బస్సు ప్రయాణం, విద్యా ప్రోత్సాహక పథకాలు వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో ఆదరణ పొందాయి. మరోవైపు అన్నాడీఎంకే, గతంలో జరిగిన అంతర్గత విభేదాల తర్వాత మళ్లీ పునర్ వ్యవస్థీకరణతో బీజేపీతో కలిసి పోటీలో నిలుస్తోంది. ఈసారి సినీ నటుడు విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' యువ ఓటర్లపై చూపే ప్రభావం ఆసక్తికర అంశంగా మారింది. రాష్ట్రంలో మొదటిసారి ఓటు వేయబోయే యువత శాతం పెరగడం, నగర ప్రాంతాల్లో రాజకీయ అవగాహన పెరగడం ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

కేరళలో 140 స్థానాలకు జరిగే పోరు సాంప్రదాయ రాజకీయ సమీకరణాలను పరీక్షించ బోతోంది. 2021లో పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ 99 స్థానాలు గెలుచుకుని చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. అయితే ఈసారి వామపక్ష ప్రభుత్వంపై 'గోల్డ్ స్మగ్లింగ్ కేసు', కొన్ని పారిశ్రామిక వివాదాలు వంటి అంశాలు ప్రతిపక్షానికి ఆయుధాలుగా మారాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ మళ్లీ అధికారంలోకి రావాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోంది. బీజేపీకి శాసనసభలో ప్రాతినిధ్యం లేకపోయినా, సుమారు 12 శాతం ఓటు వాటా ఉండటం గమనార్హం. కేరళలో మైనారిటీ ఓటు, విద్యావంతుల ఓటింగ్ ధోరణి, వలస కార్మికుల ప్రభావం వంటి అంశాలు ఫలితాలను ప్రభావితం చేసే ప్రధాన కారకాలు.

అస్సాంలో 126 స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, సాంస్కృతిక అస్తిత్వాన్ని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోంది. హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రాంతీయ గుర్తింపును బలోపేతం చేసే విధానాలు ప్రధానంగా నిలిచాయి. 'పౌరసత్వ సవరణ చట్టం ', 'జాతీయ పౌర రిజిస్టర్' వంటి అంశాలు ఇంకా రాజకీయ చర్చలోనే ఉన్నాయి. 2021లో బీజేపీ కూటమి 75 స్థానాలు గెలుచుకోగా, కాంగ్రెస్ కూటమి 50 స్థానాల వద్ద నిలిచింది. ఈసారి కూడా బీజేపీకి స్వల్ప ఆధిక్యం ఉన్నప్పటికీ, ప్రతిపక్ష ఐక్యత ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతంలో 30 స్థానాలకు జరిగే పోరు పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, జాతీయ పార్టీలకు ఒక రాజకీయ పరీక్షాగారంలా ఉంటుంది. 2021లో ఎన్. రంగస్వామి నేతృత్వంలోని కూటమి 16 స్థానాలతో అధికారంలోకి వచ్చింది. ఇక్కడ స్థానిక సమస్యలు, అభివృద్ధి, పరిపాలనా సామర్థ్యం ప్రధాన అంశాలుగా మారతాయి. చిన్న ప్రాంతం అయినప్పటికీ, జాతీయ రాజకీయ ధోరణులను ప్రతిబింబించే ప్రాముఖ్యత దీనికి ఉంది.

ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికలను సమగ్రంగా పరిశీలిస్తే మూడు ప్రధాన ధోరణులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సంక్షేమ రాజకీయాలు—ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చే పథకాలపై అన్ని పార్టీలు దృష్టి సారించాయి. ప్రాంతీయ అస్తిత్వం వర్సెస్ జాతీయవాదం—ప్రాంతీయ పార్టీల బలమైన ప్రాతిపదిక ఉన్న రాష్ట్రాల్లో జాతీయ పార్టీల విస్తరణకు సవాళ్లు ఎదురవుతున్నాయి. వ్యూహాత్మక పొత్తులు—స్పష్టమైన మెజారిటీ సాధించడానికి కూటములు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ప్రస్తుత పరిస్థితులను విశ్లేషిస్తే పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు స్వల్ప ఆధిక్యం కనిపిస్తున్నప్పటికీ బీజేపీ గట్టి పోటీ ఇస్తోంది. తమిళనాడులో డీఎంకే కూటమి తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు బలంగా ఉన్నాయి. కేరళలో పోటీ హోరాహోరీగా ఉండి చివరి వరకు ఉత్కంఠను రేకెత్తించే అవకాశం ఉంది. అస్సాంలో బీజేపీకి కొంత ముందంజ ఉన్నా ప్రతిపక్ష ఐక్యత కీలకం. పుదుచ్చేరిలో ప్రస్తుత కూటమికే అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మొత్తంగా చూస్తే, ఈ 2026 పంచ రాష్ట్ర ఎన్నికలు భారత ప్రజాస్వామ్యానికి ఒక పెద్ద పరీక్షగా నిలుస్తున్నాయి. ఓటర్ల తీర్పు కేవలం రాష్ట్ర ప్రభుత్వాలను మాత్రమే నిర్ణయించదు; దేశ రాజకీయ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తుంది. జాతీయ ఆశయాలు, ప్రాంతీయ అస్తిత్వాలు, సంక్షేమ వాగ్దానాలు అన్నీ ఏకీభవిస్తున్న ఎన్నికల సమరం ఇది. చివరకు ప్రజల తీర్పే భారత రాజకీయ దిశను నిర్ణయించే తుది మాటగా నిలుస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,
కాలమిస్ట్...9440595494

# విప్లవ వీరులు... భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురులు

**భారతదేశ చరిత్రలో మార్చి 23వ తేదీకి ఓ ప్రత్యేకత ఉంది. విప్లవవీరులైన సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు ఉరితీయబడిన రోజు 1931 మార్చి 23. ప్రత్యేక పాకిస్తాన్ కావాలని 1940లో తీర్మానించిన రోజు మార్చి 23. పాకిస్థాన్ ఇస్లామిక్ ప్రజాస్వామ్యమని 1956లో తీర్మానం చేసి అమలులోకి తెచ్చుకున్న రోజు మార్చి 23.**




విప్లవ వీరులైన సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు ఉరితీయ బడిన రోజు 1931 మార్చి 23. ఈ రోజును అమర వీరుల దినోత్సవంగా జరుపు కుంటారు.
1927లో భారతదేశానికి వచ్చన సైమన్ కమిషన్ లోఒక్క భారతీయుడైనా లేనందుకు నిరసనగా, ఉద్యమంలో లాల్‌జీ కీలక పాత్ర వహించి, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలి అంటూ పంజాబ్ అసెంబ్లీలో ఆయన తీర్మానం పెట్టి గెలిపించారు. ఇది ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. అక్టోబర్ 30, 1928న ఆ కమిషన్ లాహోర్ రాగా, లాల్‌జీ కూడా అహింసతో, మౌనంగా సైమన్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమిస్తున్న వారిపైన కూడా లాఠీ చార్జికి ఆదేశించాడు పోలీసు సూపరింటెండెంట్ జేమ్స్ ఏ స్కాట్. తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీ తో స్కాట్ తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలతోనే లాల్‌జీ నవంబర్ 17న చనిపోయారు. ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించు కున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హతమార్చడానికి విప్లవకారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్, సుఖ్‌దేవ్ థాపర్‌లతో ఆయన చేతులు కలిపాడు. డీఎస్పీ జే. పీ. సాండర్స్ కనిపించినప్పుడు పొరపాటుగా స్కాట్ అనుకుని, జైగో పాల్ ఆయన్ను కాల్చమంటూ సింగ్‌కు సంకేతాలిచ్చాడు. ఫలితంగా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు. ఫిరోజ్ పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హత మార్చినందుకు గాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు.
భగత్ సింగ్ సహా ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసిన తీర్పు వివరాలను 2015లో ప్రచురించారు. 'Warrant of Execution On Sentence Of Death' అనే విడుదల చేసిన పత్రంలో 1930 అక్టోబర్ 7వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పిచ్చినట్లు స్పష్టంగా ఉంది. 1931, మార్చి 23న ఉరిశిక్ష అమలు చేసినట్లు మరో పత్రంలో వివరాలు ఉన్నాయి. జైలు సూపరింటెండెంట్ సంతకం చేసిన పేపర్‌ను టైమ్స్ ఫ్యాక్ట్ చెక్ గుర్తించి బహిర్గతం చేసి, లాహోర్‌లోని పంజాబ్ శాఖలో ఈ పత్రాలను ఇటీవల ప్రదర్శనకు ఉంచారు.
1930 అక్టోబర్ 7 న న్యాయ స్థానము తీర్పును వెలువరించింది. తీర్పు 281 పేజీల్లో ఇవ్వబడింది. విచారణ ఎదుర్కొన్న వారందరికీ వివిధ శిక్షలు ఇవ్వబడ్డాయి. ఉరిశిక్ష: 1.భగత్ సింహ్ 2. సుఖఃదేవ్ 3. రాజగురులకు; అలాగే ఆజన్మాంతర జీవిత ఖైదు: 1.కిశోరీలాల్ 2. మహావీర్ సింహ్ (అండమాన్లో 9 రోజులు నిరాహార దీక్ష చేసి అమరుడయ్యాడు. 3. విజయ్ కుమార్ సింహ్ 4. శివవర్మ 5. గయా ప్రసాద్ 6. జయదేవ్ కపూర్ 7. కమల్ నాథ్ తివారిలకు; అలాగే జీవిత ఖైదు: 1.కుందాన్లాల్ ( 7 సంవత్సరాలు) 2. ప్రేమదత్ ( 5 సంవత్సరాలు )లకు; అలాగే అజయ్ ఘోష్, సురేంద్రనాథ్ పాండియ ఇంకా జితేంద్రనాథ్ సన్యాల్ లను విడిచి పెట్టారు.
విచారణ లో ఉన్నవారందరూ కోర్టులను బహిష్కరించడం వలన తీర్పును లాహోర్ లోని సెంట్రల్ జైలు లో వినిపించారు.
తమను యుద్ధ ఖైదీలుగా గుర్తించడం ద్వారా ఉరి తీయకుండా కాల్పుల బృందం చేత హత మార్చాలని జైలులో ఉన్నప్పుడు భగత్ సింగ్ , మరో ఇద్దరు వైస్రాయికి లేఖ రాశారు. క్షమాభిక్ష ముసాయిదా లేఖపై సంతంకం కోసం భగత్ సింగ్ మిత్రుడు ప్రన్నత్ మెహతా ఆయన్ను ఉరి తీయడానికి నాలుగు రోజుల ముందు మార్చి 20న జైలులో కలిశాడు. అయితే సంతకం చేయడానికి సింగ్ నిరాకరించాడు. మార్చి 23న ఉరి తీసినట్లు జైలు అధికారులు మరణ ధ్రువీకరణ పత్రాన్ని విడుదల చేశారు. అప్పటి సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ వి.ఎన్. స్మిత్ ప్రకారం, భగత్ సింగ్‌ను ముందుగానే ఉరితీశారు.
సాధారణంగా ఉదయం 8 గంటలకు ఉరి తీసేవారు. అయితే ఏమి జరిగిందో ప్రజలు తెలుసుకునే లోగానే ఆయన్ను ఉరితీయాలని నిర్ణయించుకుని...సుమారు రాత్రి 7 గంటల ప్రాంతంలో ఉరి తీశారు.
భగత్ సింగ్ వీర మరణం వృథా కాలేదు, ఎందరో యువకులను భారత స్వాతంత్ర్యోద్యమము వైపుకు మరల్చింది.
భగత్ సింగ్ మరణం భారత స్వాతంత్ర్యోద్యమ కొనసాగింపుకు సాయపడేలా వేలాది మంది యువకుల్లో స్ఫూర్తిని నింపింది. ఆయన ఉరి అనంతరం ఉత్తర భారతాన పలు ప్రాంతాల్లో బ్రిటీష్ ప్రభుత్వమునకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల

# అమరవీరుల త్యాగాల పునాదులపై స్వర్ణభారతి

## (23 మార్చి "భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్ గురు అమరత్వం పొందిన దినం" సందర్భంగా)

ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, అందరికీ వందనాలు. 1858 నుంచి 1947 వరకు బ్రిటీష్ వన్య పాలకుల పాలనలో ఎందరో మహానుభావులు స్వేచ్ఛ కోసం పిడికిలి బిగించి పోరాడి తుదకు ప్రాణాలు సహితం అర్పించారు. భరతమాత దాస్య శృంఖలాలను ఛేదించి స్వేచ్ఛను సమకూర్చే మహాయజ్ఞంలో ప్రాణాలర్పించిన నిస్వార్థ దేశ భక్తులు ఎందరో. అలాంటి అమరుల జాబితాలో మహాత్మాగాంధీతో మొదలు అసంఖ్యాక యోధులు ఎనలేని పోరాట పటిమ ప్రదర్శించి తెల్ల తోలు పాలకుల గుణడెల్లో గుబులు పుట్టించారు. ఆ జాబితాలో అమరులైన ప్రముఖులుగా భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు యువ త్రయం ముందు వరుసలో ఉంటారు.



**ఎందరో అమరులు - అందరికీ వందనాలు:**

23 మార్చి 1931న అపర దేశ భక్తులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్ గురు త్రయం దేశ సేవలో తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన స్వాతంత్ర్య సమర యోధులను ఉరికంబం ఎక్కించిన రోజుగా దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో చెరగని ముద్రను వేసింది. 23 మార్చి షహీదా దివస్ లేదా అమరుల దినంతో పాటు ఇతర భరతమాత ముద్దు బిడ్డలు ప్రాణాలర్పించిన 30 జనవరిని మహాత్మాగాంధి వర్ధంతి, మే 19న అస్సాం అమరవీరుల దినం, 13 జూలైన కాశ్మీర్ అమరవీరుల దినం, 21 అక్టోబర్‌న పోలీస్ అమరవీరుల దినం, 17 నవంబర్‌న ఒరిస్సాలో లాలా లజపతిరాయి రాయ్ వర్ధంతి, 19 నవంబర్‌న ఝాన్సీ లక్ష్మి భాయ్ జన్మదినం, 24 నవంబర్‌న సిక్కు గురు తేగ్ బహదూర్ వర్ధంతి లాంటి పలు అమరవీరుల జ్ఞాపకార్థ కార్యక్రమాలు నిర్వహించడం భారత దేశవ్యాప్తంగా జరుగుతున్నది.

**దేశ సేవలో అమరత్వం పొందిన యోధులు:**

దేశభక్తిని నరనరాన జీర్ణించుకున్న యువకులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్ తాపర్, శివరామ్ రాజ్‌గురు త్రయం "హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్" సభ్యులుగా స్వాతంత్ర్య ఉద్యమ కెరటాల వలె ఎగిసిపడి బ్రిటీష్ పాలనను వ్యతిరేకిస్తూ యువ విప్లవ జ్యోతులుగా వెలుగొందారు. లాలా లజపతిరాయి మరణానికి స్పందనగా నాటి బ్రిటీష్ అధికారి జె పి సార్స్‌ను చంపారనే అభియోగాల మీద ఈ ముగ్గురు యువకులను అరెస్టు చేసి "లాహోర్ కాన్స్పరసీ కేసు"ను కొనసాగించిన బ్రిటీష్ వలస పాలకులు ఈ యువ త్రయానికి ఉరి శిక్ష విధించడం జరిగింది. అంత ర్జాతీయ పౌర సమాజం క్షమాభిక్ష పెట్టాలని వేడుకున్నప్పటికీ కక్ష పూరితంగా వలస పాలకులు 23 మార్చి 1931న ఈ ముగ్గురిని ఉరి తీయడం జరిగింది. భగత్ సింగ్ త్రయం 08 ఏప్రిల్ 1929న ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదిస్తూ సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీపై బాంబులు విసరడంతో కేసును నమోదు చేసి లాహోర్ జైల్‌లో ఉరి శిక్ష అమలు చేసారు. దేశవాసుల అశ్రునయనాల మధ్య వారి పార్థివ దేహాలను సుత్లజ్ నదీ తీరాన దహన సంస్కారాలునచేయడం జరిగింది. ఈ ముగ్గురు అగ్గి రవ్వలు చూపిన తెగువ, దేశభక్తి, అంకితభావం, త్యాగగుణం, ధైర్య సాహసాలు నేటి భారతీయ యువతకు దారి దీపాలుగా నిలుస్తున్నాయి.

వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ, వారు అందించిన స్వాతంత్ర్యాన్ని భాద్యతాయుతంగా అనుభవిస్తూ దేశ అభ్యున్నతికి సమిధలుగా మారాలని కోరుకుందాం.
భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ 23 మార్చిన వారి చిత్రపటాలకు నివాళులు అర్పించడం, విద్యాలయాల్లో అవగాహనలు, ప్రజలను చైతన్యపరచడం, దేశభక్తి కేంద్రంగా ర్యాలీలు నిర్వహించడం, వారి జీవిత చరిత్రకు సంబంధించిన సినిమాల ప్రదర్శనలు, రక్తదాన శిబిరాలు, క్యాండిల్ లైట్ ర్యాలీలు, కవితా పోటీలు లాంటి కార్యక్రమాలను నిర్వహించి వారి రుణం తీర్చుకుందాం. మహానుభావుల త్యాగాలకు ప్రతిఫలం ఈ స్వతంత్రం, మన కర్తవ్యాలను నిర్వహిద్దాం. స్వేచ్ఛ ఉచితంగా రాలేదు, ప్రాణ త్యాగం చేసిన వారికి సదా రుణపడి ఉందాం. అమరవీరులా ఎన్నడు మన హృదయాల్లో జీవించే ఉంటారు. నేటి యువభారతానికి ఉజ్వల యువ కెరటాలైన భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు త్రయానికి ఘన నివాళులు అర్పిద్దాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రెక్కలు తెగిన పక్షులు

పెయ్యిని కరిగించి పూట్రొతులుగా చేసి
కండలు కరిగించి కంకర రాల్లుగా చేసి
శెమట సుక్కలను సిమెంట్ గా చేసి
గూడు జేసుకున్న గరీబోల్ల తనువులను
తెల్లారక ముందే తెర్లు జేసిండ్రు

గొల్కుమని గోసపడినా గోడలను కూల్చేసి
దేవుని గూల్లో దీపాలను ఆర్పేసిండ్రు
కాళ్లు పట్టుకొని కరములను జోడించినా
కనికరం చూపించకుండా చిద్రం జేసిండ్రు
గూడుతో గూడు కట్టుకున్న మధుర తీగలను
నిలువునా కోసేసి శకలాల కింద
బొంద పెట్టిన్రు

పాదాలతో తిరిగి పాలు
పొంగించిన ఇంట్లోనే
కన్నీళ్ల జలపాతాలను పారించారు
పోరల్ల పుస్తకాలు సంచులల్ల సర్దకముందే
సకలాన్ని సడక్ మీదేసి
రెక్కల తెగిన పక్షిని
జేసిండ్రు
మానవత్వాన్ని నిశ్శబ్ద లోయలోకి నెట్టేసి
అధికార మగత ఊయలలో ఊరేగుతుండ్రు

ఎన్నుకున్న ఏలికలు పుడమిని పుక్కిట పట్టి
పుడమికి ఊపిరాడకుండా జేస్తుండ్రు
గ్లోబలైజేషన్ కు తలుపులు బార్లా తెరిచి
గరీబోల్ల వెన్ను పూసలను విరిచేసి
వాళ్ల కన్నీళ్ల తోటి కచేరి పెడుతుండ్రు

గూడు చెదిరిన గుండెలు. కార్చిన రక్త
కన్నీళ్లు. జ్వాలలై రగులుతాయి
తెగిపడిన బతుకులు కథనరంగమై
కదులుతూ కండ్లెర్ర జేస్తాయి
కరములన్నీ కలిసి కాలే మంటలై
కాలగర్భంలో కలిపేస్తాయి జాగ్రత్త

తాటిపాముల రమేశ్ (తార )
7981566031

# ముందస్తు హెచ్చరికలతో నష్ట నివారణ!

## (23 మార్చి "ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం" సందర్భంగా)



నేడు ప్రపంచవ్యాప్తంగా 75వ 'ప్రపంచ వాతావరణ శాస్త్ర సంస్థ' అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించుకుంటున్న వేళ "ముందస్తు హెచ్చరికల వాతావరణశాస్త్ర సాంకేతికతలో గ్యాప్‌లను తగ్గించడం" అనే ఇతివృత్తం తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నాయి. తీవ్రమైన ప్రమాదకర వాతావరణ పరిస్థితులు ముందస్తు తెలుసుకోవడం వల్ల జరగనున్న ఆస్తి ప్రాణ నష్టాలను తగ్గించడానికి మానవాళికి సరైన సమయం దొరకడం, నష్ట నివారణ చర్యలు తీసుకోవడం జరుగుతూ వస్తున్నది. వాతావరణ హెచ్చరికల రంగంలో వస్తున్న నూతన విప్లవాత్మక మార్పులను స్వాగతిస్తూ, మరింత ముందంజ వేయడానికి ప్రతి ఏట 23 మార్చిన "ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం" లేదా "వరల్డ్ మెటీరియొలాజికల్ డే" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. హరికేన్లు, అకాల వర్షాలు, కరువుకాటకాలు, మండుటెండలు, తుఫాన్లు, తీవ్రమైన గాలుల లాంటి వాతావరణ ప్రతికూల పరిస్థితులను ముందుగానే ఖచ్చితమైన అంచనాలతో పసిగట్టడంతో పాటు ఆయా ప్రాంతాల ప్రభుత్వాలు, ప్రజలను ముందస్తు హెచ్చరించడం నిరంతరం కొనసాగడానికి నవ్య వాతావరణ శాస్త్ర సాంకేతికతలు, ఏఐ టెక్నాలజీలను వినియోగించడం నేటి మానవాళికి వరంగా మారింది.

**వర్తమాన పరిశీలనలతో భవిష్యత్తు సురక్ష:**

గతంలో రేడియో లేదా ప్రభుత్వ యంత్రాంగాల ద్వారా వాతావరణ ప్రతికూలాల హెచ్చరికలు జరుగుతూ ఉండేవి. నేటి డిజిటల్ యుగంలో క్షణాల్లో హెచ్చరికల వార్తలు ప్రజల ముంగిట్లో ప్రత్యక్షం కావడంతో నష్ట నివారణ విజయవంతంగా జరుగుతున్నది. 2026 ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం ఇతివృత్తంగా "వర్తమాన పరిశీలనలతో భవిష్యత్తు సురక్ష" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. 'మీటర్ కన్వెన్షన్' ఏర్పడి నేడు 151వ వార్షికోత్సవం జరుపుకుంటున్న వేళ ఈ ఇతివృత్తం అధిక ప్రాధాన్యతను సంచరించుకున్నది. నేడు పర్యావరణ కాలుష్యం కోరలు చాస్తున్న వేళ అకాల వర్ష వడగళ్లు, తీవ్రమైన రువుకాటకాలు, ఆకస్మిక పెను తుఫాన్లు మంచు వర్షాలు, అడవుల్లో కార్చిచ్చులు, అపరిమిత ఉష్ణోగ్రతలు లాంటి వాతావరణ మార్పులను ముందుగానే పసిగట్టి ప్రజలను చైతన్య పరచడం జరుగుతోంది. ప్రజల ప్రాణాలు కాపాడడం, జీవనోపాధులను పరిరక్షించడం, పౌరసమాజాన్ని అన్ని వేళ్ల జాగరూకతతో ఉంచడం, అత్యవసర సేవలను సిద్ధం చేయడం, విపత్తు నివారణ విభాగాలను సర్వ వేళల్లో సిద్ధంగా ఉంచడంలో ముందస్తు వాతావరణ హెచ్చరికలు తోడ్పడుతున్నాయి.

**ముందస్తు హెచ్చరికలే శ్రీరామరక్ష :**

నేటి ప్రపంచ దేశాల్లో దాదాపు 108 దేశాలు ఆధునిక వాతావరణ శాస్త్ర సాంకేతికతలను వినియోగిస్తున్నప్పటికీ అల్పాదాయ దేశాల్లో నేటికీ పరిస్థితులు భిన్నంగానే ఉన్నాయి. గత కొన్ని ఏళ్లలో దాదాపు 39 శాతం వరకు ముందస్తు హెచ్చరికల వ్యవస్థల్లో అభివృద్ధి సాధించడం గమనార్హం. నేటి విపరీత పరిస్థితుల్లో వాతావరణ ప్రతికూల మార్పులు, తీవ్రమైన వాతావరణ ప్రతిచర్యలకు సమాధానంగా ప్రపంచ దేశాలు ప్రభుత్వాలు, వాతావరణ శాస్త్ర అత్యాధునిక పరిశోధనా సంస్థలు, వాతావరణ శాస్త్ర విభాగాలను పదును పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని తెలుసుకోవాలి. వాతావరణ ప్రతికూల మార్పుల వెనుక దాగి ఉన్న కారణాలతో పాటు వాటిని ప్రతిఘటించడం, ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండడం, కనిష్ట నష్టాలను నమోదు చేసుకోవడం లాంటి అంశాలకు అవగాహన పర్చుకోవడానికి ప్రతి ఒక్కరు ప్రాధాన్యం ఇవ్వాలి. వాతావరణ విధ్వంసాలను అరికట్టడానికి కార్బన్ ఉద్గారకాలను తగ్గించడం, మొక్కలు నాటడం, పర్యావరణ హిత పాలసీల అమలు, పర్యావరణ పరిరక్షణ ప్రయత్నాలు, అవగాహనలు కొనసాగుతూనే ఉండాలి. ప్రభుత్వ వాతావరణ శాస్త్ర విభాగం ద్వారా వాతావరణ హెచ్చరికలు, తుఫాన్ల ముందస్తు అంచనాలు, విపత్తు నివారణ వ్యవస్థల నిర్వహణలు, భూకంపాల తీవ్రత హెచ్చరికలు, పరిశోధనల్లో ముందడుగులు, సమాచార గణాంకాల విశ్లేషణలు, సముద్ర వైమానిక తోడ్పాట్లు, ప్రజా చైతన్యాలు నిరంతరం జరిగితేనే ప్రపంచ మానవాళి సురక్ష జరుగుతుందని తెలుసుకుందాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ముడతలు లేని ముఖం కోసం
# గాడిద పాల వినియోగం



గాడిద పాలు సౌందర్య సాధనాలలో ఒక విప్లవాత్మక మార్పును తీసుకువచ్చాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు. వీటిలో ఉండే విటమిన్ అమినో యాసిడ్స్ చర్మానికి అవసరమైన పోషణను అందించి ముడతలను నివారిస్తాయి. చర్మంపై వయసు రీత్యా వచ్చే గీతలను తగ్గించి, ముఖాన్ని ఎప్పుడూ యవ్వనంగా ఉంచడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. ప్రాచీన కాలం నుండి రాణులు తమ అందాన్ని కాపాడుకోవడానికి ఈ పాలనే ప్రధానంగా వాడేవారు అని చరిత్ర చెబుతోంది. రసాయనాలతో కూడిన క్రీముల కంటే సహజ సిద్ధమైన గాడిద పాలు వాడటం వల్ల చర్మానికి ఎంతో రక్షణ లభిస్తుంది. ముఖంపై పేరుకుపోయిన మలినాలను తొలగించి, చర్మాన్ని లోపలి నుండి శుభ్రం చేయడంలో పాలు అద్భుతంగా పనిచేస్తాయి. అందుకే నేడు అంతర్జాతీయ స్థాయిలో ఖరీదైన యాంటీ ఏజింగ్ ఉత్పత్తులలో గాడిద పాలను విరివిగా ఉపయోగిస్తున్నారు. చర్మం బిగుతుగా, కాంతివంతంగా ఉండాలనుకునే వారికి గాడిద పాలు ఒక గొప్ప సహజ వరం వంటివని చెప్పవచ్చు.

చర్మం పొడిబారడం వల్ల వచ్చే ముడతలను అరికట్టడంలో గాడిద పాలు ఒక అద్భుతమైన మాయిశ్చరైజర్‌గా పనిచేస్తాయి. వీటిలో ఉండే ప్రోటీన్లు చర్మానికి తగినంత తేమను అందించి, రోజంతా ముఖాన్ని తాజాగా ఉంచడానికి సహాయపడతాయి. ముఖ్యంగా కళ్ల చుట్టూ వచ్చే నల్లటి వలయాలను మరియు ముడతలను తగ్గించడంలో ఈ పాలకు సాటి మరేదీ లేదు. చర్మంపై ఉండే కొల్లాజెన్ స్థాయిని పెంచడం ద్వారా చర్మం తన స్థితిస్థాపకతను కోల్పోకుండా ఇవి కాపాడతాయి. ఎండ వల్ల దెబ్బతిన్న చర్మాన్ని తిరిగి యథాస్థితికి తీసుకురావడానికి గాడిద పాలతో చేసే మసాజ్ ఎంతో మేలు చేస్తుంది. ప్రతిరోజూ కొద్దిగా గాడిద పాలను ముఖానికి రాసుకోవడం వల్ల చర్మం మృదువుగా మారి పట్టులా మెరుస్తుంది. సున్నితమైన చర్మం కలిగిన వారు కూడా ఎటువంటి భయం లేకుండా ఈ పాలను సౌందర్య సాధనంగా వాడవచ్చు. ప్రకృతి ప్రసాదించిన ఈ పాలతో ముఖ సౌందర్యాన్ని పెంచుకోవడం ఒక సురక్షితమైన మరియు ఆరోగ్యకరమైన పద్ధతి.

గాడిద పాలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాల పునరుద్ధరణకు ఎంతగానో దోహదపడతాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఇవి చర్మంపై ఉండే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి, కణాలు దెబ్బతినకుండా అడ్డుకుని ముడతలు రాకుండా నిలువరిస్తాయి. చర్మంపై వచ్చే మచ్చలను, మొటిమల తాలూకు గుర్తులను మాయం చేయడంలో కూడా ఈ పాలు అద్భుత ఫలితాలనిస్తాయి. వీటిలో ఉండే లాక్టిక్ యాసిడ్ చర్మంపై ఉండే మృతకణాలను సున్నితంగా తొలగించి కొత్త చర్మం వచ్చేలా చేస్తుంది. దీనివల్ల ముఖంపై ఉండే చిన్న చిన్న రంధ్రాలు తగ్గి, చర్మం మరింత నునుపుగ కాంతివంతంగా మారుతుంది. రసాయన బ్లీచింగ్ ఏజెంట్ల కంటే గాడిద పాలు చర్మానికి ఎంతో మేలు చేస్తాయి ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. చర్మ సౌందర్యం కోసం మనం చేసే ఖరీదైన ట్రీట్‌మెంట్లకు ఇవి ఒక గొప్ప ప్రత్యామ్నాయంగా నిలుస్తాయని నిపుణులు అంటున్నారు. నిత్యం యవ్వనంగా కనిపించాలనుకునే వారికి గాడిద పాలు ఒక దివ్యౌషధం వంటివి అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

ప్రస్తుత కాలుష్య భరిత వాతావరణంలో చర్మాన్ని రక్షించుకోవడం అందరికీ ఒక పెద్ద సవాలుగా మారింది. దుమ్ము, ధూళి వల్ల చర్మం త్వరగా ముడతలు పడి వయసు పైబడిన వారిలా కనిపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.



ఇటువంటి పరిస్థితుల్లో గాడిద పాల వినియోగం చర్మానికి ఒక రక్షణ కవచంలా పనిచేసి హానికరమైన కారకాల నుండి కాపాడుతుంది. పాలతో తయారైన సోపులు, లోషన్లు వాడటం వల్ల చర్మం తన సహజ సిద్ధమైన మెరుపును కోల్పోదు. కేవలం ముఖానికే కాకుండా పూర్తి శరీరానికి పాలను వాడటం వల్ల చర్మం అంతా ఒకే రంగులో సమానంగా ఉంటుంది. చర్మంపై వచ్చే ఇన్ఫ్లమేషన్ లేదా మంటను తగ్గించడంలో కూడా గాడిద పాలు అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తాయి. సహజమైన సౌందర్యం కోసం తాపత్రయపడే వారికి గాడిద పాలు ఒక శాశ్వతమైన పరిష్కారాన్ని అందిస్తాయి. నేటి ఆధునిక కాలంలో కూడా గాడిద పాల విశిష్టత ఏమాత్రం తగ్గకుండా సౌందర్య ప్రపంచంలో రారాజుగా వెలుగుతోంది.

గాడిద పాలలోని 'వైట్నింగ్' గుణాలు చర్మం రంగును మెరుగుపరచడమే కాకుండా ముఖానికి ఒక సహజమైన కాంతిని ఇస్తాయి. మార్కెట్లో దొరికే కృత్రిమ ఉత్పత్తుల కంటే గాడిద పాలు వాడటం వల్ల చర్మం లోపలి పొరల వరకు పోషణ అందుతుంది. ముఖంపై ఉండే గీతలు మాయమై చర్మం బిగుతుగా మారడం వల్ల వయసు పదేళ్లు తక్కువగా కనిపిస్తుంది. ఎటువంటి కెమికల్స్ లేని ఈ పాలు వాడటం వల్ల చర్మం అలర్జీలకు గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటుంది. ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకుంటూ, గాడిద పాలను సౌందర్య సాధనంగా ఉపయోగిస్తే అద్భుతమైన ఫలితాలను పొందవచ్చు. చర్మాన్ని శుద్ధి చేయడంలో టోన్ చేయడంలో గాడిద పాలకు మించినది మరొకటి లేదు. పాల విలువను గుర్తించి సరైన పద్ధతిలో ఉపయోగిస్తే ముడతలు లేని అందమైన ముఖం మన సొంతం అవుతుంది. ప్రకృతి మనకు అందించిన అద్భుత ద్రవాన్ని గౌరవిస్తూ మన సౌందర్యాన్ని పెంపొందించుకోవడం వివేకవంతమైన పని.

**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**94402 87170**



# నిరుపేదలకు కొండంత అండ కాంగ్రెస్ ప్రభుత్వం

## రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు

**కోరుట్ల,మార్చి 22(నినాదం):** తెలంగాణ రాష్ట్రంలో కడు నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా కొండంత అండగా నిలుస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు.

కోరుట్ల అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రమైన పట్టణంలోని జువ్వాడి భవన్‌లో ఆదివారం కోరుట్ల మండలం మోహన్ రావు పేట గ్రామానికి చెందిన గుండవేని శ్రీనివాస్ అనారోగ్యానికి గురికాగా ఆసుపత్రిలో చికిత్స కోసం రూ. 4 లక్షల 50 వేల విలువ గల ఎల్‌ఓసిని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అందజేశారు. బాధితుడు శ్రీనివాస్ కు ఎల్‌ఓసి మంజూరుకు కృషి చేసిన జువ్వాడి కృష్ణారావు కోరుట్ల



నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్ రావు పేట సర్పంచ్ సరికెల లతికా నరేష్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొంతం రాజం, నాయకులు పత్తిపాక రాజు, సంద మహేష్, జాగర్ల మహేష్, ముస్కెమ్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# చెరుకు .. పుచ్చకాయ రసం..

## సమ్మర్‌లో ఆరోగ్యానికి ఏది మంచిది..?



భానుడు భగభగమంటున్నాడు. మార్చి నెలలోనే ఎండలు ముదురుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. శరీరంలోని నీటి శాతం తగ్గిపోకుండా కాపాడుకోవడానికి పానీయాల అవసరం పెరిగింది. అయితే మార్కెట్లో దొరికే కృత్రిమ కూల్ డ్రింక్స్ కంటే, పోషకాలు నిండిన సహజ రసాల వైపు మొగ్గు చూపాలని నిపుణులు సూచిస్తున్నారు. అందులో చెరుకు రసం, పుచ్చకాయ రసం బెస్ట్ అని చెప్పాలి.

చెరకు రసం:
ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ప్రకారం.. చెరకు రసంలో సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఎండలో తిరిగి అలసిపోయిన వారికి ఇది ఎనర్జీ బూస్టర్‌లా పనిచేస్తుంది. పరిశోధనల ప్రకారం.. చెరకు రసాన్ని 35 నుండి 15 డిగ్రీల సెల్సియస్‌కు చల్లబరచి తాగడం వల్ల అందులోని పోషకాలు దెబ్బతినకుండా శరీరానికి చల్లదనాన్ని ఇస్తాయి. ఇందులోని పీచు పదార్థం వేసవిలో మందగించే జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది.

పుచ్చకాయ రసం:
కేవలం నీటి శాతం ఆధారంగా చూస్తే, పుచ్చకాయ రసం వేసవిలో అత్యంత అద్భుతమైన పానీయం. ఇందులో దాదాపు 90శాతం నీరు ఉంటుంది. విటమిన్ ఎ, సి మరియు లైకోపీన్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఇందులో ఉంటాయి. శరీరానికి తేమను అందించి, దాహాన్ని తీర్చడంలో పుచ్చకాయ రసం ముందుంటుంది. ఇది వాపును తగ్గించి, చర్మ సౌందర్యానికి, గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది.

ఏది ఎంచుకోవాలి?:
మీరు చేసే పనిని బట్టి ఎంపిక ఉండాలని న్యూట్రియెంట్స్ జర్నల్ పేర్కొంటోంది. ఎండలో శ్రమించే కార్మికులు లేదా ప్రయాణికులకు కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి చెరకు రసం ఉత్తమం. అధిక వేడి వల్ల ఒంట్లో నీరు తగ్గిపోయినట్లు అనిపిస్తే, తక్షణ హైడ్రేషన్ కోసం పుచ్చకాయ రసం బెస్ట్ ఛాయిస్.



# ఎండు చేపలు వండే ముందు..

## ఈ చిట్కా పాటిస్తే.. అస్సలు వాసన రాదు.. రెండు ప్లేట్లు లాగించేస్తారు



**ఎండు చేపలను చాలా మందికి తినాలనే ఉంటుంది. కానీ ఇది తిందామంటే నీచు వాసన వస్తాయి. దాని వలన చాలా మంది తినకుండా ఆగిపోతారు. అయితే, మీరు వండేటప్పుడు ఈ బామ్మల కాలం నాటి చిట్కాలు ఫాలో అయితే, వాసన రాదు.**

కమ్మగా వండుకుని తింటారు.

ఎండు చేపలను వాసనను పూర్తిగా పోగొట్టే చిట్కాలు:
మీరు కూర వండటానికి ప్రిపేర్ అయ్యే ముందు ఎండు చేపలను వేడి నీటిలో నానబెట్టి దానిలో ఐదు టేబుల్ స్పూన్స్ నిమ్మరసం, కొద్దిగా ఉప్పు వేసి 20 నిమిషాలు బెట్టి ఆ తర్వాత క్లీన్ చేసుకోవాలి.

ఇంకా ఎండు చేపలను వండేటప్పుడు ఒక టేబుల్ స్పూన్ అల్లం-వెల్లుల్లి పేస్ట్ వేసి బాగా వేయించాలి. ఇంకా మీరు కుక్ చేసేటప్పుడు వండేటప్పుడు ఒక టేబుల్ చింతపండు రసం కానీ ఒక కప్పు పాలు పోసిన కానీ నీచు వాసన మొత్తం పోతోంది.

ఒక గ్లాస్ లో కొద్దిగా నీరు తీసుకుని, దానిలో వెనిగర్ వేసి బాగా మరిగించడం వలన కిచెన్ లో వచ్చే ఎండు చేపల వాసన మొత్తం పోతుంది. అలాగే, బియ్యపు నీరుతో వీటిని కడిగితే వాసన, ఇసుక ఉన్నా కూడా పోతోంది.

ఉదయం పూట గేదె పాలు తప్పక దొరుకుతాయి. ఈ ఎండు చేపలను తీసుకుని పాలలో నానాబెడితే ఆ వాసన మొత్తం విరిరిపోతోంది. ఆ తర్వాత నీటితో రెండు నుంచి మూడు సార్లు కడిగితే వాసన అస్సలు రాదు



## కన్నుల పండుగగా
# శ్రీ రాధాకృష్ణ కళ్యాణం

**కోరుట్ల,మార్చి 22(నినాదం):** కోరుట్ల మండలం అయిలాపూర్‌లో శ్రీ రమణానంద మహర్షి గీతాశ్రమం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ శ్రీహరి స్వాముల కరకమలంలచే ఆదివారం రాధాకృష్ణ ల కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆశ్రమ 47 వార్షికోత్సవంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కోరుట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొంతం రాజం, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బండ్ల సరోజన, ఎల్లేటి పుల్లారెడ్డి, శశిధర్ రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.




# భారత జాతీయోద్యమ విధాతలు....
# షహీద్ భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్‌గురులు

భారతదేశ చరిత్రలో జాతీయ ఉద్యమం ఒక అపూర్వ ఘట్టం. జవహర్లాల్ నెహ్రూ తన ఆత్మ చరిత్ర డిస్కవరీ ఆఫ్ ఇండియాలో చెప్పినట్లు ప్రపంచంలోని ఏ ఉద్యమాలు దీనికి సాటి రావు అన్నది అక్షర సత్యం. భారత జాతీయ ఉద్యమ నేపథ్యమైన సంఘసంస్కరణలు జాతీ య ఉద్యమంలోని వందేమాతరం, స్వదేశీ హోం రూల్, సహాయ నిరాకరణ శాసన ఉల్లంఘన, క్విట్ ఇండియా ఉద్యమాలు జాతీయోద్యమంలో గాంధీ ఇతర నాయకులు విప్లవ వాదుల పాత్రను కూలశంకంగా చర్చించవచ్చు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా యావత్ భారతీయులం దరి సమిష్టి కృషి జాతీయ ఉద్యమం జాతీయత భావ వికాసానికి చాలా కాలమే పట్టింది. ఆ వికాసం సాంస్కృతి ఆర్థిక రాజకీయ రంగాల్లో మెల్లగా విస్తరించింది.

**భారత జాతీయ ఉద్యమ దశలు:**
భారత జాతీయ ఉద్యమం కేవలం ఒక సంఘటన కాదు. అది అనేక దశాబ్దాల పాటు జరిగిన రాజకీయ సంఘటనల సమాహారం. బ్రిటిష్ సామ్రాజ్య వ్యతిరేకత జాతీయ ఏకత్వం అనే రెండు భావనలు అన్ని సంఘటనలలోనూ కనిపిస్తాయి. 1857 సిపాయిల విప్లవంతో ప్రారంభమైన జాతీయ పోరాటం 1947 భారత దేశ స్వాతంత్ర సమూపార్జనతో సమాప్తం అయింది.

**విప్లవ వాదుల పాత్రబి తొలిదశ:**
1857 తిరుగుబాటుతో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం సమసిపోలేదు. తర్వాత కాలంలో అనేక గిరిజన రైతాంగ సమకాలిన పోరాటాల రూపంలో బ్రిటిష్ వారిని అది వెంటాడింది. బ్రిటిష్ ప్రభుత్వం రాజ్యాంగ ఉద్యమాల అణిచివేత అతివాదుల ఆత్రుత యువకుల్లో నూతన ఉత్తేజానికి కారణమైంది. అహింస యుతమైన విధానాల వల్ల బ్రిటిష్ పాలన అంతమవుతుందని వారు భావించారు. ఆతర్వాత బాంబులు వేయడం తుపాకీ సమకూర్చుకొని రహస్య స్థావరాల ఏర్పాటుతోపాటు బ్రిటిష్ అధికారులను అంత




మందించేందుకు వారు లక్ష్యంగా పెట్టుకున్నారు. భారత తూర్పు ప్రాంతాల్లో అనుశీలన యుగాంతర్ సంస్థలు పశ్చిమ ప్రాంతాలు అభినవ భారత స్థాపనతో విప్లవ కార్యక్రమాలు ఉధృతమయ్యాయి. వారు తమ కార్యకలాపాలు నెరవేర్చడంతో తీవ్ర పరిణామాలైన జైలు శిక్ష ఇతర ప్రాంతాల తరలింపు వంటి వాటితో పాటు చివరకు ప్రాణాలు సైతం కోల్పోయారు.

**విప్లవోద్యమం మలిదశ:**
1924 సహాయ నిరాకరణ ఉద్యమ వైఫల్యం 1917 రష్యా విప్లవం విజయం సాధించడం గాంధీజీ అహింసాహిత మార్గాల పై వచ్చిన కథనాల వాళ్ల విప్లవ జాతీయ వాద మలిదశ ఆరంభమైంది. 1924లో సచిన్ సన్యాల్, జోగేష్ చంద్ర చటర్జీ, రాంప్రసాద్ బిస్మిల్, చంద్రశేఖర ఆజాదుల నేతృత్వంలోని హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్ అనే విప్లవ సంస్థ ఆవిర్భవించింది. ఈ సంస్థ సభ్యులు లక్నో సహన్పూర్ మధ్యప్రయాణిస్తున్న రైలులో కాకోరి వద్ద రైల్వేకు చెందిన డబ్బులు దోపిడీ చేశారు. కాకోరి కోట్ల కేసుగా ప్రఖ్యాతిగాంచిన ఈ కేసులో 29 మందిని అరెస్టు చేసి విచారణ జరిపారు. అనంతరం రాంప్రసాద్ బిస్మిల్, అశ్వనావుల్లా ఖాన్, రసం లాల్, రాజేంద్ర లహరికి ఉరిశిక్ష విధించారు. దాంతో హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. అనంతరం 1928లో చంద్రశేఖర ఆజాద్ హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్ స్థాపించారు.


**1930.. 34 మధ్య సంఘటనలు:**
1930, 34 మధ్య ముఖ్యంగా పంజాబ్ బెంగాల్లో మునిపెన్నడు లేనంత తీవ్ర స్థాయిలో విప్లవ కార్యకలాపాలు చోటుచేసుకున్నాయి. 1931లో 9 హత్యలతో సహా 92 విప్లవ ఘటాలను జరిగాయి. సైమన్ కమిషన్ కు వ్యతిరేకంగా లాహోర్లోని లజపతిరాయ్ నేతృత్వంలో జరిగిన ప్రదర్శన పై లాఠీచార్జికి కారణమైన సాండర్స్ అనే పోలీసు అధికారిని భగత్ సింగ్, రాజ్ గురు, చంద్రశేఖర్ ఆజాదులు చంపేశారు. ఆ తర్వాత 1929 ఏప్రిల్ 8న ఢిల్లీలోని కేంద్ర శాసనసభలో భగత్ సింగ్ ఘటకేశ్వర్ దత్తులు బాంబులు విసిరి సంచలనం సృష్టించారు. ఈ రెండు సంఘటనలు కలిపి లాహోర్ కుట్ర కేసుగా పేర్కొన్నారు. ఈ కేసు విచారణ అనంతరం 1931 మార్చి 23న భగత్ సింగ్ రాజ్, గురుదేవులను ఉరితీశారు. భారత దేశ స్వాతంత్రం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన ధైర్యవంతులైన స్వాతంత్ర సమరయోధులను గౌరవించడానికి భారతదేశ ప్రభుత్వం ప్రతి సంవత్సరం మార్చి 23వ తేదీని షహీద్ దివస్ (అమరవీరుల దినోత్సవం) గా జరుపుకుంటారు. ఈ సందర్భంగా భారత జాతీయ ఉద్యమ విధాతలను, ఆ మహానుభావులను స్మరించుకోవడం ముదా భావం.

**-పందిరి శ్రీనివాసులు.**
**ఎంఏ (జాగ్రఫీ)**
**బిఈడి ఎంసీజె (జర్నలిజం)**
**పిజిడిసిజె**
**(జర్నలిజం) ఉస్మానియా యూనివర్సిటీ.**

నినాదం
# మార్కెట్

# అమెజాన్ నుంచి ఏఐ స్మార్ట్‌ఫోన్

సొంతంగా ఏఐ (కృత్రిమమేధ) స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించేందుకు ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ సన్నాహాలు చేస్తోంది. వాయిస్ అసిస్టెంట్ అలెక్సాతో పాటు అభివృద్ధి చేసిన అమెజాన్ సర్వీసెస్‌తో అనుసంధానం అయ్యేలా ఈ ఫోన్ ఉంటుందని సమాచారం. ఇది సంప్రదాయ స్మార్ట్‌ఫోన్ లాగా పనిచేస్తుందని.. దీంతోపాటు ఏఐ సేవలూ అందిస్తుందని చెబుతున్నారు. అమెజాన్ యాప్‌పై మరింత సులభంగా కొనుగోళ్లు చేసేందుకు, ప్రైమ్‌లో వీడియోలు చూసేందుకు, అమెజాన్ మ్యూజిక్‌లో సంగీతం ఆలకించేందుకు, ఆహార డెలివరీ సేవలు పొందేందుకు ఉపయోగపడేలా ఈ స్మార్ట్‌ఫోన్‌ను తీర్చిదిద్దాలన్నది అమెజాన్ ప్రణాళిక. ఈ ఫోన్ ధర ఎంత ఉండొచ్చు, ఎప్పుడు విపణిలోకి రావచ్చు, ప్రాజెక్టు ఆర్థిక వివరాల వంటివీ తెలియరాలేదు. ఒకవేళ అనుకున్నట్లు రాకపోతే, ఈ ప్రాజెక్టును పక్కనపడేసే వీలూ ఉందని




తెలిసింది.

# ఐపీఓకు ఎస్‌బీఐ ఫండ్స్, మణిపాల్ హాస్పిటల్స్!

## రూ.20,000 కోట్లకు పైగా సమీకరణ యత్నాలు

తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా మొత్తంగా రూ.20,000 కోట్లకు పైగా నిధులు సమీకరించేందుకు ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్, మణిపాల్ హాస్పిటల్స్ సిద్ధమవుతున్నాయి. ఈ నెలాఖరుకు సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేయడానికి ఈ రెండు సంస్థలు సన్నాహాలు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.




రూ.12.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ ఆస్తులతో దేశంలోనే అతిపెద్ద అసెట్ మేనేజర్‌గా ఎస్‌బీఐ ఫండ్స్ ఉంది. పూర్తి ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్)గా జరిగే ఈ సంస్థ ఇష్యూ పరిమాణం రూ.12,000- 13,000 కోట్ల మధ్య ఉంటుంది. ఈ కంపెనీలో ఎస్‌బీఐకు 61.76%, ఐరోపా సంస్థ అముండికి 36.26% వాటాలు ఉన్నాయి. ఎస్‌బీఐ 12.83 కోట్ల షేర్లు, అముండి 7.53 కోట్ల షేర్లు విక్రయించనున్నాయి. అంటే 10% వాటాకు సమానమైన 20.37 కోట్ల షేర్లను ఈ రెండు సంస్థలు కలిసి విక్రయించనున్నాయి.
టెమాసెక్ పెట్టుబడులు ఉన్న మణిపాల్ హాస్పిటల్స్ ఐపీఓ, రూ.9000-11000 కోట్లుగా ఉండొచ్చని అంచనా. ఐపీఓలో భాగంగా తాజా షేర్లతో పాటు ఓఎఫ్‌ఎస్ రూపంలో ప్రస్తుత ప్రమోటర్లు కూడా కొంత వాటా విక్రయించే అవకాశం ఉంది.

# వారంలో పసిడి 10%.. వెండి 15% తగ్గాయ్

పసిడి ధర అంతర్జాతీయంగా గతవారం 10% తగ్గింది. 2011 సెప్టెంబరు తర్వాత ఒక వారంలో పసిడి ధరలో అధిక క్షీణత ఇదే. 2008 అక్టోబరు తర్వాత పసిడి ఒక నెలలోనే అత్యధిక నష్టాన్ని నమోదు చేసే దిశగా ప్రస్తుతం సాగుతోంది. ఈ ఏడాది ప్రారంభం నాటి ధరలతో పోలిస్తే మాత్రం, ఇంకా పసిడి ధర 5% అధికంగానే ఉంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందే పసిడి ధర బాగా పెరగడం ఇందుకు కారణం. ఈనెల 20న (శుక్రవారం) పసిడి ఔన్సు (31.10 గ్రాముల) ధర 2.47% తగ్గి 4,492 డాలర్లకు దిగివచ్చింది. గతవారం ప్రారంభంలో ఇది 5000 డాలర్ల దరిదాపుల్లో ఉంది. వరుసగా మూడో వారమూ వెండికి నష్టాలు కొనసాగాయి. గతవారం ఈ లోహ ధర 15% వరకు క్షీణించింది. 2026 మొత్తం మీద చూస్తే వెండి ధర ఒక శాతానికి పైగా తగ్గింది. శుక్రవారం ఈ లోహ ధర ఔన్సుకు 4.78% తగ్గి 67.81 డాలర్ల వద్ద ముగిసింది. గతవారం ప్రారంభంలో 80 డాలర్ల వద్ద ఉండటం గమనార్హం. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో దేశాల ఆర్థిక వ్యవస్థలు నెమ్మదించొచ్చనే అంచనాలకు తోడు డాలర్ బలోపేతం కావడం వల్ల పసిడి, వెండి ఫ్యూచర్స్‌కు అమ్మకాల ఒత్తిడి ఎదురవుతోంది. చమురు ధరలు గణనీయంగా పెరగడం వల్ల కూడా, అంతర్జాతీయంగా మదుపర్ల సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం పడుతోంది.

## సామ్రాట్ అశోక్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ రాజేందర్



**కుత్బుల్లాపూర్, మార్చి 22 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం హెచ్ఎంటి మైదానం లో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి మందిరంలో ఘనంగా నిర్వహించిన సామ్రాట్ అశోక్ జయంతిలో వేడుకలలో మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్, బిజెపి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ రావుల శేషగిరి, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్ రెడ్డి, జె కె శేఖర్ యాదవ్, భరత్ సింహారెడ్డి నాతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సదానంద్, శ్రీనివాస్ రెడ్డి, రాజేష్ తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

### మాజీ మేయర్ మేకల కావ్య



**జవహర్ నగర్, మార్చి 22 (నినాదం):** ఆటో కార్మికుల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని ప్రభుత్వం వారిని పట్టించుకోని ఆదుకోవాలని జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య అన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ పరిధిలోని చెన్నాపురం సమీపంలో ఐక్యమత్యం ఆటో యూనియన్ కార్మికుల ఆధ్వర్యంలో గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మేయర్ మేకల కావ్య హాజరై మాట్లాడుతూ ఆటో కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని కార్మికులు ఐక్యమత్యంతో ముందుకు సాగితేనే హక్కులను సాధించుకుంటారని పిలుపునిచ్చారు. అనంతరం ఆటో కార్మికులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజశేఖర్, ఉద్యమకారుల ఫోరం జవహర్ నగర్ అధ్యక్షుడు సుధాకర్ చారి, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేవతామూర్తుల ఉత్సవాలకు హాజరైన ఎంపీ రాజేందర్



**కుత్బుల్లాపూర్, మార్చి 22 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి జీడిమెట్ల గ్రామం లో వెలసిన శ్రీ వెంకటేశ్వర,శివ, వీరాంజనేయ స్వామి వార్ల 22వ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ స్థానిక పార్టీ ముఖ్య నేతలతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రేణుక ఎల్లమ్మ పోచమ్మ దేవాలయ 35వ వార్షికోత్సవ కార్యక్రమంలో..**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ వెన్నెల గడ్డ లో శ్రీ రేణుక ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయ 35వ వార్షికోత్సవం సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి ఇతర నాయకులతో కలిసి హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

# ముఖ్యమంత్రి చేసేది చారాణ.. చెప్పేది రూపాయి

**అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీ**

**కొడంగల్‌లో భారీఎత్తున ఇసుక మాఫియా**

**మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పిఎన్ఆర్**



**కొడంగల్,మార్చి 22(నినాదం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసేది చారణ చెప్పేది రూపాయి అని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఎద్దేవా చేశారు.ఆదివారం కొడంగల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పనితీరు పై కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఘాటు గా స్పందించారు.గత నాలుగు రోజుల కింద అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీ మాత్రమే అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికి మూడుసార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారని,ప్రవేశ పెట్టిన బడ్జెట్ మంత్రుల ఖాతాల్లోకి వెళ్తుంది తప్ప పేద ప్రజలకు, సంక్షేమానికి, అభివృద్ధి కి ఉపయోగపడడం లేదన్నారు.ఉచిత బస్సు మినహాయించి ఆరు గ్యారంటీ లలో ఏ ఒక్కటి పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని దమ్ముంటే ఆరు గ్యారంటీలు అమలు చేసి చూపించాలని సవాల్ చేశారు.కొడంగల్ నియోజకవర్గ పరిధిలో భారీ ఎత్తున ఇసుక మాఫియా జరుగుతుందని,ఇసుక మాఫియా అడ్డుకునేందుకు అధికారులు చొరవతీసుకోవడం లేదని, ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతి రెడ్డి అండదండలతో భారీగా ఇసుక మాఫియా కొనసాగుతోందనీ ఆరోపించారు.ఇసుకమాఫియా జరిగితే జిల్లా కలెక్టర్ లను సస్పెండ్ చేస్తానన్న ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గంలో ఇసుక మాఫియా జరిగితే ఎవరిని సస్పెండ్ చేయలేదెందుకని నిలదీశారు.సంపూర్ణ రైతుఋణ మాఫీ చేశానంటున్న ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గంలో 40శాతానికి మించి ఋణమాఫీ జరగలేదనీ ఇంకా 60శాతం మంది రైతులకు ఋణమాఫీ జరగలేదని ,దీనిపై చర్చకు సిద్ధమా అన్నారు.కేసిఆర్ హయాంలో ఏడాది ఎకరానికి 10వేల చొప్పున రెండు పంటలకు సరైన సమయంలో రైతుబంధు అందేదని, పండించిన పంటను గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటను కొనుగోలు చేశామని పేర్కొన్నారు.తాను అధికారంలోకి వచ్చాక ఎకరానికి 15వేల చొప్పున ఏడాదికి మూడుపంటలకు రైతు భరోసా ఇస్తానన్న రేవంత్ రెడ్డి అధికారం లోకి వచ్చాక రైతు బంధు ఎగ్గొట్టారని, గుర్తుచేశారు.కాంగ్రెస్ పార్టీ అంటేనే భూకబ్జాలు, కుంభకోణాల పార్టీ అని, అందుకే కేంద్రంలో నామరూపాలు లేకుండా పోయిందని పేర్కొన్నారు.బిసి ల సంక్షేమానికి ఏడాదికి 20 కోట్ల బడ్జెట్ కేటాయిస్తానన్న మాట ఏమైందని నిలదీశారు.దళితులకు అంబేద్కర్ చేయూత ద్వారా 12లక్షలు,కళ్యాణ లక్ష్మీ లో తులం బంగారం, మహిళలకు గృహలక్ష్మి కింద 2500,వృద్ధాప్య పింఛను 4000, వికలాంగుల పింఛను 6000,మహిళలకు స్కూటీ లు ఇంకెప్పుడు ఇస్తారని మండిపడ్డారు.రాజీవ్ యువవికాస్ ద్వారా ఇస్తామన్న ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇప్పటి వరకు ఊసులేదనీ, రాజీవ్ యువవికాస్ కి వచ్చిన 11లక్షల దరఖాస్తులు ఎక్కడ దాచారని ప్రశ్నించారు.ఈకార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, సీనియర్ నాయకులు మధుసూదన్ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, దయాకర్ రెడ్డి, నర్మదా కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది





**ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి**

**రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపు**

**మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**

**మల్కాజిగిరి, మార్చి 22( నినాదం):** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నదని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సూచించారు. మల్కాజిగిరి సర్కిల్ ఆనంద్ బాగ్ లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో మల్కాజిగిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలకు సన్నద్ధం అవుతూ, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వై ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, మల్కాజిగిరి బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, అల్వాల్ ఏ బ్లాక్ అధ్యక్షులు అశోక్ రెడ్డి, చంద్రశేఖర్, సిఎల్ యాదిగిరి, బి కే శ్రీనివాస్, గుండా నిరంజన్, పిట్టల శ్రీనివాస్, మల్కాజిగిరి డివిజన్ అధ్యక్షులు సంపత్ గౌడ్, గౌతమ్ నగర్ డివిజన్ అధ్యక్షులు వైనాల ప్రవీణ్, మౌలాలి డివిజన్ అధ్యక్షులు వినోద్ యాదవ్, సత్యమూర్తి, పిట్టల నాగరాజు, యూసుఫ్ భాయ్, జీవన్ రెడ్డి, సిరిగిరి నర్సింగరావు, రాందాస్ సంతోష్ ముదిరాజ్, బాబు, సత్యనారాయణ, ఫరీద్, సయ్యద్ మబ్బు, ఆశా, పుష్పలత, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ హైదరాబాద్ మానవ హక్కుల నూతన కమిటీ



**అల్వాల్, మార్చి 22 (నినాదం):** అఖిల భారత మానవ హక్కుల కమిటీ ఛైర్మన్ డాక్టర్ దువా (న్యూ ఢిల్లీ) ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అల్వాల్‌కు చెందిన డాక్టర్ ప్రదీప్ అరుణోదయను గ్రేటర్ హైదరాబాద్ మానవ హక్కుల కమిటీ అధ్యక్షుడిగా అధికారికంగా ఏకగ్రీవంగా నియమించినట్లు వారు తెలిపారు. ఆయన బృందానికి పదవులు కేటాయించబడ్డాయి. అధ్యక్షుడుడా. ప్రదీప్ అరుణోదయ, పోషకుడునరహరి రావు,సలహాదారు వి. నర్సింగ్ రాజ్, న్యాయ సలహా దారులుగా కె. కరుణాకర్, వైస్ ప్రెసిడెంట్ గజానంద్ రాజ్,కార్యదర్శివి. రితీష్ రాజ్,కోఆర్డినేటర్ -- కె. దుర్గా ప్రసాద్, డిప్యూటీ కోఆర్డినేటర్ పి. శరణ్ కుమార్, హరిష శ్రీకృష్ణ,జాయింట్ సెక్రటరీ రాజ్ కుమార్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. రాహుల్, కె. విష్ణు వర్ధన్ ఆఫీస్ సెక్రటరీ వి. నిహారిక,రిపోర్టింగ్ ఆఫీసర్ నరేందర్ సింగ్,గత ఐదు సంవత్సరాలుగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో విజయవంతంగా నాయకత్వం వహించిన ఈ కమిటీ సభ్యుల కృషి, చురుకైన భాగస్వామ్యం కారణంగా, గ్రేటర్ హైదరాబాద్ స్థాయికి విస్తరణ సాధ్యమైందని డాక్టర్ ప్రదీప్ అరుణోదయ మీడియా సమావేశంలో తెలిపారు.కమిటీ యొక్క ప్రధాన లక్ష్యాలు ప్రజల్లో మానవ హక్కులపై అవగాహన పెంపొందించడం, ప్రజల సమస్యలను పరిష్కరించడం, ప్రతి పౌరుడి హక్కులు, గౌరవాన్ని పరిరక్షించడమే అని ఆయన స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో కమిటీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు.

## పోషకాహారమే ఆరోగ్యానికి మేలు

**• న్యూట్రిషనిస్టు కుసుమకుమారి**



**మల్కాజిగిరి, మార్చి 22( నినాదం):** నేటి సమాజంలో అనేక మంది సరైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోకపోవడం వల్ల వివిధ రకాల రోగాలకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రముఖ సీనియర్ న్యూట్రిషనిస్టు కుసుమకుమారి అన్నారు. ఆదివారం నేరేడ్ మెట్ ఓల్డ్ పీఎస్ చౌరస్తాలోని అశ్విన్ దయాగ్నొస్టిక్ సెంటర్‌లో నిర్వహించిన హెల్త్ అవేర్నెస్ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా ప్రముఖ సీనియర్ న్యూట్రిషనిస్టు కుసుమకుమారి పాల్గొని మాట్లాడుతూ శరీరానికి అవసరమైన ఫైబర్, ప్రోటీన్‌లతో కూడిన సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చని, ప్రస్తుత కాలంలో ఫాస్ట్ ఫుడ్ అలవాట్లు పెరగడం, శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల స్థూలకాయం, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అశ్విన్ దయాగ్నొస్టిక్ సెంటర్‌కు వచ్చే రోగులకు స్థూలకాయం నివారణ, సరైన ఆహార నియమాలు, జీవనశైలి మార్పులు వంటి అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు అనుసరించాల్సిన ఆహార విధానాలు, రోజువారీ వ్యాయామం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ప్రముఖ సీనియర్ నాయకులు నిరంజన్ యాదవ్ మాట్లాడుతూ తాను అనుసరిస్తున్న న్యూట్రిషన్ డైట్ గురించి వివరిస్తూ, శరీరంలోని ప్రతి అవయవం ఆరోగ్యంగా ఉండాలంటే సరైన ఆహార అలవాట్లు ఎంత ముఖ్యమో, ఏ ఆహారం ఏ అవయవానికి మేలు చేస్తుందో వివరంగా తెలియజేశారు. ప్రతి నెల మొదటి ఆదివారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హెల్త్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అశ్విన్ డైగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకులు గిరి గడ్డమీది తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ఆహార నియమాలు, ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంపొందించుకొని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని సూచించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



**మల్కాజిగిరి, మార్చి 22(నినాదం):** నేరేడ్ మెట్ డివిజన్ కి చెందిన గంగాధరి మహేష్ ఇటీవల అనారోగ్యం తో బాధపడుతు హాస్పిటల్ లో వైద్యం చేయించుకొనేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ కు అప్లై చెసుకోగా శాంక్షన్ అయిన రూ 41 వేల 500 వందల సీఎంఆర్ఎఫ్ చెక్కు ను ఆదివారం బోయన్పల్లి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఆదివారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా బాధితుడు మహేష్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రావుల అంజయ్య, చిందం శ్రీనివాస్, రేగటి శివకుమార్ గౌడ్, జె కె సాయి గౌడ్, నవీన్, సుమన్ గౌడ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సీతారాముల కల్యాణానికి తరలిరండి





**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జిఎంఆర్**

**పటాన్చెరు, మార్చి 22 (నినాదం):** శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని ఈనెల 25 తేదీ నుండి 29వ తేదీ వరకు పటాన్చెరు డివిజన్ పరిధిలోని శ్రీ కోదండ సీతారామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆదివారం ఉదయం దేవాలయం ఆవరణలో పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు ఆవిష్కరించారు. దశాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ కోదండ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రజలు, భక్తుల సహకారంతో ప్రతి ఏటా ఐదు రోజుల పాటు వేద మంత్రోచ్ఛరణాల మధ్య భక్తుల జయ జయ ధ్వనాలతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 27వ తేదీన వేలాది మంది భక్తుల సమక్షంలో అభిజిత్ లగ్న సుముహూర్తమున శ్రీ సీతారామచంద్రస్వామి వార్ల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఐదు రోజులపాటు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు భక్తులందరూ భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాలను దిగ్విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపాన దేవ్, మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అర్చక స్వామి నరసింహచార్యులు, సీనియర్ నాయకులు కుమార్ యాదవ్, పృథ్వీరాజ్, అశోక్, వెంకటేష్, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి





**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, మార్చి 22 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ హెచ్ఎంటి ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన మినీ కమ్యూనిటీ హాల్, స్వాగత తోరణ నిర్మాణ పనులకు బిఆర్ఎస్ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి, ప్రజల సామాజిక కార్యక్రమాలకు కమ్యూనిటీ హాళ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. సొసైటీ సభ్యులు సమిష్టిగా ముందుకు వచ్చి ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని, భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వివరించారు.ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, మాజీ కౌన్సిలర్లు శంబిపూర్ కృష్ణ, జక్కుల కృష్ణ యాదవ్, గోపాల్ రెడ్డి,జక్కుల శ్రీనివాస్, మాదాస్ వెంకటేష్ అనంతస్వామి, శంకర్ నాయక్, నాగరాజు, సుధాకర్ రెడ్డి,భరత్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ప్రెసిడెంట్ ఎండి అంజాద్ షాహిన్ వైస్ ప్రెసిడెంట్ టీవీ సత్యనారాయణ సెక్రటరీ పండరీ ట్రెజరర్ వికాస్ కుమార్, డైరెక్టర్లు తులసి దాస్, కళావతి, దివ్య జ్యోతి, అనంత రాములు, శ్రీశైలం మురళి గౌడ్, మల్లేశం, సూర్యప్రకాష్, పి.ఏ. చందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పేదలను, కార్మికులను గాలికొదిలేసిన రాష్ట్ర బడ్జెట్

**• సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్**



**కుత్బుల్లాపూర్, మార్చి 22 (నినాదం):** రాష్ట్ర బడ్జెట్లో సంక్షేమ రంగాలకు నిధుల కోతకు నిరసనగా షాపూర్ నగర్ లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ముద్దులాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో సంక్షేమ రంగాలకు ప్రభుత్వం కోత పెట్టింది. ప్రభుత్వం ప్రతిపాదిత బడ్జెట్‌ను సవరించి ఆయా తరగతులకు న్యాయం చేయాలని.రూ.3, 24,233 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థికమంత్రి ప్రవేశపెట్టారని 2025-26లో బడ్జెట్‌లో రూ.3,04,000 కోట్లకు పైగా ప్రతిపాదన పెట్టి సుమారు రూ.26వేల కోట్లు ఖర్చు పెట్టలేదని విమర్శించారు. ఈ బడ్జెట్ కూడా అదే విధంగా ఉందని ఆరు గ్యారెంటీల అమలుకు ఎలాంటి నిర్దిష్టమైన ప్రతిపాదనలు లేవని పేర్కొన్నారు.రైతు భరోసాకు రూ. 25 వేల కోట్లు అవసరముంటే,రూ.18 వేల కోట్లు మాత్రమే ప్రతిపాదించారని మహాలక్ష్మి పథకానికి మహిళలకు రూ.2,500 ఊసే లేదని తెలిపారు.రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకుపైగా ఇండ్లు లేనివారుంటే,ఈ బడ్జెట్‌లో కేవలం రూ.5,500 కోట్లు మాత్రమే ప్రతిపాదన చేశారని తెలిపారు.గృహ నిర్మాణానికి గతం కంటే కూడా ప్రస్తుత బడ్జెట్‌లో 1,344 కోట్లు కోత పెట్టారు.విద్యుత్ రంగానికి రూ.326 కోట్లు తగ్గించారనీ, మైనారిటీల,వెనుకబడిన తరగతుల, గిరిజనుల సంక్షేమానికి కేటాయింపులు లేవని ఎస్సీ,ఎస్టీలకు గత ప్రభుత్వం దళిత బంధు కింద రూ.10లక్షల చొప్పున ఇస్తామనగా,కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12 లక్షలు ఇస్తామని చెప్పిందనికానీ..బడ్జెట్‌లో కనీసం ఆ ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు ఉపాధి, నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదనీ, విద్యా,వైద్యం ప్రయివేటీకరణను అరికట్టాలంటే నిధులు కేటాయింపులు చేసి ప్రభుత్వ రంగంలో దీన్ని బలపరచాలని సూచించారు. నిధులు నామ మాత్రంగా పెంచినట్టుగా చూయించారూ వాస్తవానికి విద్య,వైద్యాన్ని ప్రయివేటీకరణ నుంచి అరికట్టడానికి అవి ఏమాత్రం సరిపోవని, నిధులు పెంచాలని అన్నారు. విద్యా,వైద్యం,ఉపాధి అవకాశాలు మెరుగుపడడానికి,దళిత,గిరిజన, బలహీన వర్గాల,మైనారిటీల సంక్షేమానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పసుల అంజయ్య, శ్రీశైలం, స్వాతి, యాదవ రెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించిన శ్రీనివాస్



**దుబ్బాక, మార్చి 22 (నినాదం) :** దుబ్బాక మండలం పెద్ద చీకోడు గ్రామానికి చెందిన మాజీ ఉద్యమకారుడు సంగం ప్రభాకర్ తండ్రి రాజయ్య ఇటీవల అకస్మాత్తుగా మరణించిన విషయం తెలిసిందే. ఈ విషాద ఘటన నేపథ్యంలో దుబ్బాక సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ గుర్రాల శ్రీనివాస్ ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గంభీర్పూర్ సర్పంచ్ బాణాల శ్రీనివాస్, కన్స్యూమర్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కుంభాల రవి, ×చీఖజ ఆర్టీసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, ఆస ముత్యం స్థానిక నాయకులు బొంగరం వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ శంకుస్థాపనకు తరలిన రైతులు



**చేగుంట: మార్చి 22 (నినాదం):** ఆదివారం చేగుంట మండలంలోని రైతు సోదరులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జరగనున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం, మరియు రైతు భరోసా, నిధుల విడుదల కార్యక్రమాన్ని వీక్షించడానికి , రైతులు వెళ్లడం జరిగింది. వీరితోపాటు చేగుంట, మక్క రాజుపేట ,ఇబ్రహీంపూర్, మరియు చందాయ పేట, వ్యవసాయ విస్తరణ అధికారులు, కూడా వెళ్లడం జరిగిందని తెలిపారు.

## ముఖ్యమంత్రి సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



**చేగుంట, మార్చి 22 (నినాదం):** మాసాయిపేట మండల కేంద్రంలోని మాసాయిపేట మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రామంతపూర్, పోతంశెట్టిపల్లి, చెట్లా తిమ్మాయిపల్లి, నడిమి తండా, వెనుక తండా, గిరిజన నాయకులు కార్యకర్తలు రైతులు రైతు భరోసా ఆయిల్ ఫామ్ శంకుస్థాపన చేయడం జరుగుతుందని కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు వ్యవసాయ అధికారి ఏఈఓ రజిత ఆధ్వర్యంలో రైతులను బస్సులో తరలించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి పెరుమండ్ల రమేష్, ముఖ దశరథ, బట్టి అంజా గౌడ్, పోశయ్య యాదవ్, నాసన్పల్లి సర్పంచ్ బొమ్మరం సర్పంచ్ భారీ ఎత్తున తరలి వచ్చారు.

## గ్రామానికి కీడు సోకిందని
# ఊరు వదిలిన గ్రామస్తులు




**ఉదయం నుండి సాయంత్రం వరకు ఊరి బయట వంటలు**
**మూఢ నమ్మకమా? లేక ఆచారమా?**

**జమ్మికుంట, మార్చి 22 (నినాదం):** జమ్మికుంట మండలంలోని గంగ్రపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులందరూ గ్రామానికి కీడు సోకిందని ఆదివారం ఊరు విడిచి ఊరి బయటకు వంటలకు వెళ్లారు. జమ్మికుంట మండలంలోని గంగ్రపల్లి గ్రామంలో గత కొద్ది రోజులుగా వరుస మరణాలు సంభవించడంతో పాటు వర్షాల వల్ల పంటలు నష్టపోతున్నామని గ్రామానికి ఏదో కీడు సోకిందని భావించిన గ్రామస్తులందరూ ఉదయం తెల్లవారుజామునే ఇండ్లకు తాళాలు వేసి బయట పరిసర ప్రాంతాలకు వెళ్లిపోయారు. గ్రామంలో దాదాపు ఇప్పటికి 20 నుండి 25 మంది వరస మరణాలు సంభవించడంతో గ్రామానికి ఏదో అరిష్టం కీడు సోకిందని భావించిన గ్రామస్తులు చిన్న పెద్ద ముసలి ముతక అనే భేదం లేకుండా తెల్లవారుజామునే బయటపరసర ప్రాంతాలకు వెళ్లి అక్కడే భోజనాలు వండుకొని భోజనాలు చేసి సాయంత్రం వేళ ఇంటికి వచ్చారు. అనాదికాలం నుండి గ్రామానికి కీడు సోకినట్టయితే గ్రామ ప్రజలందరూ గ్రామ పరిసర ప్రాంతాలకు వెళ్లి సాయంత్రం వరకు గడిపి రావాలని ఆచారం ఉండటంతో అదే పద్ధతిని పాటించారు.

**వరుస మరణాలతో బెంబేలు...**

గంగ్రపల్లి గ్రామంలో ఒకరు మరణించిన తర్వాత వారి పెద్దకర్మ పూర్తి కాకముందే మరొకరు మరణించడం జరుగుతుందని అలా సుమారు 25 మంది వరకు మరణించడంతో గతంలో వారి పూర్వీకులు ఇలాగే చేశారని ఇప్పుడు గ్రామ పెద్దలువేద పండితుల సూచనతో ఒకరోజు గ్రామంలో ఉండకుండా ఉదయాన్నే గ్రామాన్ని విడిచి వెళ్లడం జరిగిందని తిరిగి సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత గ్రామానికి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలో ఇదేవిధంగా ఈ గ్రామానికి ఆనుకొని ఉన్న విలాసాగర్ గ్రామంలో కూడా ఇలాగే జరిగితే అక్కడి గ్రామస్తులు కీడు సోకిందని గ్రామాన్ని వదిలిపెట్టి వారు కూడా ఊరు బయటకు వెళ్లారని ఆ తర్వాత ఆ ఊర్లో ఇలాంటి ఘట నలు పునరావృతం కాలేదని స్థా నికులు నమ్ముతున్నారు. ఏది ఏమైనా ఇది ఆచార మా లేక మూఢనమ్మ కమా అనేది అర్థం కాని పరిస్థితి.

## రాములోరి కళ్యాణానికి ప్రచార రథాలను ప్రారంభించిన ఈవో

**జమ్మికుంట, మార్చి 22 (నినాదం):** అపర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన శ్రీ సీతారామ చంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుండి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం ప్రచార రథాలను కార్య నిర్వహణ అధికారి కందుల సుధాకర్, ఛైర్మన్ ఇంగిలే రామారావు, ఆలయ ప్రధాన అర్చకులు శేషం వంశీధరాచార్యులు, మడికొండ నవీన్ శర్మలు ప్రారంభించారు. ఈనెల 27న సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులతో పాటు ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు.



అదేవిధంగా చిన్న రథం, పెద్ద రథం , నాగవల్లి, బండ్లు తిరుగుట, శ్రీరామ పట్టాభిషేకం తో పాటు బ్రహ్మోత్సవాలలో అనేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

# బడ్జెట్‌లో బిల్డప్ మాత్రమే!

**హామీల హడావిడిడ అమలు జీరో!**
**ప్రజలకు మిగిలింది నిరాశే- బీఆర్ఎస్ విమర్శలు**



**ధర్మపురి మార్చి 22(నినాదం):** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తాజా బడ్జెట్‌పై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ధర్మపురి పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేటాయింపులు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచిందని ఆరోపించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్ కుమార్‌లు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అధికారంలోకి వచ్చి దాదాపు 840 రోజులు గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అన్ని హామీలను అమలు చేస్తామని చెప్పి ప్రజలను నమ్మించి, ఇప్పుడు మాట తప్పారని ఆరోపించారు. ముచ్చటగా మూడోసారి బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పటికీ ఆరు గ్యారెంటీల అమలుకు సరిపడ నిధులు కేటాయించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్యారెంటీల అమలు కోసం ఎదురుచూస్తున్న 70 లక్షల మంది రైతులు, 22 లక్షల కౌలు రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారని తెలిపారు. కోటి మంది మహిళలు, లక్షలాది మంది విద్యార్థులు, వృద్ధులు, దివ్యాంగులు, దళితులు, బీసీలు వంటి అనేక వర్గాలకు ఈ బడ్జెట్ ఉపయోగపడలేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు కేవలం ప్రకటనలకే పరిమితమైపోయాయని, భూమిపై అమలు జరగక పోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నా రు. రైతులకు సరైన మద్దతు లేకపో వడం, యువతకు ఉపాధి అవకాశా లు కల్పించడంలో వైఫల్యం, మహిళల సంక్షేమంపై నిర్లక్ష్యం వంటి అం శాలు బడ్జెట్‌లో స్పష్టంగా కనిపిస్తు న్నాయని పేర్కొన్నారు. అలాగే, ఈ బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేసే విధంగా కాకుండా, ప్రజల ఆశలను దెబ్బతీసే విధంగా ఉందని బీఆర్ఎస్ నాయకులు అభిప్రాయపడ్డారు. తక్షణమే ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని ఆరు గ్యారెంటీల అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, సీనియర్ నాయకులు ఓడ్నాల మల్లేశం, సంగి శేఖర్, చిలువేరి శ్యాంసుందర్, మైనారిటీ నాయకులు ఆసీఫ్, రవూఫ్, చిర్నేని నర్సయ్యతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు లోక మల్లారెడ్డి, గొస్కుల జలేందర్, రాంచందర్ గౌడ్, సింహాచలం జగన్, మహేష్, అన్నమాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో విద్యార్థులకు
# నైతిక విలువల అవగాహన సదస్సు

**వ్యక్తిత్వ వికాసానికి విలువల విద్య కీలకం అని నిపుణుల సూచన**

**కరీంనగర్, మార్చి 22(నినాదం):** వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన కల్పించే సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి, వైద్య నిపుణులు శ్రీదేవి, డా. సంగీత రెడ్డి, డా. వనజా నరేందర్ రెడ్డి, యోగా గురువు లక్ష్మణ్, సంస్కృత అధ్యాపకురాలు అరుణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు



విద్యతో పాటు నైతిక విలువలను అలవర్చుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. తరగతి గదిలో నేర్చుకున్న విలువలను దైనందిన జీవితంలో ఆచరిస్తే సమాజంలో మంచి గుర్తింపుతో పాటు విస్తృత అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో విలువల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఈ విద్యాసంవత్సరం నుంచి భగవద్గీత శ్లోకాల పఠనం, సంగీతం, సంస్కృత బోధనను నిపుణుల ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఇవి నేర్చుకోవడం ద్వారా వ్యక్తిత్వ వికాసం మెరుగుపడి, ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయని వివరించారు. 4వ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు ప్రతి ఆదివారం మే 15 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పాల్గొని సామాజిక అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సదస్సులో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిట్టల రవీందర్‌ను పరామర్శించిన శాసనమండలి వైస్ చైర్మన్



**జమ్మికుంట, మార్చి 22 (నినాదం) :** తెలంగాణ రాష్ట్ర మత్స్య పారిశ్రామిక మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ మాతృమూర్తి ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించిన శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్. ఆదివారం వీణవంక మండలంలోని పిట్టల రవీందర్ నివాసానికి చేరుకున్న తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ పిట్టల రవీందర్ ను కలిసి వారిని పరామర్శించారు. అనంతరం వారి మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పింగళి శ్రీనివాస్ చొప్పరి సారయ్య జవ్వాజి చిరంజీవి జోడు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శృంగేరి పీఠాధిపతి జయంతి వేడుకల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్

-మహాయజ్ఞంలో పాల్గొని ఆశీస్సులు పొందిన కేంద్ర మంత్రి



**కరీంనగర్, మార్చి 22(నినాదం )** కర్ణాటక రాష్ట్రంలోని శృంగేరి శారదా పీఠాధిపతి జగద్గురు శ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారి 76వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించగా, కేంద్ర గృహ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఠం ఉత్తరాధికారి శ్రీ విధుశేఖర భారతీ స్వామీజీ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో మంత్రి పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సహస్ర నారికేళ హవనం మహాయజ్ఞం పూర్ణాహుతి కార్యక్రమంలో కూడా ఆయన హాజరయ్యారు. యజ్ఞం ప్రాముఖ్యతను పీఠ పూజారులు వివరించగా, విధుశేఖర భారతీ స్వామీజీ స్వహస్తాలతో మంత్రికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం బండి సంజయ్ శారదాంబ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శృంగేరి పీఠానికి చెందిన తెలంగాణ ప్రతినిధి వ్యాసోజల రాధాకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

**క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు అందించిన కొమ్మిడి రాకేష్ రెడ్డి**



**జమ్మికుంట, మార్చి 22 (నినాదం):** గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన అతిథి బిల్డర్ అధినేత కొమ్మిడి రాకేష్ రెడ్డి ముందుకు వచ్చారు. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన యువ క్రికెటర్లకు ఆయన జెర్సీలను (క్రీడా దుస్తులను) అందజేశారు. బేతిగల్ గ్రామ క్రీడాకారుల అభ్యర్థన మేరకు, సీనియర్ జర్నలిస్ట్ పాపారావు నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కొమ్మిడి రాకేష్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన క్రీడాకారులకు కావాల్సిన జెర్సీలను తక్షణమే ఏర్పాటు చేశారు. ఆదివారం బేతిగల్ క్రీడా మైదానంలో గ్రామస్తుల ద్వారా (గ్రౌండ్) క్రీడాకారులందరికీ ఈ జెర్సీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాకేశ్ రెడ్డి కి క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అతిథి బిల్డర్స్ అధినేత కాంగ్రెస్ నాయకులు కొమ్మిడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని వారిలో ఉన్న స్కిల్స్ ను బయటకు తీసి ప్రోత్సహిస్తే వారిలో ఉన్న నైపుణ్యం బయటికి వస్తుందని తద్వారా వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. ఈ రోజుల్లో చాలామంది యువతీ యువకులు మొబైల్ ఫోన్ వాడుతూ మైదానాలలో క్రీడలు ఆడటం లేదని ఇది మంచి పరిణామం కాదని ఆయన తెలిపారు.

# నాణ్యత విషయంలో రాజీ పడొద్దు

**పైలెట్ ప్రాజెక్టుగా మహిళా సంఘాలకు భవనాలు**




**బుగ్గారం, మార్చి22(నినాదం):** ప్రభుత్వ భవనాల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఏలాంటి రాజీ పడవద్దని ఆదివారం నాడు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుగ్గారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. బుగ్గారంలో రూ. 25 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు, రూ. 10 లక్షలతో నిర్మించే మహిళా సంఘాల వీవో భవనానికి శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో నక్క లక్ష్మికి మంజూరైన ఇందిరమ్మ ఇంటిని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. నిరుపేదల సొంతింటి కలలను కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తుందని మంత్రి అన్నారు. నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇళ్ల ను త్వరితగతిన పూర్తి చేస్తామని మంత్రి అన్నారు. అనంతరం మండలంలోని వెల్గొండ గ్రామంలో రూ. 5 లక్షలతో చేపట్టే డ్రైనేజీ పనులు, రూ. 15 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం, రూ. 10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల అవసరాల కోసం నిర్మించే నిర్మాణాలలో నాణ్యత లో ఏలాంటి రాజీ లేకుండా కాంట్రాక్టర్ ద్వారా పని చేయించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. భవన నిర్మాణాలు సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రథ మ ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో మహిళా సంఘా లకు కావలసిన వీవో భవనాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని నిర్మా ణాలు పూర్తి చేయాలని మంత్రి సూచించారు. వీవో భవనాల్లో కావలసిన మౌలిక సదుపాయాలకు అవసరమైతే అదనపు నిధులు ఇస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బుగ్గారం తహసిల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో, సర్పంచ్ నక్క రాజవ్వ రాజయ్య, ఉపసర్పంచ్ జంగా లావణ్య శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేముల సుభాష్ ఉపాధ్యక్షుడు నగునూరి నర్సగౌడు, వివిధ హోదాల నాయకులు అధికారులు మహిళలు పాల్గొన్నారు

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన: మంత్రి అడ్లూరి



**బుగ్గారం, మార్చి 22(నినాదం):** బుగ్గారం మండల కేంద్రంలో ఆదివారం నాడు పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్. వివరాల్లోకెళ్తే బుగ్గారం మండల కేంద్రంలో 15 లక్షల వ్యయంతో నిర్మించే సిసి రోడ్లుకు శంకుస్థాపన చేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మరో 10 లక్షల వ్యయంతో నిర్మించే మహిళా సంఘం వీవో భవనం నిర్మాణానికి భూమి పూజ చేశారు. 10లక్షల రూపాయలు మహిళా భవన నిర్మాణానికి సరిపోకపోతే అదనంగా నేను సాంక్షను ఇస్తానని నిర్మాణం మహిళలు భవిష్యత్తులో ఎక్కువ మంది కూర్చొని మీటింగ్ పెట్టుకునేటట్టు ఉండాలని అన్నారు. తదనంతరం ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేదవారి కళ నెరవేరుస్తున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని అన్నారు. మొదటి దశలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందించామని అదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని తెలిపారు.

## రాములోరి కళ్యాణానికి కోటి కోటి తలంబ్రాలు

-పది సంవత్సరాలుగా అందిస్తున్న శ్రీరామదాసు భక్తి మండలి సభ్యులు
-వారి సేవలను అభినందించిన ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు



**జమ్మికుంట, మార్చి 22 (నినాదం):** అపర భద్రాద్రిగా పేరుపొందిన శ్రీ ఇల్లంతకుంట దేవస్థానం లో ఈ నెల 27న జరిగే శ్రీరామనవమి ఉత్సవాలకు శ్రీ రామదాసు భక్తి మండలి చెల్పూర్ వారి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల కొరకు కోటి గోటి తలంబ్రాలు సమర్పించారు. శ్రీరామదాసు భక్త మండలి చెల్పూర్ జయశంకర్ భూపాలపల్లి అత్యంత భక్తిశ్రద్ధలతో పూర్తి సేంద్రియ పద్ధతిలో పలుమార్లు పూజలు జరిపి పండించిన వరి ధాన్యాన్ని భక్తులతో అత్యంత నియమ నిష్ఠలతో గోటితో ఒలిపించి గత పది సంవత్సరాలుగా భద్రాచలం ఇల్లంతకుంట సీతారాముల స్వామి కల్యాణానికి గోటి తలంబ్రాలు సమర్పిస్తున్నారు. ఆ రామయ్య సేవలో ఈసారి కూడా ఇల్లందకుంట ఆలయ చైర్మన్ గారి సమక్షంలో ఆలయ వేద పండితులు వంశీదర శర్మ నవీన్ శర్మ తలంబ్రాలు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో రామదాసు భక్త మండలి సభ్యులు తిరుపతి రేగూరి కిరణ్ రెడ్డి అంకిరెడ్డి రవి బైరగాని జైపాల్ వేణు సింగ్ రంగాచారి అన్నపూర్ణ ఆర్యవైశ్య సేవా సంస్థాన్ సభ్యులు కండెం వేణు అధ్యక్షులు కాసం నగేష్ పద్మజ జ్యోతి పద్మ సువర్ణ పాల్గొన్నారు.

## పందిళ్ళలో మిన్నంటిన బోనాల సందడి

**భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లికి మొక్కులు**



**హుస్నాబాద్ మార్చి 22(నినాదం):-** హుస్నాబాద్ మండలం పందిళ్ళ గ్రామంలో గ్రామ దేవత పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అత్యంత అంగరంగ వైభవంగా జరిగాయి. ఆదివారం కావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, డప్పు చప్పుళ్ళు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల మధ్య వేడుకలు మిన్నంటాయి. ఉదయం నుంచే మహిళలు సాంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలు ధరించి, తలపైన బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ సర్పంచ్ తోడేటి రమేష్ మాట్లాడుతూ. పందిళ్ళ గ్రామస్తులందరూ ఐకమత్యంతో, కులమతాలకు అతీతంగా పోచమ్మ తల్లి బోనాలను ఇంత వైభవంగా నిర్వహించుకోవడం సంతోషదాయకమని అన్నారు. మన పూర్వీకుల నుంచి వస్తున్న ఈ సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. గ్రామ దేవత ఆశీస్సులతో పందిళ్ళ గ్రామం పాడిపంటలతో వర్ధిల్లాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని తాను అమ్మవారి ని వేడుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు ఇబ్బంది పడకుండా పంటలు బాగా పండాలని, గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలను విజయవంతం చేసిన గ్రామ కమిటీ సభ్యులకు, మహిళలకు మరియు యువతకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ తెలిపారు.



## నిరుపేద కుటుంబానికి
## ఆలయ ఫౌండేషన్ ఆర్థిక చేయూత



**జమ్మికుంట, మార్చి 22 (నినాదం):** వీణవంక మండలం వల్బాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన కొత్త గట్టు సదానందం మంగలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు వారి పాప అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా వారి కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించినట్లు ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది వికలాంగులకు ఆలయ ఫౌండేషన్ ద్వారా జైపూర్ ఫుట్, వయోవృద్ధులు లకు వీల్ చైర్ లను అందిస్తున్నామని నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం ఉచిత కంటి వైద్య పరీక్షలు, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా తలసేమియా వ్యాధి చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలను ఉమ్మడి కరీంనగర్ ఆదిలాబాద్ వరంగల్ జిల్లాలలో పది సంవత్సరాల నుండి నిర్విరా మంగా నిర్వహిస్తూ ఆలయ ఫౌండేషన్ ద్వారా సేవలను అందిస్తున్నామని తెలి పారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నతమైన ఉద్యోగం చేస్తూ జన్మించిన గడ్డపైన సేవ చేయడం పలువురు సంతోషం వ్యక్తం చేస్తు న్నారు ఈ కార్యక్రమంలో ఆలయఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ నేత శివాలయం గుడి చైర్మన్ పల్లె బోయిన రాజ్ కుమా ర్ యాదవ్ అందె కుమార్ జీడి వెంకటస్వామి మారముల్ల సోను బూర ప్రభాకర్ తిదితరులు పాల్గొన్నారు

## జల సంరక్షణే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**కరీంనగర్, మార్చి 22(నినాదం):** వేసవి కాలంలో భూగర్భ జలాలు తీవ్రంగా తగ్గిపోతున్న నేపథ్యంలో, జల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. నీటి ఎద్దడి సమస్యకు శాశ్వత పరిష్కారం జల సంరక్షణ ద్వారానే సాధ్యమని, నీటిని కాపాడే బాధ్యత ప్రజలందరిదేనని ఆయన తెలిపారు. ఆదివారం వైశ్య భవన్‌లో మానేరు పర్యావరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా "సుజలాం సుఫలాం" గోడపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎండాకాలంలో త్రాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలంలో వర్షపు నీటిని సద్వినియోగం చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, అలాగే వ్యవసాయ భూముల్లో కూడా వాటిని ఏర్పాటు చేస్తే సాగునీటి సమస్య తగ్గుతుందని సూచించారు. మానేరు పర్యావరణ సమితి అధ్యక్షుడు తోట లక్ష్మణరావు మాట్లాడుతూ, ఎండిపోయిన బోర్ల చుట్టూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం,



గుట్టలు మరియు బీడు భూముల వద్ద కాంటూరు కందకాలు త్రవ్వడం, వాగులపై చిన్న చెక్‌డ్యామ్‌లు నిర్మించడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. సర్వోదయ అధ్యక్షుడు పెద్ది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, కలుషిత నీటి వినియోగం వల్ల అనేక వ్యాధులు వస్తున్నాయని, ముఖ్యంగా చిన్న పిల్లలు ఎక్కువగా ప్రభావితమవుతున్నారని హెచ్చరించారు. జల వనరులను కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేటర్ వంగల పవన్‌తో పాటు గంజి స్వరాజ్యబాబు, సామ నారాయణ పాల్గొన్నారు

## హుజూరాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



**హుజూరాబాద్, మార్చి 22(నినాదం):** పండుగ ముగియడంతో తిరుగు ప్రయాణాలు ప్రారంభమవడంతో హుజూరాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ తీవ్రంగా పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు, అలాగే ఉద్యోగాల కోసం వెళ్లే ప్రజలు పెద్ద ఎత్తున బస్టాండ్‌కు తరలివచ్చారు. దీంతో బస్టాండ్ మొత్తం ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. వరంగల్ వైపు వెళ్లే బస్సులకు భారీ డిమాండ్ నెలకొంది.

# పట్టువీడని విక్రమార్కుల్లా పనిచేయాలి

**పార్టీ విధేయులకే అధిష్టానం పట్టం కట్టింది**

**డీసీసీ అధ్యక్షుడు కొత్త కాపు శివసేనారెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, మార్చి 22 (నినాదం):** ప్రజలకు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా వెన్నంటూ ఉంటూ పట్టు వీడని విక్రమార్కుల్లాగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పనిచేయాలని డీసీసీ అధ్యక్షులు కొత్త కాపు శివసేన రెడ్డి కోరారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా పూర్తి స్థాయి కమిటీతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి లు హాజరయ్యారు. నూతనంగా నియమించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గానికి నియామక పత్రాలు ఇచ్చి శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధిష్టానం ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీని పూర్తిస్థాయిలో నియమించిందని అన్నారు. జిల్లా కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామ కమిటీలను, మండల కమిటీలను నియమించాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ ఆరు అంశాలపై సమీక్షించడం జరిగిందన్నారు. మొదటగా జిల్లా పార్టీ కార్యాలయాన్ని






త్వరలోనే నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రతిపాదించగా కమిటీ సభ్యులందరూ ఆమోదించడం జరిగిందని అన్నారు. కొత్తగా నియమించిన జిల్లా కమిటీ సభ్యులు ప్రజల కోసం, కార్యకర్తల కోసం క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. లేనియెడల వారి పనితీరును బట్టి సమలోచనచేసి మార్పులు జరిగే అవకాశాలు కూడా ఉన్నాయని స్పష్టం చేశారు. పదవులను అలంకరణప్రాయంగా చూడొద్దని, క్షేత్రస్థాయిలో పనిచేసి ప్రజల మనసు గెలవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి సెక్రెటరీ నందిమల్ల యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ డెలికేట్ శంకర్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, బ్రహ్మచారి, సాయి చరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, చీర్ల జనార్దన్ సాగర్, కాంగ్రెస్ యువజన జిల్లా అధ్యక్షులు ఆదిత్య, పాండు సాగర్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు యాదగిరి, పర్వతాలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**నూతనకల్, మార్చి 22 (నినాదం):** మండలంలోని చిన్ననెమిల ఎక్స్ రోడ్ సాయి సిద్ధార్థ ఫంక్షన్ హాల్లో ఆదివారం 2011-2012 శ్రీ రామకృష్ణ విద్యా మందిర్ పదవ తరగతి బ్యాచ్ పూర్తి చేసుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 15 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా గత మధురస్మృతులను జ్ఞాపకం చేసుకుంటూ సందడిగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులతో పాటు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గౌరవించాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవాలని లక్ష్యంతోనే గురువులు విద్య నేర్పుతారని చెప్పారు. విద్యార్థి ఫెయిల్ అయితే మొదట బాధపడేది గురువులేనన్నారు. ఈ సమ్మేళనంలో ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, కరస్పాండెంట్ ఉపేందర్, డైరెక్టర్లు యాదగిరి గౌడ్, రఘువీర్ రెడ్డి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు శ్రీనివాస్, వీరన్న, మల్లయ్య, నాగయ్య, లక్ష్మారెడ్డి, సురేందర్ రెడ్డి, వెంకటలక్ష్మి, ఊర్మిళ, విద్యార్థులు నవీన్, పార్థివ్, రాజేష్, సంపత్ రెడ్డి, ధర్మ, మహేందర్, సందీప్, రాజేష్ పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులు విడుదల



**కోదాడ, మార్చి 22(నినాదం):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం రైతుల భరోసా నిధులను విడుదల చేశారు. కార్యక్రమాన్ని త్రిపురవరం రైతు వేదిక ద్వారా రైతులు ప్రత్యక్షంగా వీక్షించారు. నిధులు అందినందుకు రైతులు సంతోషం వ్యక్తం చేశారు, ప్రభుత్వమే భవిష్యత్తులో కూడా రైతుల సంక్షేమం కొనసాగిస్తుందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి అన్వేష్, మండల సర్పంచులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తండా అభివృద్ధికి కృషి చేస్తా..

**గ్రామ సర్పంచ్ భూక్యా జానకిరాములు నాయక్**



**డోర్నకల్ /మరిపెడ, మార్చి 22(నినాదం):** ఎన్ఆర్ఈజీఎస్ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాలలోని అంతర్గత రహదారులు వేగవంతంగా అభివృద్ధి చెందుతున్నాయి. వర్షాకాలంలో బురద సమస్య తొలగడం, సురక్షితమైన ప్రయాణం, గ్రామ సౌందర్యం పెంపొందుతుంది. అందులో భాగంగానే మహబూబాద్ జిల్లా మూలమర్రి తండా గ్రామపంచాయతీ పరిధిలో ముత్యాలమ్మ గుడి నుండి అంగన్వాడి బడి సెంటర్ వరకు అలాగే గుగులోత్ హర్జా ఇంటి నుండి భుక్యా మాన్య ఇంటి వరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మంజూరైన సిసి రోడ్డును తండా సర్పంచ్ భూక్య జానకి రాములు నాయక్ ప్రారంభించడం జరిగింది. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ మరిపెడ మండలం కు చాలా దూరంలో మూలమర్రి తండ ఉందని, తండను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికే నిత్యం పనులు చేస్తానన్నారు. తండా ప్రజాలు నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించినారు కావున వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తండా సమస్యలను ఒక్కొక్కటిగా తీరుస్తానన్నారు. తండాలలో అన్ని వార్డులకు అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని అలాగే త్వరితగతిన సైడ్ డ్రైనేజ్ కాలువలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. తండా అభివృద్ధికి ప్రజలు కూడా సహకారం అందించాలని కోరారు.

**పిచ్చిమొక్కల తొలగింపు**

మూలమర్రి తండా గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని తండాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిచెట్లను తొలగించడానికి సర్పంచ్ పనులను ప్రారంభించడం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ రోడ్డుకి ఇరువైపులా ఏప్పుగా మొక్కలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కావున మొక్కలను తొలగించడం జరుగుతుందన్నారు. ప్రజల సౌకర్యార్థం రోడ్లు కూడా వెడల్పుగా ఉంటే ఎదురు ఎదురుగా వచ్చే వాహనాలు డీ కోనకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏ ఈ అజయ్ కుమార్, ఉప సర్పంచ్ భూక్యా కిషన్, వార్డు మెంబర్లు భూక్యా హరి సింగ్, భూక్య సునీత, వాంకుడోత్ నాగు, తేజావత్ శంకర్, ధరావత్ సోమని, కాంగ్రెస్ నాయకులు తేజావత్ భరత్ నాయక్, భూక్యా వేంకన్నా, వాంకుడోత్ బిక్ష, భూక్యా బిచ్చ, భీముడు, సీత్య, పాపా భాష్య, రాములు, రమేష్, ధరావత్ రామకృష్ణ, నాగ తండా పెద్దలు ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# మాకుల క్షేత్రంలో గోర్ బంజారాలకు అన్యాయం

**గోర్ బంజారా సమాజం పై చిన్నచూపు చూస్తున్న ప్రభుత్వం**

**లంబాడీల ఆలయంలో వారినే**

**పూజారులుగా నియమించాలి**

**అభివృద్ధికి నోచుకోని మాకుల ఆలయ క్షేత్రం**

**లైవ్ రాష్ట్ర సమన్వయకర్త గుగులోత్ రమేష్ నాయక్ జాదవ్**



**డోర్నకల్ /మరిపెడ, మార్చి 22(నినాదం):** మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని మాకుల తండాలోని భావ్ సింగ్ మహారాజ్ - మ్యారామా భవానీ క్షేత్రంలో గోర్ బంజారా సమాజంపై జరుగుతున్న వివక్షపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ వంటి ఉమ్మడి జిల్లాలకు చెందిన గోర్ బంజారా సమాజానికి ఈ క్షేత్రం ఆధ్యాత్మికంగా, చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యత కలిగినది. అయినప్పటికీ ఇటీవల కాలంలో ఈ క్షేత్రంలో గోర్ బంజారాల సంప్రదాయాలను విస్మరించడం, ముఖ్యంగా భోగ్ కార్యక్రమం మరియు అమ్మవారి నైవేద్య సమర్పణ వంటి ఆనవాళ్లను నిర్లక్ష్యం చేయడం తీవ్రంగా ఖండనీయమని భక్తులు పేర్కొన్నారు. 09-04-2025న ప్రముఖుల సమక్షంలో మ్యారామా భవానీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించబడిన విషయం తెలిసిందే. ఆ ప్రతిష్ఠకు సంబంధించిన మొదటి వార్షికోత్సవం 09-04-2026న పూర్తి కానున్న నేపథ్యంలో, సంప్రదాయబద్ధంగా ఉత్సవాలను నిర్వహించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఆలయ అధికారులు విడుదల చేసిన కరపత్రంలో ఎటువంటి ప్రస్తావన లేకపోవడం గోర్ బంజారా సమాజాన్ని అవమానపరిచే చర్యగా భావిస్తున్నారు. అలాగే, భావ్ సింగ్ మహారాజ్ పేరుతో నిర్మించబడిన ఈ క్షేత్రం ప్రస్తుతం కేవలం వెంకటేశ్వర స్వామి దేవాలయంగా మారుస్తూ, అసలు గుర్తింపును తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా గోర్ బంజారా భక్తులు పలు డిమాండ్లు వెల్లడించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే, గోర్ బంజారా సమాజం పెద్ద స్థాయిలో ఆందోళనలు చేపట్టడమే కాకుండా చట్టపరమైన చర్యలు కూడా ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయ కర్త జాదవ్ రమేష్ నాయక్, బావోజీల సంఘం జిల్లా నాయకులు రాజు ఆంగోత్, బాలా బోడా, వస్యా లునావత్, రాంజ గుగులోత్, సీతారాం బానోత్, లంబాడీల ఐక్య వేదిక నియోజక వర్గ ఇంచార్జీ ప్రవీణ్ నాయక్, లంబాడీల యువజన విభాగం రాష్ట్ర నాయకులు భూక్య గోపి నాయక్, బీజేపీ జిల్లా నాయకులు సుధాకర్ నాయక్, బానోతు వెంకన్న, సురేష్ నాయక్, బోడ రమేష్ నాయక్ , లంబాడీల ఐక్య వేదిక మరిపెడ మండల కార్యదర్శి రామరావు, మండల కన్వీనర్ భూక్యా రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


## సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**కోదాడ, మార్చి 22(నినాదం):** అనంతగిరి మండలంఅజ్మీర తండా గ్రామంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం నిధులతో సుమారు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆదివారం సర్పంచ్ అజ్మీరా శ్రీవిద్య బాలకృష్ణ శంఖుస్థాపన చేశారు. సర్పంచ్ శ్రీవిద్య మాట్లాడుతూ, "ప్రతి గ్రామస్తుడుసౌకర్యవంతమైన రహదారులలో ప్రయాణించేందుకు సాధ్యమైనంత త్వరగా పునర్నిర్మాణం జరుగుతున్నది. తండా మొత్తం రహదారులు పునరుద్ధరించబడతాయిఅని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు అజ్మీర రమేశ్ బాబు, ఉపసర్పంచ్ కళ్యాణి సురేష్, మాజీ సర్పంచ్ సాగర్, మరియు వార్డు మెంబర్లు ప్రతాప్, బోడమ్మ, అలివేలు, బాలాజీ, సిబ్బంది సురేష్, పాల్గొన్నారు.

# వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు మోడీ సానుకూలం

- **బిజెపి జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ**



**వనపర్తి ప్రతినిధి, మార్చి 22 (నినాదం):** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న వాల్మీకి బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సానుకూలంగా ఉన్నారని బిజెపి జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ చెప్పారు. ఆదివారం ఆయన ఒక సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. శ్రీక్షేత్ర వాల్మీకి ధామ్ పీఠాధీశ్వర్, రాజ్యసభ ఎంపీ బాలయోగి ఉమేష్‌నాథ్ మహారాజ్ న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారని చెప్పారు. అయోధ్య రామ జన్మభూమి ఆలయ సముదాయంలో మహర్షి వాల్మీకి ఆలయాన్ని స్థాపించినందుకు, అయోధ్య విమానాశ్రయానికి అంతర్జాతీయ మహర్షి వాల్మీకి విమానాశ్రయంగా పేరు మార్చినందుకు ఉమేష్‌నాథ్ మహారాజ్ ప్రధానమంత్రికి ధన్యవాదాలు తెలిపారని ఆయన చెప్పారు. అదేవిధంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో వాల్మీకి బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆయన కోరగా వారు సానుకూలంగా స్పందించారని వివరించారు. ఎంపీ బాలయోగి ఉమేష్ నాథ్ మహారాజ్ జూన్ నెలలో రెండు తెలుగు రాష్ట్రాలలో పర్యటించనున్నారని దుప్పల్లి నారాయణ పేర్కొన్నారు.

# గ్యాస్ కోసం ఎదురుచూపులు



**కోదాడ, మార్చి 22(నినాదం):** అనంతగిరి మండలంలోని పలు గ్రామాల్లో గ్యాస్ బుకింగ్ సమస్య తీవ్రంగా మారింది. "గ్యాస్ బుక్ అయింది, త్వరలో డెలివరీ" అనే మెసేజ్ వస్తున్నప్పటికీ వారం రోజులుగా గ్యాస్ అందడం లేదని, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను సంప్రదించిన వారు స్పందించడం లేదని, ఖానాపురం గ్రామానికి చెందిన గృహిణి ప్రసన్న తెలిపారు. వారం రోజులుగా ప్రయత్నిస్తున్నా గ్యాస్ రాలేదని వాపోయారు. సమస్యపై అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

## నూతన పైపులైన్ల ద్వారా నీటి సరఫరా



**కోదాడ, మార్చి 22 (నినాదం):** కోదాడ నుంచి ఖమ్మం జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పాత పైపులైన్లు ధ్వంసం కాగా.. అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామంలో నీటి సమస్య ఏర్పడింది. దీంతో సమస్య పరిష్కారానికి గ్రామ సర్పంచ్ వాడ కొప్పుల ఉమా లింగయ్య ఆధ్వర్యంలో నూతన పైపులైన్లు ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో నీటి కొరత తలెత్తకుండా, ముందస్తు చర్యలు చేపట్టి గ్రామస్థులకు నీటి సరఫరా అందేలా చర్యలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

## రిటైర్డ్ టీచర్‌ను పరామర్శించిన నిరంజన్ రెడ్డి



**వనపర్తి ప్రతినిధి, మార్చి 22 (నినాదం) :** వనపర్తి పట్టణంలోని 3వ వార్డుకు చెందిన రిటైర్డ్ టీచర్ యూసుఫ్ ఆరోగ్యం బాలేనందున మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదివారం వారి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. మాజీ మంత్రి వెంట జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, వెంకట్ సాగర్, ఇమ్రాన్, అలీ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉందేకోటి శివ మాతృమూర్తికి మాజీ మంత్రి నివాళులు



**వనపర్తి ప్రతినిధి, మార్చి 22 (నినాదం) :** వనపర్తి పట్టణంలోని 2 వ వార్డు నడిమి గేరికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉందేకోటి శివ మాతృమూర్తి ఉందేకోటి సంతోషనమ్మ మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదివారం వారి నివాసానికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనో ధైర్యాన్ని కల్పించారు. మాజీ మంత్రి వెంట జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ కౌన్సిలర్లు కాగితాల లక్ష్మీనారాయణ, బండారు కృష్ణ, కౌన్సిలర్ మురళి సాగర్, నాయకులు వెంకట్ సాగర్, జోహెబ్ హుస్సేన్, డానియల్, చిట్యాల రాము, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వనపర్తి ప్రతినిధి, మార్చి 22 (నినాదం):** వనపర్తి పట్టణంలోని 3వ వార్డుకు చెందిన ప్రజా వైద్యశాల అంబులెన్స్ డ్రైవర్ సాదిక్ మాతృమూర్తి పజిలత్ బేగం ఆకస్మికంగా మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదివారం వారి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. మాజీ మంత్రి వెంట బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, వెంకట్ సాగర్, ఇమ్రాన్, అలీమియా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పలు శుభకార్యాలకు హాజరైన మాజీ మంత్రి



**వనపర్తి ప్రతినిధి, మార్చి 22 (నినాదం):** వనపర్తి పట్టణంలోని 10వ వార్డుకు చెందిన విఆర్ఏ శరవంద మనుమడి రేయన్ష్ మొదటి పుట్టిన రోజు వేడుకలు ఆదివారం వనపర్తిలోని సితార గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో జరిగాయి. ఈ వేడుకకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై చిన్నారిని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. పట్టణంలోని 11వ వార్డులో జరిగిన పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామానికి చెందిన పుల్లయ్య - సీతమ్మ దంపతుల ఆహ్వానం మేరకు వారి నూతన గృహ ప్రవేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి వెంట నాయకులు విజయ్, కౌన్సిలర్ స్వాతి హరిబాబు, సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, వెంకటసాగర్, చిట్యాల రాము, పెద్దముక్కల రవి, వెంకటేష్ గౌడ్, గంగ ప్రసాద్, నాగరాజు, కావలి రవి, రామస్వామి, మన్యం పాల్గొన్నారు.

## కుల రహిత సమానత్వ సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయండి

**జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున**



**నల్లగొండ ప్రతినిధి, మార్చి 22 (నినాదం):** మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతుల సందర్భంగా కులరహిత సమానత్వ సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని కందుకూరి కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహనీయుల ఆశయాలను కొనసాగించడానికి భావితరాలకు సామాజిక వివక్ష, అన్యాయాలు, దళితుల సంక్షేమం మరియు అభివృద్ధి అంశాలపై సమగ్ర చర్చలు జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నేటికీ కుల వివక్ష తీవ్రమైన రూపం దాలుస్తోందని, కులం--మతం పేరుతో సమాజంలో విభజనలు సృష్టించే కుట్రలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై దాడులు, కులదురహంకార హత్యలు, కులాంతర వివాహాలపై దాడులు పెరుగుతున్నాయని అన్నారు. సమాన అవకాశాలు దళితులకు అందకుండా అడ్డంకులు సృష్టించే పరిస్థితులు బహిరంగంగా కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పూలే--అంబేద్కర్ జనజాతర ద్వారా కులరహిత సమానత్వం కోసం సామాజిక సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు సామాజిక సంఘాలు ప్రజా సంఘాలు ప్రజలు, ప్రజాతంత్ర వాదులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, రాష్ట్ర కమిటీ సభ్యులు రెమిడాల పరిసరాములు, జిల్లా సహాయ కార్యదర్శి ద్దైద శ్రీను, ఉపాధ్యక్షులు కోడిరెక్క మల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు దోరేపల్లి మల్లయ్య, యేసు, నల్ల రామస్వామి బొంగరల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్‌కు ఘన సన్మానం



**పెబ్బేరు, మార్చి 22(నినాదం):** పదవులు వస్తుంటాయి పోతుంటాయి కానీ చిన్ననాటి స్నేహం మాత్రం ఎప్పటికీ నిలిచే బంధమని మరోసారి నిరూపితమైంది. పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్‌కు ఆయన బాల్య మిత్రులు ఘన సన్మానం నిర్వహించడం అందరి మనసులను హత్తుకుంది. స్థానిక వల్లపు రెడ్డి ఫంక్షన్ హాల్‌లో పదవ తరగతి 1986-87 బ్యాచ్‌కు చెందిన చిన్ననాటి మిత్రుల ఆధ్వర్యంలో ఈ అభినందన సభ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ దంపతులకు గజమాల, శాలువాలతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి తమ అభిమానం చాటుకున్నారు. సభలో మిత్రులు మాట్లాడుతూ, తమలో ఒకరు మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు. నాయకులు, కొందరు ప్రజల సమస్యల నుంచి వస్తారు, మరి కొందరికి బాల్యం నుంచే వస్తారు, అక్కి శ్రీనివాస్ గౌడ్ కూడా బాల్యంలో మాకు నాయకత్వ లక్షణాలు ఉన్నపటికి, ప్రజా సమస్యలు తీర్చుకుంటూ నాయకుడు అయ్యాడు, మా మిత్రుడు నేడు ప్రజాసేవలో ముందంజలో నిలవడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా స్పందించిన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, తన జీవిత ప్రయాణంలో స్నేహితుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. అధికార హోదా తాత్కాలికం, కానీ చిన్ననాటి స్నేహం శాశ్వతం అని భావోద్వేగంతో అన్నారు. తన ఎదుగుదలకు వెన్నంటి నిలిచిన మిత్రులను ఎప్పటికీ మరువలేనని తెలిపారు. అలాగే, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. ప్రజల సహకారం ఉంటే పట్టణాన్ని ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దగలమని విశ్వాశించారు, అభివృద్ధి అంటే ప్రజా సమస్యల పరిష్కారమే అన్ని, వనపర్తి జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంత బిజీగా ఉన్నప్పటికీ మిత్రుల పిలుపు మేరకు ఈ కార్యక్రమానికి హాజరవడం ఎంతో ఆనందంగా అనిపించిందని అన్నారు. సభలో పాల్గొన్న కొంతమంది స్నేహితులు చైర్మన్‌తో గడిపిన పాత జ్ఞాపకాలను పంచుకుంటూ నవ్వులు పూయించారు. చిన్ననాటి సంఘటనలను గుర్తుచేసుకుంటూ అందరు ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమం మొత్తం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగింది.

## భక్తిగీతాల గాయకుడికి స్వర్ణనంది ఉగాది పురస్కారం




**కోదాడ, మార్చి 22(నినాదం):** ఖమ్మంలో మొగిలి ఎన్.ఎస్. ఎంటర్టైన్మెంట్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తిగీతాల గాయకుడు యరసాని రవియాదవ్‌కు "స్వర్ణనంది ఉగాది పురస్కారం 2026" ప్రదానం చేశారు. ఆయన భక్తి గీతాల ద్వారా ఆధ్యాత్మిక విలువలను ప్రజల్లో వ్యాప్తి చేస్తూ సమాజానికి సేవ చేస్తున్నారని నిర్వాహకులు కొనియాడారు. పురస్కారంగా ప్రశంస పత్రం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని అభినందించారు. రవియాదవ్ ఈ పురస్కారం తనకు మరింత ప్రేరణనిచ్చిందని తెలిపారు.

# దార్శనిక దేవాలయాలుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు





## లక్ష్మీపురం స్కూల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

### అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం

**ఖమ్మం ప్రతినిధి , మార్చి 22:(నినాదం) :** విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విద్య కోసం ఖర్చు చేసే ప్రతి రూపాయి భవిష్యత్ తరాలను నిర్మించేందుకు చేసే పెట్టుబడిగా భావించాలని ఆయన పేర్కొన్నారు. ఆదివారం మధిర నియోజకవర్గంలో పర్యటించిన ఆయన బోనకల్లు మండలం లక్ష్మీపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న భవన సముదాయాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకు న్నారు. పనులు అనుకున్న గడువులో పూర్తి కావాలంటే వేగం పెంచాలని, అవసరమైన చోట అదనపు వనరులు వినియోగించా లని ఆయన ఆదేశించారు. పనుల ఆలస్యం ఏ పరిస్థితుల్లోనూ అనుమతించ బోమని స్పష్టం చేశారు. పాఠశాల ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న జూనియర్ హాస్టల్, జూనియర్ మరియు సీనియర్ అకాడమిక్ బ్లాకులు, అడ్మినిస్ట్రేటివ్ భవనాలను ఆయన పరిశీలించారు. అలాగే విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడే మెకానికల్, సైన్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ ల్యాబ్ భవనాల నిర్మాణ పనులను కూడా ఆయన సవివరంగా తనిఖీ చేశారు. ప్రతి విభాగంలో పనులు ప్రణాళిక ప్రకారం జరుగుతున్నాయా లేదా అన్నదానిపై అధికారులను ప్రశ్నించారు. నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూ డదని గుత్తేదారులకు కఠినంగా సూచించారు. ప్రభుత్వ ప్రతిష్టకు, విద్యార్థుల భవిష్యత్తుకు సంబం ధించి ఈ ప్రాజెక్టులు అత్యంత ముఖ్యమైనవని తెలిపారు. బలమైన, సుదీర్ఘకాలం నిలిచే విధంగా భవనాలను నిర్మించాలని ఆయన అన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు కేవలం విద్య అందించే కేంద్రాలు మాత్రమే కాకుండా, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, నైపుణ్యాల అభివృద్ధికి కేంద్రాలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నగర స్థాయి సౌకర్యా లు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని ఈ పాఠశాలలు నెరవేర్చా లని చెప్పారు. ఇవి సాధారణ భవనాలు కావు... రేపటి భారతాన్ని తీర్చిదిద్దే దార్శనిక దేవాలయాలు" అని పేర్కొంటూ, ఈ పాఠశాలల ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి, పనుల ను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని ఆయన పునరుద్ఘాటించారు. విద్యార్థులకు ఉత్తమ వసతులు అందేలా ప్రతి అంశంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇంజినీ రింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ
ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలి
డ్యూటీకి హాజరు కాని సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ
మధిర ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్





**ఖమ్మం ప్రతినిధి మార్చి 22 (నినాదం) :** విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహ రించే సిబ్బంది పై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆదివారం మధిర ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ఎల్.డి.ఆర్.ఎం. రూమ్, డయాలసిస్ సెంటర్, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డ్, రేడియాలజీ బ్లాక్, ఓపి రూమ్ లను పరిశీలిస్తూ రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల వివరాలను ఆరా తీశారు. రోగులకు అందుతు న్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రోజువారీ కేసుల వివరాలు, ముఖ్యమైన రిజిస్టర్లు, నెలవారీ నివేదికలను, ఔషధాల లభ్యత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, సేవలు మరింత నాణ్యంగా అందేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ డ్యూటీలో లేని వైద్యులు, ఇతర సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి వైద్యులు హాజరు సంబంధించి రెగ్యులర్ గా రిపోర్ట్ తనకు అందించాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రికి రెగ్యులర్ గా వస్తున్న ఓపి వివరాలను కలెక్టర్ పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తే ఎక్కువ మంది రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహిం చాలని, అనవసరపు సి-సెక్షన్ ఆపరేషన్ చేయవద్దని అన్నారు. ఎమర్జెన్సీ వార్డ్ లో కేసు షీట్ లను పరిశీలిస్తూ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో రోగులకు రెగ్యులర్ గా అందుతున్న భోజనం నాణ్యత అంశాలను రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మధిర తహసీల్దారు రాంబాబు, సంబంధి త అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు వున్నారు.

# నాడు వడ్లు కొనాలి అన్నారు.. నేడు వరి పంట వేయొద్దంటున్నారు

నాడు ఆయిల్
పామ్ సాగు వద్దన్నారు..
నేడు ఆయిల్ పామ్ సాగు
ముద్దంటున్నారు
మాజీ మంత్రి సింగిరెడ్డి
నిరంజన్ రెడ్డి విమర్శ



**వనపర్తి ప్రతినిధి, మార్చి 22 (నినాదం) :** నాడు వడ్లు కొనాలి అన్నారు.. నేడు వరి పంట వేయొద్దు అంటున్నారు.. నాడు ఆయిల్ ఫామ్ సాగు వద్దన్నారు.. నేడు ఆయిల్ ఫామ్ సాగు ముద్దంటున్నారు.. పూటకో మాట మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. నర్మెటలో ఆయిల్ ఫామ్ పరిశ్రమ ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల వ్యాఖ్యలను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఖండించారు. నర్మెట్టలో అయిల్ పామ్ పరిశ్రమ కేసీఆర్ ప్రభుత్వం కృషి ఫలితమేనని, నర్మెటలో 16 నెలల్లో ఈ ప్రభుత్వం కృషి చేసి పరిశ్రమను పూర్తి చేస్తే వనపర్తి జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమ ఎందుకు పూర్తి చేయలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ విస్తరణకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారం, వ్యవసాయ మంత్రిగా నా కృషి ఎంతో ముఖ్యమైనదని, దీనిలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి ఏమాత్రం లేదని చెప్పారు. అసలు ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన పనులకు కాంగ్రెస్ సర్కారు రిబ్బన్ కటింగులు చేస్తుందని ఆయన విమర్శించారు. ఇక్రిశాట్ ఎవరు స్థాపించారో, ఎప్పుడు స్థాపించారో, ఎక్కడ ఉందో తెలియని ముఖ్యమంత్రి అది అమెరికా సంస్థ అంటున్నారని విమర్శించారు. రైతుభరోసా ఎకరాకు ఏడాదికి రూ. 15 వేలు అని రూ. 12 వేలకు కుదించారని, కుదించిన రైతుభరోసా కూడా రెండు సార్లు ఎగ్గొట్టారని, ఇప్పుడు 73 లక్షల మందికి ఒక ఎకరాకు ఇస్తాం.. మిగిలినవి తరువాత చూద్దాం అంటున్నారని ఆయన విమర్శించారు. ఇది గ్యారంటీ లేని ప్రభుత్వమని, ఇచ్చిన హామీలు మరచి రైతులను వేధిస్తున్నదని, నాడు ధాన్యం కొనుగోలుకు మోదీకి ఏం సంబంధం అన్నారని గుర్తు చేశారు. నేడు కేంద్ర మంత్రి చెప్పారు.. ధాన్యం కొనడం కుదరదని నిస్సిగ్గుగా చెబుతున్నారని ఇది చేతకానితనానికి నిదర్శనం అన్నారు.

# విద్యతోనే సమాజం జాగృతి హక్కుల సాధన సాధ్యం



శాసనమండలి ఉపసభాపతి
బండా ప్రకాష్ ముదిరాజ్

వనపర్తి ప్రతినిధి, మార్చి 22(నినాదం) విద్యతోనే సమాజం జాగృతి, విముక్తి, హక్కుల సాధన సాధ్యమవుతుందని శాసనమండలి ఉప సభాపతి డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్ అన్నారు. ముదిరాజ్ ఉద్యోగుల, పీహెచ్డీ విద్యావేత్తల సమాజసేవ లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న డాక్టర్ కె.రమేష్ బాబు ముదిరాజ్ ను ముదిరాజ్ ప్రగతి భవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శాసన మండలి ఉప సభాపతి డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మెన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ లు ఘనంగా సన్మానిం చారు. హైదరాబాదులోని నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రజా చైతన్యం, విద్య ప్రగతి కోసం, సమాజ సేవకు కృషి చేస్తున్న డాక్టర్ రమేష్ బాబు తీరును వారు ప్రశంసించారు. అనంతరం డాక్టర్ కే.రమేష్ బాబు ముదిరాజ్ మాట్లాడుతూ మన కోసమే కాదు.. జనం కోసం కూడా మన బాధ్యత గా భావించాలని అన్నారు. అనేక మంది మేధావుల ఆలోచన, త్యాగా లే సమాజ ఉన్నతికి, అభివృద్ధికి కారణమైనదన్నారు. విద్యతోనే సమాజ జాగృతి, విముక్తి, హక్కుల సాధన సాధ్యమని డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్ ముదిరాజ్ అన్నారు. విద్యావంతులు, సామాజిక చైతన్యం కలిగినవారు ప్రజాస్వామిక వ్యవస్థ, చైతన్యం గురించి నిరంతరం కృషి చేయాలని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మెన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్ ముధిరాజ్, ఐఏఎస్ పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**మునుగోడు, మార్చి 22 (నినాదం):** మునుగోడు పట్టణం లోని చండూరు రోడ్డు లో గల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో జరిగిన మునుగోడు మండలం సోలిపురం సర్పంచ్ నకిరేకంటి మురళి చిన్నారుల పట్టు వస్త్రాలంకరణ మహోత్సవ కార్యక్రమం లో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి. ఈ కార్యక్రమం లో, చండూర్ మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాస్, మునుగోడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నార బోయిన రవి ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఆరేళ్ల సైదులు, పాల్గొన్నారు



N NADAM CINEMA

## నడుమ అందాలు హైలైట్ అయ్యేలా
# స్టిల్స్ ఇచ్చిన హాట్ బ్యూటీ



ఆషికా రంగనాథ్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె కళ్యాణ్ రామ్ హీరోగా తెరకెక్కిన అమిగోస్ చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అయింది. ఈ మూవీ విజయం సాధించకపోవడంతో ఈ బ్యూటీకి కూడా పెద్దగా గుర్తింపు రాలేదు. దాంతో కొంతకాలం పాటు ఈమె సైలెంట్ గా ఉండిపోయింది. అలాంటి సమయంలోనే నాగార్జున హీరోగా తెరకెక్కిన నా సామిరంగ చిత్రంలో అవకాశం దక్కింది. ఈ మూవీ మంచి విజయం అందుకోవడం, ఇందులో తన అందాలతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో ఈ చిత్రం ద్వారా ఈ నటికి మంచి గుర్తింపు వచ్చింది. కానీ వరుస పెట్టి సినిమాల్లో అవకాశాలు మాత్రం దక్కలేదు. తాజాగా ఈ హీరోయిన్ నటించిన భర్త మహాశయులకు విజ్ఞప్తి చిత్రం ఈ సంక్రాంతి కానుకగా విడుదల అయింది. ఇది కూడా పెద్ద స్థాయి విజయాన్ని అందుకోలేదు. కానీ ఇందులో ఈ బ్యూటీ తన హాట్ అందాలతో యువతను అలరించింది. ఇప్పటివరకు తక్కువ సినిమాల్లో నటించినా తన అందాలతో ప్రేక్షకులను బాగానే అలరించిన ఆషికా సోషల్ మీడియాలో కూడా తన స్కిన్ షోతో అలరిస్తోంది. తాజాగా ఈ హాట్ బ్యూటీ తన 'ఇన్ స్టా'లో కొన్ని ఫోటోలను పోస్ట్ చేసింది. అందులో ఈమె లైట్ గోల్డ్ కలర్‌లో ఉన్న మెరిసే ఎంబ్రాయిడరీ సారీని ధరించింది. ఆ చీరకి మ్యాచ్ అయ్యేలా హెవీ వర్క్ ఉన్న స్లీవ్‌లెస్ బ్లౌజ్ వేసుకుంది. చెవులకు లాంగ్ డిజైనర్ ఇయర్‌రింగ్స్ ధరించి, తన కురులను అలా సైడ్ కి వదిలేసి తన హాట్ నడుము, ఎద అందాలు ప్రదర్శితమయ్యేలా ఫోటోలకు స్టిల్స్ ఇచ్చింది. ప్రస్తుతం ఆషికాకి సంబంధించిన ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

# ఏజ్ జస్ట్ నంబర్ అనిపిస్తున్న రజినీకాంత్..

## కుర్ర హీరోయిన్‌తో రొమాన్స్‌కు ఫ్యాన్స్ ఫిదా



సినిమా ఇండస్ట్రీలో హీరోలు ఎక్కువ శాతం తమకంటే వయసులో చిన్నవారితో కలిసి నటిస్తుంటారు. అలా నటించే సమయంలో ఆ ఇద్దరి జోడీ సరిగ్గా కుదరకపోతే ప్రేక్షకులు డిస్కనెక్ట్ అవుతారు. ఇంత వయసు తేడా ఉన్నవారు హీరో, హీరోయిన్లుగా నటించడం కరెక్ట్ కాదు అని కామెంట్స్ కూడా వస్తుంటాయి. కానీ కొంతమంది హీరోలు మాత్రం తమకంటే వయసులో చాలా చిన్నవారితో నటించి కూడా ప్రేక్షకుల ప్రశంసలను పొందుతారు. అలా ప్రశంసలను పొందిన జంటలు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో చాలానే ఉన్నాయి. అలాంటి జోడీనే రజనీకాంత్, సోనాక్షి సిన్హా. కొన్ని సంవత్సరాల క్రితం రజనీకాంత్ హీరోగా రూపొందిన లింగ చిత్రంలో సోనాక్షి సిన్హా హీరోయిన్ గా నటించింది. ఈ సినిమా 2014లో విడుదలైంది. ఆ సమయంలో రజనీకాంత్ వయస్సు 64 కాగా, సోనాక్షి సిన్హా వయసు కేవలం 27 మాత్రమే. దాంతో ఈ సినిమా స్టార్ట్ కావడానికి ముందు ఈ ఇద్దరి మధ్య వయసు తేడా చాలా ఉంది, ఈ జోడీ స్క్రీన్ పై కనిపించినప్పుడు వారి మధ్య కెమిస్ట్రీ బాగోలేకపోతే అదే సినిమాకు మైనస్ అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని కొంతమంది అభిప్రాయపడ్డారు. కానీ సినిమా విడుదల అయిన తర్వాత ఈ మూవీ ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది కానీ, ఈ జంట మాత్రం జనాలను బాగా అలరించింది. వీరి మధ్య వచ్చిన పాటలు, రొమాంటిక్ సన్నివేశాలు, ఇతర సన్నివేశాలు అన్నీ కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దాంతో ఆ సమయంలో రజినీకాంత్ వయసు విషయంలో చాలామంది పాజిటివ్ గా స్పందించారు. లింగ చిత్రంలో అనుష్క కూడా హీరోయిన్ గా నటించింది. కె.ఎస్. రవి కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందించారు.

# నేను మోడీకి అంధ భక్తురాలిని..

## రేణు దేశాయ్ పోస్టు వైరల్




ప్రముఖ నటి రేణు దేశాయ్ మరోసారి వార్తల్లో నిలిచారు. తాజాగా ఆమె సోషల్ మీడియా వేదికగా చేసిన కొన్ని వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాశంగా మారాయి. ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో వచ్చిన 'ధురంధర్ 2' (ఙష్ట్రబతీఖఅఎష్ఘుతీ 2) సినిమాను వీక్షించిన రేణుదేశాయ్ ఈ సినిమాకు సంబంధించిన రివ్యూను ఇన్ స్టా వేదికగా పంచుకుంది. ఈ క్రమంలో ఆమె చేసిన వ్యాఖ్యలు పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారాయి. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకుంటూ 'నేను బీజేపీకి, మన దేశ ప్రధాని మోడీకి గర్వించదగ్గ అంధభక్తురాలిని అని ఆమె ఇన్ స్టా స్టేటస్ లో పోస్టు చేశారు. సినిమాలో దావూద్ ఇబ్రహీం పాత్ర 'ఈ ఛాయ్‌వాలా భారత్‌లోకి వచ్చాక మనవాళ్లలో భయం పెరిగింది' అని చెప్పే డైలాగ్‌ను ఆమె రీ-షేర్ చేస్తూ మోడీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించారు. అలాగే దేశం కోసం ప్రాణాలర్పించే సాయుధ దళాలు, ఇంటెలిజెన్స్ ఏజెన్సీల పట్ల కనీస గౌరవం లేకుండా దేశం గురించి తప్పుగా మాట్లాడే వారు ఖచ్చితంగా 'ధురంధర్' సిరీస్ చూడాలని ఈ సందర్భంగా రేణు దేశాయ్ సూచించారు. మనం మన ఇళ్లలో హాయిగా నిద్రపోవడానికి వారి కృషే కారణమని పేర్కొన్నారు. కాగా ధురందర్ పార్ట్ -1 పార్ట్-2 సినిమాలు దేశ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ సినిమాలోని పలు సన్నివేశాల పట్ల పార్టీలు, నేతల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సినిమాలోని కంటెంట్‌పై మిశ్రమ స్పందనలు వెల్లువెత్తుతున్న వేళ తాను బీజేపీకి, మోడీకి అంధభక్తురాలిని అంటూ రేణు దేశాయ్ చేసిన వ్యాఖ్యలు మరింత హాట్ టాపిక్ గా మారాయి.

# నీలం రంగు బికినీలో రెచ్చిపోయిన హాట్ బ్యూటీ



టాలీవుడ్ నటి ప్రగ్యా జైస్వాల్ కెరియర్ ప్రారంభంలో కొంతమేర ఒడిదుడుకులను ఎదుర్కొంది. ఈమె మిర్చి లాంటి కుర్రాడు అనే చిత్రంతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. అయితే ఈ సినిమా పెద్దగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించలేకపోయింది. ఆ తర్వాత ప్రగ్యా జైస్వాల్‌కు కంచె సినిమాలో అవకాశం దక్కింది. ఈ సినిమా మంచి విజయాన్ని సాధించడంతో పాటు, ఇందులోని ఆమె నటనకు ప్రశంసలు లభించాయి. దాంతో ఒక్కసారిగా ఈమెకు మంచి గుర్తింపు వచ్చింది. అయితే ఆ తర్వాత కూడా ఈ ముద్దుగుమ్మకు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రల కంటే గ్లామర్ రోల్స్ ఎక్కువగా దక్కాయి. తన కెరియర్‌లో బాలకృష్ణ సరసన నటించిన అఖండ , డాకు మహారాజ్ చిత్రాలు మినహాయిస్తే పెద్దగా విజయాలు దక్కలేదని చెప్పాలి. ఇప్పటివరకు ఈమె నటించిన సినిమాల్లో ఎక్కువ శాతం అందాలతోనే ప్రేక్షకులను ఆకట్టుకుంది. సినిమాల్లో మాత్రమే కాకుండా సోషల్ మీడియాలో కూడా ప్రగ్యా జైస్వాల్ చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తరచూ తన హాట్ ఫోటోలను షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తూ ఉంటుంది. దీంతో ఆమె ఫాలోవర్స్ సంఖ్య రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. తాజాగా ప్రగ్యా తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని కొత్త ఫోటోలను షేర్ చేసింది. ఈ ఫోటోలలో స్విమ్మింగ్ పూల్‌లో నీలం రంగు బికినీ ధరించి మెట్లు ఎక్కుతూ, దిగుతూ, సైడ్ యాంగిల్‌లో చిరునవ్వుతో స్టిల్స్ ఇచ్చింది. ఈ ఫోటోలలో ఆమె అందాలు చాలా బాగా హైలైట్ కావడంతో ప్రస్తుతం ఈ హాట్ బ్యూటీకి సంబంధించిన పిక్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# బాలకృష్ణ-వివేక్ ఆత్రేయ కాంబోకు గ్రీన్ సిగ్నల్



నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఇంకా టైటిల్ ఖరారు చేయలేదు. ప్రస్తుతానికి 'చీదీఖ 111' అనే వర్కింగ్ టైటిల్‌తో షూటింగ్ కొనసాగుతోంది. ఈ సినిమాను దసరా సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమా అనంతరం బాలకృష్ణ, టాలీవుడ్ యువ దర్శకుడు వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నట్లు గత కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ కాంబినేషన్‌కు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు తెలుస్తోంది. ఇటీవల వివేక్ ఆత్రేయ చెప్పిన కథ బాలకృష్ణకు నచ్చడంతో వెంటనే కొత్త ప్రాజెక్ట్‌కు అంగీకారం తెలిపినట్లు సమాచారం. దాంతో దర్శకుడు వివేక్ ఆత్రేయ ఇప్పటికే ఆఫీస్ ఏర్పాటు చేసి ప్రీ-ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసినట్లు తెలిసింది. 'చీదీఖ 111' చిత్ర విడుదలైన తర్వాత ఈ కొత్త ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, 2027 సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మించనున్నట్లు తెలుస్తుంది.

ÔáPrinted, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787